# తెలంగాణ

## నిజాలు - కొన్ని వివరణలు

దుర్గం రవిందర్

ఈ రాతల కోసం ఆలోచనలు పంచిన గద్దరన్న, సబ్బండ వెంకన్న, నిరూప్, పాశం యాదగిరి, టంకశాల అశోక్, బి.ఎస్., శ్రీవత్స, కె. కృష్ణమూర్తి, వాగీష్, ప్రొ. లక్ష్మణ్, ఏలే లక్ష్మణ్, విఠల్, తుమ్మలపల్లి రఘురాములు, చెన్నయ్య, చక్రి, కొండన్న, మహంతి, శ్రీమాన్, బండారు, వై.సత్యనారాయణ, ఆర్వీఆర్, రామకృష్ణ, వరప్రసాద్, వాసుదేవరెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అయితగాని జనార్దన్, సీతారాములు, రమేష్ హజారీ, ఐ.టి.రమేష్, రాకేష్, వేనేపల్లి పాండురంగం, గార్లపాటి శ్రీనివాస్, కృష్ణారావు, సంగెం సూర్యారావు తదితరులకు కృతజ్ఞతలు.

| | |
|---|---|
| **తెలంగాణ నిజాలు–కొన్ని వివరణలు** | **Telangana nijalu - konni vivaranalu** |
| – దుర్గం రవిందర్ | by **Durgam Ravindar** |
| 2009, డిసెంబర్ | 2009, December |
| కవర్ డిజైన్ : | Cover Design : |
| **దత్తా** | **Datta** |
| కంపోజింగ్ & పేజిమేకప్ : | Composing & Pagemakeup : |
| ఏవిఎమ్ గ్రాఫిక్స్ | **AVM Graphics** |
| ప్రచురణ : | Published by : |
| సుపర్ణ పబ్లికేషన్స్ | **Suprna Publications,** |
| 10–12–1002, ఎమ్.నగర్, | 10-12-1002, M.Nagar, |
| ఓ.యు. క్యాంపస్, హైదరాబాద్. | O.U. Campus, Hyderabad. |
| వెల : రూ.40/– | Price : **Rs. 40/-** |
| ప్రింటింగ్ : | Printed at : |
| కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, | **Karshak Art Printers,** |
| హైదరాబాద్ | Hyderabad. |




**తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన**
**దాసోజు శ్రీకాంతాచారి**

## అంకితం

**ఇక తెలంగాణ రాదేమోనని,**
**మా బ్రతుకులింతేనా అని బెంగతో**
**ఈమధ్య ఆత్మహత్యలకు పాల్పడి**
**అశువులు బాసిన 81 మంది**
**తెలంగాణ ప్రేమికుల స్మృతికి అంకితం**

## ఇప్పుడెందుకీ పుస్తకం

ప్రధాన తెలుగు మీడియా మొత్తం దాదాపుగా ఆంధ్ర, సీమ పెట్టుబడిదారుల చేతిలో ఉంది. తెలంగాణా జర్నలిస్టులు పంపిన వ్యాసాలను, తెలంగాణ అనుకూల రాతలను ప్రచురించే పరిస్థితే లేదు. సంపాదకుడు, న్యూస్ ఎడిటర్ స్థాయిలో తెలంగాణా వారున్నా తెలంగాణా అనుకూల వ్యాసాలు ప్రచురించలేని నిస్సహాయ స్థితిలో ఉంటున్నారు. తెలంగాణా వారు తమకంటూ సొంతగా ఒక పత్రికనైనా స్థాపించుకోకపోవడం వెనుక బాటుతనమే. ‘ఉద్యోగమో, ఉద్యమమో నిర్ణయించుకొండి, తెలంగాణ అనుకూల రాతలు రాయవద్దు. సున్నితమైన అంశం జాగ్రత్తగా రాయండి అని రకరకాలుగా రాతపూర్వకంగా రాసి నోటీస్ బోర్డుల మీద పెట్టి హెచ్చరించిన గడసరి తనము ఆంధ్ర యాజమాన్యాలది.

పలు సందార్భాలలో దిన పత్రికలకు పంపినా ప్రచురితం కాని రాతలే ఇవి. ఇప్పుడిలా తేవడం సందర్భోచితం, ఉపయోగకరం అన్పించి అచ్చు వేస్తున్నాం.

## ఇల్లు అలకగానే పండగ కాదు
## ప్రకటనలతో తెలంగాణ రాదు

ప్రత్యేక రాష్ట్ర ప్రకటనలతో ఏమీ ఒరగదు. ఇల్లు అలకగానే పండగ కాదు. పెద్ద రాష్ట్రాలను విడగొట్టి, రాష్ట్రాల బ్లాక్ మెయిలింగ్‌లను ఒత్తిళ్ళను తగ్గించుకోవాలని కేంద్రం భావించినందునే "రాష్ట్ర విభజన-ప్రత్యేక తెలంగాణా" ప్రకటన వెలువడి ఉంటుంది.

కేంద్రం నిర్ణయాలను మార్చడానికి అటు ఆంధ్ర, సీమ ప్రాంత నేతలు, వ్యాపారులు ఏకమై సర్వ శక్తి, యుక్తులొడ్డి ఒత్తిడి తెస్తున్నారు. భూమ్యాకాశాలను ఏకం చేస్తున్నారు. ఇటు తెలంగాణా వారు, "మా ఇంటి వాకిలిని ఎవరో అలికారు పండగ ఐపోతుంది" అని సంబరపడుతున్నారు.

ప్రత్యేక రాష్ట్ర విభజన ఆలోచన మాత్రమే మొదలైంది, చట్ట బద్ధమైన ప్రక్రియ ఆరంభమే కాలేదు. మన ఒత్తిడి కొనసాగాల్సిందే. నిజానికి ఇప్పుడే తెలంగాణా వాదులు ఎక్కువ పని చేయాల్సి ఉంది. అందుకే మీతో ఆలోచనలు పంచుకుందామని.....



## తెలంగాణ ప్రత్యేకరాష్ట్ర ప్రకటన
## విద్యార్థుల విజయం - రాజకీయేతర పక్షాల విజయం

ఎట్టకేలకు కేంద్రం తెలంగాణా ఏర్పాటుకు సుముఖతం వ్యక్తం చేసింది. కేంద్రహోంమంత్రి చిదంబరం ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుపై ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఆ పార్టీ ద్వారా నియమితులైన ముఖ్యమంత్రి శ్రీ రోశయ్యను ఆదేశించారు. ఈ నిర్ణయం తెలిశాకే కె. చంద్రశేఖర్ రావు తన 12 రోజుల ఆమరణ నిరాహార దీక్షను విరమించారు. డిసెంబర్ 9 న అర్ధరాత్రి ఈ వార్త విన్న తెలంగాణా పదిజిల్లాల్లోని, 450 మండలాల్లో ఆనందం వెల్లివిరిసింది. ప్రతి ఊర్లో, ప్రతి ఇంట్లో ఆనందం కనిపించింది. ప్రతి తెలంగాణావాది సంతోషించారు.

విదేశస్తురాలు అయిన సోనియా దృఢసంకల్పంవల్లే ఈ నిర్ణయం సాధ్యమైంది. జనం కోరికను మన్నించడం ధర్మమని భావించి ఆమె తెలంగాణా ఏర్పాటుకు నిర్ణయించినట్లు ఎఐసిసి అనధికార వర్గాలు వెల్లడించాయి. ఇలా ఆమె తెలంగాణా వారి మనస్సుల్లో ఎప్పటికీ నిలచిపోయే నిర్ణయం చేశారు.

ఇప్పుడిక రాష్ట్రశాసన సభలో తీర్మానంచేసి కేంద్రానికి పంపడం, పార్లమెంట్‌లో తీర్మానాన్ని బలపరిచి రాష్ట్ర ఏర్పాటుకు తీర్మానం చేయడం లాంఛనంగా జరిగిపోతాయి. ఓ ఆరు నెలలు అటు ఇటు తెలంగాణా రాష్ట్రం ఏర్పడుతుంది. రాష్ట్ర శాసనసభ రద్దయి రాష్ట్రపతి రూల్ వచ్చినా ఆ పనిని పార్లమెంట్ చేసేస్తుంది. ఈ విజయం విద్యార్థులది. మూలకారణం కే.సి.ఆర్. అయినా సూత్రధారులు విద్యార్థులే. ఏ రాజకీయ పార్టీతో సంబంధంలేని విద్యార్థులు, సామాన్య జనులు సాధించిన విజయం ఇది.

## ఆత్మహత్యల వెనక విషాదాలు

ఈ స్వల్ప ఉద్యమ కాలంలోని 12 రోజులలో దాదాపు ముప్పై ఏడు మంది మరణించారు. వారి మరణాల వెనుక అనేక విషాదాలు దాగి ఉన్నాయి. చనిపోయిన వారందరూ బి.సి., ఎస్.సి., ఎస్.టి. కులాలకు చెందినవారు. ఏ రాజకీయ పార్టీకి చెందని సాధారణ జనం వారు. తెలంగాణాలో అన్ని రాజకీయ పార్టీలు, వామపక్షవాదుల వైఫల్యంలోంచి వాళ్ళ మరణాలు సంభవించాయి. ఇక తెలంగాణా రాదేమో. మా బ్రతుకులు ఇంతేనేమో? అనే బెంగతో వారు చావును వరించారు. ఒక్కో మృతుడి గతం, వాళ్ళ పుట్టుపూర్వోత్తరాలు, తాతముత్తాతల ఆస్తిపాస్తులు, అవి పరాధీనం అయిన తీరు గమనిస్తే ఆ మరణాలకు కారణాలు సులువుగా అర్థమవుతాయి.

ఊర్లో ఇల్లు, శివార్లలో భూమి కోల్పోయారు. సంస్కృతి ఛిద్రమైంది. బ్రతకడానికి కనీస ఆశ కన్పించడంలేదు. "ఆమ్దాని ఆఠనా, ఖర్చు బారానా" అనే రీతిలో ఎంత చేసినా తీరని అప్పులు, ఆకలి చావులు, దరిద్రం, వనరులు పరాధీనమై, వృత్తి పనికి రానిదై, సంస్కృతి పలచనై ముంబాయి, దుబాయి వలసలు, శృతి తప్పిన కుటుంబాలు, అమ్మాయిల అమ్మకాలు, ఆత్మహత్యలు వీటి నేపథ్యంలోంచి ఈ మరణాలను చూడాలి. సిరిసిల్లాలో ఒక నేతన్న ఇంకో గంటలో ప్రసవించనున్న నిండు చూలాలు అయిన భార్యను వదిలి ఆత్మహత్య చేసుకున్నారు. కోస్తాంధ్రులు నిర్మించే సినిమాలో వలెనే సరిగ్గా ఆయన ఆత్మహత్య చేసుకున్న వేళకే ఆ ఇల్లాలు ఆసుపత్రిలో ప్రసవించి బాబును కన్నది. ఆ బాబుకు ఏ ఆంధ్రుడైనా వచ్చి వాడి నాయన ఎందుకు, ఎలా చనిపోయాడో వివరించగలరా? ఆ బాలింత దు:ఖాన్ని తీర్చ గలరా? రైతు హోదా కోల్పోయిన నల్గొండ పెద్దాయన ఒకాయాన దినకూలీగా మారి అవసాన దశలో భిక్షగాడయ్యాడు. చివరలో జబ్బుపడి ఉస్మానియా ఆసుపత్రిలో చనిపోయాడు. ఆయనకు ఇద్దరు కొడుకులు, అంత్యక్రియలకు డబ్బులు లేక శవాన్ని ఆసుపత్రిలోనే వదిలి పారిపోయారు. ఇలాంటి దౌష్ట్యాలకు మూలకారణం ఆంధ్రుల పరిపాలనే అనడంలో అతిశయోక్తి ఉంటుందా? ఈ తెలంగాణ వేదనలను చూసి అర్థం చేసుకున్నవారు తెలంగాణా వారి ప్రత్యేక రాష్ట్రం డిమాండ్ సరైనదని భావించరా?

## సోనియా నిర్ణయం ఎవరికి రుచించలేదు?

సోనియా నిర్ణయం, చిదంబరం ప్రకటన కొందరికి జీర్ణం కావడంలేదు. అన్ని పార్టీలలోని వలసవాదులు దీన్ని నిరసిస్తున్నారు. పరిణామాలు ఎటు దారితీయనున్నాయో అనూహ్యంగా



ఉంది. ప్రధానపార్టీల శాసనసభ్యుల రాజీనామాల ప్రహసనం మొదలైంది. దాదాపు 145మంది ఎమ్.ఎల్.ఏ.లు రాజీనామా చేశారంటే వారి ఉక్రోషం ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతోంది. ఆ వర్గాల లాభాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవడానికి ఈ రాజీనామాలు ఉపకరిస్తాయి. ఆరోజు రాత్రి వరకు అధిష్ఠానం నిర్ణయం శిరోధార్యం అన్న ప్రధాన పార్టీలవారు 6 - 7 గంటల్లో ప్లేటు ఫిరాయించారు. ఇది వలసవాదుల దొంగ మనస్తత్వం. 1956 నుండి సమైక్యాంధ్ర వాదం పేరుతో సీమాంధ్రులు ప్రతిసారి ఇలాగే వేలుకేస్తే కాలికి, కాలికేస్తే వేలికి అన్నట్టు ప్రవర్తిస్తూ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును అడ్డుకుంటున్నారు. తద్వారా అటు ఆంధ్ర, రాయలసీమ, ఇటు తెలంగాణ అభివృద్ధి కాకుండా అడ్డుపడుతూ వారు మాత్రం కోట్లకు పడగలెత్తుతున్నారు.

## వలసవాదులు ఎవరు?

బ్రతుకు దెరువుకోసం పొట్టచేత పట్టుకొని వచ్చినవారిని తెలంగాణావారు వలసవాదులు అనుకోవడంలేదు. ఇలాంటి వారిని ఇంకా ఇంత మందిని తెలంగాణా చిరుహాసంతో భరిస్తుంది. బ్రతుకులు కొట్టేవారిని, భూములు, ఆస్తులు ఆక్రమించుకొని కోట్లకు పడగెలెత్తినవారిని వలసవాదులంటున్నారు. తమ అవసరాలకు మించి ఆస్తులను కూడబెట్టుకున్నవారు వలసవాదులు. రియల్ ఎస్టేట్ దందాలు చేసేవారు వలసవాదులు. సచివాలయంలో చక్రం తిప్పేవారు వలసవాదులు. ప్రభుత్వ అండతో భూములు, స్థలాలు, ఉద్యోగాలు అన్యాయంగా కొల్లగొట్టినవారు వలసవాదులు. ఇలాంటివారికి వ్యతిరేకంగానే తెలంగాణావారు ఉద్యమించింది. ఈ విషయంలో తెలంగాణా వారికి స్పష్టత ఉంది.

హైదారాబాద్ అభివృద్ధికి పెట్టుబడులు పెట్టామంటున్నారు. ఏ పెట్టుబడులు ఎక్కడ నుంచి తెచ్చారు? కోయంబత్తూరు, ముంబాయిలలోలాగా పరిశ్రమలు స్థాపించి ఉత్పాదన ద్వారా సంపద సృష్టించారా? దళారి పనులతో హైదరాబాద్ చుట్టుపక్కల భూములను లక్షకు కొని కోటికి అమ్ముతూ తిమ్మిని బమ్మినిచేసి, దాన్నే కష్టం అంటే ఎలా? "మ్యానుప్లేషన్" కష్టం ఎలా అవుతుంది. హైదరాబాద్‌లో లేదా తెలంగాణాలో మొదట కాలుపెట్టిన రోజు మీ వెంట ఏమి తెచ్చారో తర్వాత కొలది కాలంలోనే ఎలా సంపన్నులయ్యారో యోచించుకోండి. మీ కష్టం ఏమిటో మీకే తెలుస్తుంది.

## బ్రతుకు కోసం వలసలు - బ్రతుకులు దోచుకొనే వలసలు

ఆంధ్ర పట్టణాలలో ఎక్కడైన కనీసం పట్టుమని పది తెలంగాణ కుటుంబాలున్నాయా?

లేవు, కాని తెలంగాణలోని ఏ పచ్చని గ్రామంలోనైనా పది కన్నా ఎక్కువ ఆంధ్ర కుటుంబాలున్నాయి. నూరు శాతం వలస వారితో ఏర్పడిన గ్రామాలకు గ్రామాలే తెలంగాణలో ఉన్నాయి. సరే హైదరాబాద్ రాజధాని కాబట్టి వచ్చాము అంటున్నారు, మరి తెలంగాణ గ్రామాలు, పట్టణాల్లోకి ఎందుకని వచ్చినట్టు? ఎంకి పెళ్ళి సుబ్బిచావుకు వచ్చినట్లు ఈ భూఆక్రమణ దారుల తప్పుడు వాదనలు సాధారణ వలస వాదులను మూల్యం చెల్లించేలా చేస్తాయి. ఈ విషయాన్ని సాధారణ వలసదారులు గమనించాలి. కొద్దిపాటి ఆస్తిపాస్తులు, ఒక ఇల్లు, ఒక ఉద్యోగం ఉన్న వారెవరూ తెలంగాణ వాదుల దృష్టిలో వలస వాదులు కారు. వీరితో తెలంగాణా వారికి పేచీ ఏమీ లేదు. వీరిని అడ్డుపెట్టుకొని అక్రమ ఆర్జనపరులు తమ ఆస్తులను కాపాడు కోవాలని చూస్తున్నారు. వీరిని రెచ్చగొడుతున్నారు. 15 వేలకోట్లు. వెయ్యికోట్లు, వందకోట్లు ఒక వ్యక్తి దగ్గరికి ఎలా వస్తాయి.అదంతా ప్రజల డబ్బుకాదా? వారి డబ్బులు అన్యాయంగా, అధర్మంగా మీ స్వంతం చేసుకోవడం మంచిదేనా.. మీ పిల్లలకు, మీకు ప్రజల ఉసురు తగలదా? ఇలాంటి వారు అటు ఆంధ్రకు, ఇటు తెలంగాణకు వెరసి దేశానికి ద్రోహులు, చీడపురుగులు. వీరి విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

తెలంగాణ వారు మహారాష్ట్రకు, మస్కట్ దుబాయ్‌లకు వలస పోలేదా, అలాగే మేం ఇక్కడికి వచ్చాం అని ఆంధ్రులు వితండ వాదం చేస్తున్నారు. మస్కట్, దుబాయ్‌లకు పోయిన లక్షలాది మంది ఐదున్నర దశాబ్దాల ఆంధ్రపాలకుల దౌష్ట్యం వల్లే వెళ్ళారు. గ్రామీణ ప్రాంతాల్లో దొరల భూముల ఆక్రమణకోసమే ఆంధ్రులు పుట్టించి, పోషించిన నక్సలైట్ ఉద్యమం సృష్టించిన నరమేధమే కరీంనగర్, నిజామాబాద్ యువతను దుబాయ్ బాట పట్టించింది. మరెందరినో కాటికి పంపించింది.

బొంబాయి, షోలాపూర్, బివాండిలకు వలస వెళ్ళిన తెలంగాణ వారు బ్రతుకు బాట వెతుక్కుంటు వెళ్ళారు. వారు, అక్కడ మరాఠీని నేర్చుకుని ఎంతో ఒదిగి ఉన్నారు. వారి మీద ఆంధ్రులపై తెలంగాణ వారు చేస్తున్నటువంటి ఫిర్యాదులు రాలేదు. కొందరు తెలంగాణ వారు మహారాష్ట్రంలోనే సెటిల్ అయి రాజకీయాల్లోకి కూడా వెళ్ళారు. కాని వారి మీద ఫిర్యాదులు లేవు. ఎందుకంటే వారు మరాఠీలతో మమేకం అయ్యారు.

రాజధాని పేరుతో సీమ ఆంధ్రులు హైదరాబాద్‌ను చెరపట్టినటువంటి దృష్టాంతాలు యావత్ ప్రపంచంలోనే ఎక్కడా కానరావు. ఇక్కడ నవాబులు ఖాళీ చేసిన బంగళాలు, జాగాలలోకి ఆంధ్ర, సీమవారు చొరబడ్డారు. అక్రమంగా ఆస్తులను సొంతం చేసుకున్నారు.



## విధాన నిర్ణేతలే దొంగలయ్యారు

భూసంస్కరణల చట్టం, రెంట్ కంట్రోల్ యాక్ట్, రిజిస్ట్రేషన్, రిక్రూట్‌మెంట్ పాలసీలు, విధానాలు ఎవరు రూపొందించారు? వాటి రికార్డులు ఎవ్వరి దగ్గర ఉన్నాయి? వాటి వల్ల ఎవరు ప్రయోజనం పొందారు? రంగారెడ్డి జిల్లాను ఎందుకు ఏర్పరిచారు? హుడా ఎందుకు ఏర్పడింది? హైమా రూపకర్తలు ఎవరు? కాగితాల మీద గ్రేటర్ హైదరాబాద్‌ను ఎవరు సృష్టించారు? ఇప్పుడు దానికి మేమే హక్కుదారులమనే సాహసం ఎవరు చేస్తున్నారు? సమస్యను చారిత్రక దృష్టితో చూస్తే విషయం అర్థమవుతుంది. పై పై వాదనలు అనర్థాలను తెస్తాయి. సత్యం రామలింగరాజుకు అన్ని ఎకరాల భూమి ఎలా వచ్చింది? రామోజీ ఫిలింసిటీ రెండువేల ఎకరాలలో ఎలా విస్తరించింది? ఉస్మానియా విశ్వవిద్యాలయం భూములు ఎలా అన్యాక్రాంతం అయ్యాయి? జంటనగరాలలో దాదాపు రెండున్నర లక్షల ఎకరాల భూమి ఎలా అన్యాక్రాంతం అయ్యింది. తవ్వితే చాలా విషయాలు బయటికి వస్తాయి. కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది.

రియల్ మాఫియా మాయలోపడి వారి ఒత్తిడికి లొంగి మొదట రంగారెడ్డి జిల్లాను ఏర్పరచారు. ఆ తర్వాత హుడా, హైమా, గ్రేటర్, హౌసింగ్‌బోర్డు లాంటి ఈ సంస్థలను వలసవాదుల ప్రయోజనంకోసం ఏర్పరిచారు. దాన్ని ఇప్పుడు అభివృద్ధి అంటున్నారు. ఇది హాస్యాస్పదం కాదా?

## తెలంగాణ ప్రకటన తొందరపాటు నిర్ణయం కానేకాదు

కాంగ్రెస్ అధిష్టానం లేదా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని అర్ధరాత్రి, అరనిముషంలో తీసుకున్నది కాదు. లేదా కేసీఆర్ ఆమరణ దీక్ష చేసినందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని అనుకోడానికీ లేదు. అలా అనుకోవడం రాజకీయ అమాయకత్వమే అవుతుంది. పక్కా ప్రణాళిక ప్రకారం సరిపడా హోంవర్క్ చేసి ఆచితూచి లోతుగా అన్ని కోణాల్లో ఆలోచించుకునే రాష్ట్ర విభజనకు కేంద్రం శ్రీకారం చుట్టింది. ఆంధ్రప్రాంత ఎమ్మెల్యేలకు ఎంపీలకు పిచ్చెక్కినంత పనయింది. చండశాసనుడన్న పేరుబడ్డ పార్టీనాయకుడిని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు గడ్డిపరకలాగా పక్కనపెట్టేశారు. ప్రజారాజ్యం పార్టీలో 14మంది శాసనసభ్యులు రాజీనామా చేసి చిరంజీవిని లక్ష్యపెట్టలేదు. అధిష్టానానికి కట్టుబడి ఉంటామని పదేపదే ప్రకటనలు చేసే ఆంధ్ర, సీమ ఎమ్మెల్యేలు అధిష్టానాన్ని, సోనియాగాంధీని తూలనాడుతూ రాజీనామా లేఖలను క్యూలో నిలబడి స్పీకర్ ముఖాన విసిరికొట్టారు. వీరందరి ఉద్దేశ్యం ఒక్కటే!

“ఇచ్చేదా చచ్చేదా తెలంగాణా తీర్మాణాన్ని అసెంబ్లీలో సమర్ధిస్తాం అంటే పోయేదేముందని అటు కాంగ్రెస్ ఇటు తెలుగుదేశం, ప్రజారాజ్యం పార్టీలవారు పోటీలు పడి తెలంగాణకు మద్దతు ప్రకటించారు. సిపిఐ పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమై పార్టీ రెండుగా చీలినంత పనయింది. సిపియం మాత్రం మేం అప్పుడూ ఇప్పుడూ సమైక్యవాదులమేనని ప్రకటించింది.

## కెసీఆర్ కూడా ఊహించని ఫలితం - ప్రత్యేక రాష్ట్ర ప్రకటన

ఆమరణ దీక్షకు కూర్చున్న కె. చంద్రశేఖర్ రావు కూడా ఊహించనంత పెద్ద ఫలితం వచ్చింది. ఢిల్లీ వారి మాటలు విన్న ముఖ్యమంత్రి రోశయ్య మొహాన నెత్తురు చుక్కలేని పరిస్థితి ఏర్పడింది. ఆంధ్ర, సీమ ప్రాంత మంత్రులది ఇదే పరిస్థితి. “హైదరాబాద్ వెళ్లి కె.సి.ఆర్‌కు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేయమని రోశయ్యకు అధిష్టానం సూచించింది. తన చేతులతో నిమ్మరసం ఇవ్వలేక రోశయ్య అధిష్టానాన్ని మొదటిసారి ధిక్కరించారు. ఆయన స్వతహాగా పచ్చి సమైక్యవాది. హెూంమంత్రి చిదంబరం తెలంగాణ ఏర్పాటుకు కేంద్రం ప్రయత్నాలు మొదలుపెట్టిందని ఢిల్లీలో రాత్రి 11 గంటలకు ప్రకటించారు. ఇక్కడ సెంట్రల్ ఇంటిలిజెన్స్ బ్యూరో అధికారి రాజీవ్ కపూర్ స్వయంగా నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి హెూం శాఖ వారి ప్రకటన ప్రతిని కెసిఆర్‌కు వ్యక్తిగతంగా అందించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను హెూం మంత్రిత్వశాఖ చేపట్టిందని అందులో ఉంది. ఈ మాట విన్న తెలంగాణ వాదులు ఉబ్బితబ్బిబ్బయ్యారు. సోనియా గాంధీ పుట్టినరోజు కానుక ఇదని ఆమెను ప్రశంసించారు. కానీ ఆంధ్రా రాయలసీమ నాయకులు ఆందోళనకు గురయ్యారు.

## ఏఐసిసి, సోనియాగాంధీ నిర్ణయం వెనుక ఉద్దేశ్యాలు

ఏఐసిసి గానీ సోనియా గాంధీ గానీ తెలంగాణ విషయమై ఆచితూచే నిర్ణయం తీసుకున్నారనే భావించాల్సిఉంటుంది. రాజకీయ వాదులు తమ అస్థిత్వం విషయమై చాలా దూరం యోచిస్తారు. వారి వ్యూహాలు చప్పున అర్ధం కావు. సామాన్యులకైతే అసలు అర్ధం కావు. సాధారణంగా ఉన్నత స్థాయి రాజకీయాలు చాలావరకు మాచ్‌ఫిక్సింగ్‌లోనే సాగుతాయన్నది ఒక సూత్రీకరణ. మన దేశంలో ప్రాంతం, కులం, మతం, డబ్బు, వనరుల తదితర అంశాల ప్రభావాన్ని కూడా జాగ్రత్తగా పరిగణలోకి తీసుకొనే నిర్ణయాలు చేస్తారు. ప్రణబ్‌ముఖర్జీ చిదంబరం, మన్మోహన్, అహ్మద్‌పటేల్ వీరప్పమొయిలీ లాంటి వారు ఎవరూ అవగాహన లేని నాయకులు కారు. వీరు అన్ని సమీకరణలు బేరీజు వేసుకొనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ప్రకటించారు. ఈ సమీకరణలలో అనేక సూత్రీకరణలు ప్రయోజనాలు



ఇమిడిఉంటాయి. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబును, ఆయన పార్టీని రెండుగా నరకడం, తెలంగాణలో జీరో చేయడం, అటు ఆంధ్రాలో కనీస స్థాయికి కుదించేయడం కూడా వ్యూహంలో బాగం అయిఉంటుంది. రెండురాష్ట్రాల రాజకీయాలను శాసించే మైన్స్ మాఫియాకు ముకుతాడు వేయడం, ఆ రెండుకులాల బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలకు చెక్ పెట్టడం కూడా మరో ఉద్దేశ్యం అయి ఉంటుంది. ఈ రెండు కులాల నుంచి అత్యల్పకాలంలోనే వందల వేల కోట్లకు ఎదిగిన వ్యాపారులు, కాంట్రాక్టర్‌లు రాజకీయాలను, వ్యాపారాలను మిళితం చేసేసి అటు కేంద్రాన్ని ఇటు రాష్ట్రాన్ని శాసించగలిగే స్థితికి ఎదగడాన్ని ఏ జాతీయ పార్టీ సహించదు.

పెద్ద రాష్ట్రాల వల్ల, ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎంపిల సంఖ్యను అడ్డు పెట్టుకుని కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడం, బ్లాక్‌మెయిల్ చేయడం లాంటి ధిక్కార ధోరణి అవలంబిస్తున్నారు. కేంద్రవిధానాలను శాసించే సాహసం చేస్తున్నారు. దీంతో కేంద్రం పెద్ద రాష్ట్రాల పట్ల వైముఖ్యంతోనే ఇలాంటి నిర్ణయం తీసుకొని ఉండవచ్చు. బ్రిటీష్ వారు నేర్పిన “డివైడ్ అండ్‌రూల్ పాలసీ” ఉండనే ఉంది కదా. తమిళనాడు ఆంధ్ర ప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు పలు సందర్భాలలో కేంద్రాన్ని ఇరుకున పెట్టిన వైనం అందరికీ తెలిసిందే. గతంలో యన్టీఆర్, ఆ తరువాత చంద్రబాబునాయుడు ముఖ్య మంత్రులుగా కేంద్ర ప్రభుత్వాలను ఎన్నోసార్లు ఇరుకున పెట్టారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి అయినప్పటికీ వైయస్ రాజశేఖర్‌రెడ్డి కేంద్రం మెడలు వంచే పరిస్థితిని పలుమార్లు సృష్టించారు. ఇలాంటి అనుభవాలను కేంద్రం మళ్లీ మళ్లీ చవిచూడటానికి ఇష్టపడకనే ఇలాంటి నిర్ణయం చేసి ఉంటుందని కూడా భావించే ఆస్కారం లేకపోలేదు.

## కేసిఆర్ దీక్ష- తెలంగాణ ప్రకటన

తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షులు కె.చంద్రశేఖరరావు తెలంగాణ ప్రత్యేకరాష్ట్రం కోసం నవంబర్ 29 ఆదివారం నాడు ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభిస్తానని ప్రకటించారు. ఆయన దీక్షా స్థలి ఉన్న సిద్ధిపేటకు కరీంనగర్ నుండి బయలుదేరారు. మార్గ మధ్యలో ఆయనను పోలీసులు అరెస్టుచేసి ఖమ్మం తరలించారు. ఖమ్మం జిల్లా కోర్టులో వారిని ప్రవేశపెట్టగా కోర్టు ఆయనను కస్టడికి పంపింది. ఆక్కడి నుండి ఆయనను హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ఆయన డిసెంబర్ తొమ్మిదో తేది అర్ధరాత్రి వరకు దీక్ష కొనసాగించారు. దీక్షకు ముందు దీక్ష తర్వాత అనేక సంఘటనలు జరిగాయి. కొన్ని నాటకీయమైనవి, కొన్ని ఉద్రేకపూరితమైనవి.

## డిసెంబర్9,తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ప్రకటన (సోనియా గాంధీ పుట్టిన రోజు)

ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్, కోర్‌కమిటీకి చెందిన సభ్యులు ప్రణబ్ ముఖర్జీ, అహ్మద్‌పటేల్, ఆంథోనీ, చిదంబరంలతో తెలంగాణ విషయమై కనీసం నాలుగు సార్లు చర్చలు జరిపారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో ప్రధాన మంత్రి నివాసంలో ముఖ్యమంత్రి రోశయ్యను పిలిపించి మాట్లాడారు. ఆ తర్వాత రోశయ్య ప్రత్యేక విమానంలో హైదరాబాద్ తిరిగి వచ్చారు. రాష్ట్రంలో తెలంగాణపై అసెంబ్లీలో తీర్మానం ప్రవేశ పెట్టమని రోశయ్యను కేంద్రం కోరనున్నట్లు పార్టీ ముఖ్యుల నుంచి కొంత మంది మీడియా ప్రతినిధులకు ఈ విషయం తెలిసింది. సరిగ్గా 11.30 గంటలకు హోంమంత్రి చిదంబరం తెలంగాణ విషయంపై ప్రకటన చేశారు. "తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పై తాము ప్రక్రియ ప్రారంభించామని, అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టమని రోశయ్యను కోరామని" ప్రకటనలో పేర్కొన్నారు. కెసిఆర్ నిరాహార దీక్ష ప్రారంభించిన నాటి నుంచీ రోశయ్య ఈ విషయంలో ఎప్పటికప్పుడు అధిష్ఠానంతో చర్చిస్తున్నారు. సీనియర్ నేతలు సెంట్రల్ ఇంటలిజెన్స్ వారు, గాంధీభవన్ వర్గాలు కూడా అధిష్టానానికి తెలంగాణ విషయం, కెసిఆర్ దీక్ష వివరాలను వివరిస్తున్నారు. కోర్ కమిటీ పలుదఫాలుగా చర్చించారు. రోశయ్యను పిలిచి కూడా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చర్చించకుండా తీసుకున్న నిర్ణయం మాత్రం కాదు. ఆచితూచి తీసుకున్న నిర్ణయం అది.

## శాసన సభ్యులు, మంత్రులు రాజీనామాలెందుకు చేశారు

తమను ఎన్నుకున్న ప్రజల మనోభీష్టం మేరకే రాజీనామాలు చేశామని దాదాపు 140 మందికి పైగా ఎమ్మెల్యేలు చెబుతున్నారు. రాజీనామాలు చేయడానికి తెలంగాణేతర శాసనసభ్యులు సినిమా టిక్కట్లకోసం నిలబడ్డట్టు లైన్ కట్టారు. శాసనసభ్యత్వం సాధారణ విషయం కాదు. ఒక వ్యక్తికి శాసన సభ్యుడు కావడం జీవితకాల ఆశ, స్వప్నం, ఆశయంగా ఉంటుంది. ఏ పార్టీనుంచైనా ఒక వ్యక్తి శాసనసభ్యుడు కావడానికి కోటినుంచి ఐదుకోట్ల రూపాయల వరకు ఖర్చవుతుంది. అలాంటి శాసన సభ్యత్వాన్ని వీరు వెంట్రుక ముక్కతో సమానంగా భావించి వదిలేయడానికి సిద్దపడ్డారు.. అంటే తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు ద్వారా వారు దెబ్బతినే ప్రయోజనాలు ఎమ్మెల్యే పదవి కన్నా ఎన్నో రెట్లు విలువైనవని మన అర్థం చేసుకోవచ్చు. వీరికి లేదా వీరి మద్దతుదార్లకు, బంధుమిత్రులకు కోట్లాదిరూపాయల ఆస్తులు, రియల్ ఎస్టేట్ పెట్టుబడులు దీంతో ఇరుక్కుపోతాయి., వీటిని రక్షించుకోవడానికి,



లేదా పెంచుకోవడానికే శాసనసభ్యులు రాజీనామాలకు సిద్ధపడి ఉంటారు. వీరిలో చాలా మంది హైదరాబాద్‌తో మమేకమై నామమాత్రపు కుదురులను నియోజక వర్గాలో మిగుల్చు కున్నారు. వీరి ఆస్తులు, వ్యాపారాలు, వ్యవహారాలు, సరదాలు హైదరాబాద్‌తో ముడిపడి ఉన్నాయి.

శాసనసభ్యుడిగా గెలవడానికి మాత్రమే వీరు నియోజక వర్గానికి వెళ్తుంటారు. ఇతరత్రా నియోజక వర్గంతో ఏ రకమైన సంబంధం పెట్టుకోరు. దాని అభివృద్ధిని పట్టించుకోరు. ఇప్పుడు రాష్ట్రం విడిపోతే రాజకీయాలకు, ఆర్థికవ్యవహారాలకు లింకు తెగిపోతుంది అందుకే వారు సర్వం కోల్పోతున్నట్టు నానాయాగీ చేశారు... చేస్తున్నారు. వీరు ఆయా నియోజక వర్గాలకు చేసినదానికన్నా అక్కడి నుంచి పొందినదే ఎక్కువగా ఉంటుంది. అక్కడ ప్రజల డబ్బును లక్షల్లో తెచ్చి హైదరాబాద్ రంగారెడ్డిల్లో భూములపై పెట్టుబడులు పెట్టి తమ పరపతిని ఉపయోగించి కోట్లకు ఎదిగారు. చంద్రబాబు హయాంలో కమ్మవారు వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో రెడ్డికులస్థులు కొందరు ఇదే విధంగా రాత్రికి రాత్రే కోటీశ్వరులైన విధం అందరికీ తెలిసిందే .. తెలివైన తెలంగాణ శాసనసభ్యులు, కొందరు బిసి ఎస్సీ ఎమ్మెల్యేలు కూడా ఇదే పని చేశారు. అయితే తెలంగాణ వారికి తమ పెట్టుబడుల పై మినిమం గ్యారంటీ ఉంది. ఆంధ్ర, సీమ వారికి లేదు. అందుకే రాజీనామాలకు సిద్దపడ్డారు. గమనించాల్సిన ఇంకో విషయం ఏమిటంటే వీరిలో అత్యధికులు పాలక అగ్ర కులాల వారే. అందుకే ఇంత గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. ఇదంతా వీరిని ఎన్నుకున్న ప్రజలపై మమకారంతో మాత్రం కానేకాదు.

## అన్ని పార్టీల వారు ఒక్కటయ్యారు

పార్టీలతో సంబంధంలేకుండా ఆంధ్ర సీమ శాసన సభ్యులు ఒక్కటవడం వెర్రితెలంగాణా శాసనసభ్యులను ఉలిక్కిపడేలా చేసింది. కళ్లుతెరిపించేలా చేసింది. ఇందుకైనా తెలంగాణా ప్రజలు ఆంధ్రనాయకులకు కృతజ్ఞతలు తెలుపుకోవలసిందే. వారి యాగీ తరువాతనే తెలంగాణ ఎమ్మెల్యేలు తెలంగాణకు అనుకూలంగా యోచించడం, మాట్లాడటం మొదలు పెట్టారు. ఇంత జరుగుతున్నా దానం నాగేందర్, ముఖేష్ తదితర జంటనగరాల శాసన సభ్యులు గ్రేటర్ హైదరాబాద్ పాటనే పాడటం విడ్డూరంగా ఉంది.

మంత్రుల మధ్య వాదప్రతివాదాలు జరిగాయి. క్యాబినెట్ రెండుగా చీలింది. హై కోర్టులో వకీళ్లు మాటామాటా పెరిగి కొట్లాటకు సిద్దపడ్డారు. హైకోర్టుకు రాష్ట్రరాజకీయాలకు అతి

దగ్గరి సంబంధం ఉంది. హైకోర్టులో 90శాతం పనులు ఆంధ్ర, సీమ ప్రాంత లాయర్ల కనుసన్నల్లో సాగిపోతాయి. జడ్జిలు, జిపిలు, ఏజిపిలు అందరూ వారే. ఆ కోపం తెలంగాణ లాయర్లకు ఎప్పుడూ ఉంది. అందుకే అక్కడ కలబడ్డారు. 'ఆంధ్రా గోబ్యాక్' అనే నినాదాలు చేశారు.

ఆంధ్రప్రాంతంలో తమ నిరసన వినూత్న పద్ధతిలో జుగుప్సాకరంగా తెలిపారు. కుక్కమెడలో కెసిఆర్ అనే బోర్డు తగిలించి ఊరేగించారు. ఒక బక్కపలుచని వ్యక్తికి కేసిఆర్‌లా మేకప్ వేసి, ఆయనతో పొట్టి శ్రీరాములు కాళ్లకు దండంపెట్టించి, గుంజీలు తీయించి, తెలంగాణ అన్నందుకు తప్పయిందని క్షమాపణ చెప్పించారు. తెలంగాణ నాయకుల శవయాత్ర చేసి పాడెలను మురికి కాలువలో విసిరేశారు. ఈ పనులను క్షణికావేశంలో చేసినవని కొట్టి పారేసినా వాటిని ప్రోత్సహించి చేయించిన వారి అసలు ఉద్దేశ్యాన్ని తేలికగానే అర్థం చేసుకోవచ్చు. సమైక్యవాదుల నిరసనలు రాజీనామాలు, ధర్నాలకు కేంద్రం బెదిరే అవకాశమే లేదు.

## జై ఆంధ్ర, గ్రేటర్ రాయలసీమ వాదులు రాత్రికి రాత్రి సమైక్య వాదులయ్యారు

యలమంచిలి శివాజీ, చలసాని శ్రీనివాస్ లాంటి పలువురు ఆంధ్రులు మేధావులుగా చెలామణి అవుతూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రకటన వెలువడేంత వరకు జై ఆంధ్ర ఉద్యమం చేపడతాం అన్నారు. యలమంచిలి శివాజీ అయితే మేం 1972లో విడిపోతే ఈ పాటికి స్విట్జర్లాండ్‌ను తలదన్నేలా అభివృద్ధి చెందే వారము అని వివరించారు. హోం మంత్రి ప్రకటన వెలువడిన వెంటనే వీరు మాట మార్చి "తెలంగాణా వద్దు సమైక్య ఆంధ్ర ముద్దు" అని అనడం గమనార్హం. వసంత నాగేశ్వరరావు సోదరులుగా విడిపోతాం అని హైదరాబాద్‌లో చెబుతుంటే ఆయన కొడుకు విజయవాడలో సమైక్యాంధ్ర కోసం దీక్ష చేస్తానని ప్రకటించారు. అగ్రనాయకుడు చంద్రబాబునాయుడు మొదలుకొని దాదాపు 99 శాతం ఆంధ్ర నాయకులు మాట మార్చారు. మాట మార్చని రాజకీయ వాదుల్లో సిపిఐ, సిపిఎం మొదటి నుండి ఒకే మాటపై ఉండటం విశేషం.

"పద్ధతి అలాకాదు", ఇంకోలా చేసి ఉండాల్సింది ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రితో సవివరంగా చర్చించాల్సింది అని ఢిల్లీలో వెంకయ్య నాయుడు సన్నాయి నొక్కులు నొక్కారు. అవతల వారు కలిసి కట్టుగా సమైక్యత కోసం భూమి ఆకాశాన్ని ఏకం చేస్తుంటే ఇవతల టిఆర్ఎస్



వారు కాళ్లు చాపుకొని కూర్చోవడం, కాంగ్రెస్ వారు తలోమాట మాటాడ్డం విడ్డూరం. తెలంగాణా తెలుగుదేశం వారు తెగబడకుండా నర్మగర్భంగా మాట్లాడారు. జిల్లాలోని ప్రధాన పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు మాత్రం జై తెలంగాణా అంటు నినాదాలు చేసి సమావేశాలు పెట్టుకున్నారు.

## పార్టీలు - అక్కడో మాట ఇక్కడో మాట

రాష్ట్రంలో జరిగే అన్ని ఎన్నికల్లో టిఆరెస్ పార్టీ మినహా ఇతర ప్రధాన పార్టీలన్నీ తెలంగాణలో ఒక మాట, ఆంధ్రరాయలసీమల్లో మరోమాట మాట్లాడుతుంటారు. అందరి ఎన్నికల ప్రణాళిక ఒకే రీతిగా ఉంటుంది. ఇక్కడ తెలంగాణలో మేం తెలంగాణ కోసం పనిచేస్తామంటారు. అక్కడ ఆంధ్ర రాయలసీమల్లో తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడుతారు. 2009 ఎన్నికల్లో తెలంగాణలో తొలిదశ పోలింగ్ ముగిసీ ముగియక ముందే వైయస్ రాజశేఖరరెడ్డి నంద్యాలలో ఇష్టమొచ్చిన రీతిలో తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడాడు. తెలంగాణ వస్తే హైదారాబాద్‌లో సీమ, ఆంధ్రులు విదేశీయులవుతారని అంత పెద్దాయన రాయలసీమ వారిని రెచ్చగొట్టినట్టు మాట్లాడాడు. అంటే తెలంగాణ వారు ప్రత్యేక దేశం అడుగుతున్నారా? తెలంగాణ ఏర్పడితే భారతదేశ చట్టాలు ఇక్కడ పనిచేయవా? రిజర్వు బ్యాంకు రూపాయి చెల్లదా? ఆయన అలా మాట్లాడటాన్ని తెలంగాణ ప్రజలు ఎలా అర్థం చేసుకోవాలి? అయినా ఒక్క తెలంగాణా నాయకుడు దీన్ని ఖండించలేదు.

## సమైక్యత పేర పార్టీల ధిక్కారం - సొంత ఆస్తుల పరిరక్షణం

ఒక పార్టీ అభ్యర్థిగా ఎన్నికయిన శాసనసభ్యుడు ఆ పార్టీనిర్ణయానికి వ్యతిరేకంగా మాట్లాడాల్సి వచ్చినపుడు ముందుగా పార్టీకి రాజీనామా చేయాలి. పార్టీలోనే ఉంటూ పార్టీనిర్ణయానికి వ్యతిరేకంగా మాట్లాడితే ఆ పార్టీ నాయకత్వం అతనిని వెంటనే సస్పెండ్ చేయాలి. ఇలా జరగడం లేదంటే ఆ పార్టీ నాయకత్వమే మ్యాచ్‌ఫిక్సింగ్‌కు పాల్పడి వారితో రాజీనామాలను చేయించినట్టు అర్థం చేసుకోవలసి ఉంటుంది. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు నన్నపునేని రాజకుమారి మాట్లాడుతూ "ఎవడువాడు ఆంధ్రప్రదేశ్‌ను విడగొడతాననడానికి... వాడి పళ్లు రాలగొడతాను" అని కేంద్రహోంశాఖ కార్యదర్శి పిళ్లైని తిట్టడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ కూడా తన పార్టీని, అవతల పార్టీలో సోనియా గాంధీని తీవ్రంగా విమర్శించాడు.

2009 ఎన్నికల్లో ఎలాగయినా కాంగ్రెస్‌ను, రెడ్లను ఓడించాలని కమ్మవారికి చెందిన తెలుదేశం పార్టీ తెలంగాణ కోసమే పార్టీ పెట్టిన వెలమ కులస్థుడైన కెసిఆర్‌తో పొత్తు పెట్టుకున్నది. " మేం తెలంగాణకు వ్యతిరేకం కాదు. తెలంగాణ పై శాసనసభలో తీర్మానం పెడితే మేం సమర్ధిస్తామని పలుమార్లు పార్టీనాయకత్వం ప్రకటించింది. చంద్రబాబు స్వయంగా దీక్షలో కూర్చున్న కెసిఆర్‌ను పరామర్శించి అతి స్పష్టంగా చెప్పాడు, పలు మార్లు చెప్పాడు. "తీర్మానం పెడితే మేము మద్దతు ఇస్తామని". ఇప్పుడు ఆయనతో సహా ఆంధ్ర, సీమ నాయకులందరూ మరో రకంగా మాట్లాడుతున్నారు. అన్నీ పార్టీల వారు ఏకమై రాజీనామాలు చేసి సమైక్య నినాదాన్ని ఇచ్చారు, పార్టీలను ధిక్కరించారు. ఇది అవకాశవాద రాజకీయం తప్ప మరోటికాదు. ఈ దోరణితోనే ఐదున్నర దశాబ్దాలు తెలంగాణను వంచించారు, దోచుకున్నారు వీటిని రక్షించుకోడానికే సీమ, ఆంధ్ర శాసనసభ్యులు ఒక్కటై నింగి-నేలను ఏకం చేశారు.

## కోస్తా, సీమ నాయకులు అభివృద్ది చెందారు.ఆ ప్రాంతాలు, ప్రజలు కాదు.

ఆంధ్రులది కడుపు నిండిన వ్యవహారం, తెలంగాణ వారిది కడుపు కాలుతున్న దు:ఖం తెలంగాణను ముంచి సీమ, ఆంధ్ర నాయకులు ఆ ప్రాంతాలను అభివృద్ధి చేసారని చెప్పడానికి దుష్టాంతాలు ఏమీ లేవు. ఆంధ్ర, రాయలసీమ జిల్లాల్లోని పలు ప్రాంతాలు కూడా అభివృద్ది చెందలేదు. కానీ ఆప్రాంత నాయకులు మాత్రం వందల వేల కోట్లకు పడగలెత్తారు. వై.ఎస్. హయాంలో పులివెందుల దీనికి మినహాయింపు కావచ్చు. కోస్తాంధ్రకు దాదాపు 980 కిలోమీటర్ల సముద్ర తీరప్రాంతం ఉంది. అపారమైన మత్స్య సంపద ఉంది. కృష్ణా, గోదావరి బేసిన్‌లో విలువ కట్టలేనంత చమురు నిక్షేపాలు, గ్యాస్ బయటపడింది. వరి పండే భూములున్నాయి. గోదావరి జిల్లాలోని లంక భూములు అత్యంత సారవంతమైనవి. తీరంలో విస్తారమైన కొబ్బరి పంట సాగవుతుంది. కోనసీమ నిజంగా అందమైనది. కళింగాంధ్ర జీడిపప్పు ప్రపంచ ప్రసిద్ధి చెందింది. అంబాజీపేట కొబ్బరి, లంక పొగాకు, గుంటూరు మిర్చి, నూజివీడు మామిడి, నెల్లూరు వడ్లు, చీరాల-మంగళగిరి వస్త్రాలు జగత్‌ప్రసిద్ధమైనవి. తీరప్రాంతంలో ఒకప్పుడు బందరు ఓడరేవు సజీంగా ఉండేది. తరువాత కాలంలో కళింగ పట్టణం, భీమునిపట్టణం, విశాఖ, బందరు, భీమవరం, సూర్యలంక ఓడరేవు, కృష్ణపట్టణం వంటి ఓడరేవులు అభివృద్ధికి దూరంగానే ఉన్నాయి. మహారాష్ట్ర, గుజరాత్ ఓడరేవులతో పోలిస్తే ఈ రేవులు పాడుపడినవాటితో సమానం. 1950ల్లో గన్నవరంలో విమానాశ్రయం ఉండేది. బెజవాడలో పెద్ద రైల్వే స్టేషన్ ఉండేది. కాకినాడ నుంచి మద్రాసుకు బంకింగ్‌హామ్



కెనాల్ ఉండేది. ఈ కెనాల్‌లో జలరవాణా సాగేది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక ఇవన్నీ పాడుపడ్డాయి. మహారాష్ట్ర నుంచి గుజరాత్ విడిపోయేటప్పుడు బొంబాయి విషయంలో బోలెడంత రాద్ధాంత చేశారు. కానీ అహ్మదాబాద్ రాజధానిగా గుజరాత్ సాధించిన ప్రగతి ఇప్పుడు మనమందరం చూస్తూనే ఉన్నాం. హర్యానా కూడా అలాగే అభివృద్ది సాధించింది. జార్ఖండ్, చత్తీస్‌ఘడ్, ఉత్తరాంచల్ రాష్ట్రాలు కూడా మునుపటి కంటే వేగంగా అభివృద్ది సాధిస్తున్నాయని ప్రభుత్వనివేదికలే వెల్లడిస్తున్నాయి. అలాగే రెండు తెలుగు రాష్ట్రాలు ఏర్పడితే తెలుగు వారికి ఇంకొక రాజధాని నిర్మితమవుతుంది కదా.మరి దీనిని కొందరు నాయకులు ఎందుకు వ్యతిరేకిస్తున్నట్టు.

తిరుపతి ప్రపంచ ప్రసిద్ధి చెందిన పర్యాటక కేంద్రం. వెంకన్న హుండికీ రోజుకు కోటి రూపాయల ఆదాయం ఉంది. ఆంధ్ర పాలకులు వెంకన్నకు కూడా పంగనామాలు పెట్టి ఆ నిధులను ఆయన సొమ్ములను కైంకర్యం చేస్తున్నారు. అనంతపురం ఇనుప ఖనిజం, కడప జిల్లా బైరైటీస్, బేతంచెర్ల నాపరాయి, చిత్తూరు మామిడి పంట ఆ ప్రాంతాల అభివృద్ధి కన్నా పాలకుల ప్రైవేట్ ఖజనాలు నింపడానికే ఎక్కువ ఉపయుక్తమైంది. సీమ, ఆంధ్ర ప్రాంత నాయకులు అటు ఆంధ్రులను, ఇటు తెలంగాణ వారిని వంచించి వారు మాత్రం వందల, వేల కోట్లకు ఎదిగారు. టాటా, బిర్లా, అంబానీలకన్నా వేగంగా సంపాదించడం ఆంధ్ర పాలకులకే సాధ్యం అయ్యింది. మొత్తం మీద సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్ర పట్టణాలు ప్రాంతాలు కూడా అంతగా అభివృద్ధి చెందలేదని చెప్పవచ్చు. ఆ ప్రాంత పాలకులు, ఉన్నతాధికారులు ఇరు ప్రాంతాల ప్రజలను వంచించి వారు మాత్రం అభివృద్ధి చెంది హైదరాబాద్‌లో రాజభవనాలను నిర్మించుకొని వారిపిల్లలను విదేశాలకు పంపి సర్వ సౌఖ్యాలను అనుభవిస్తున్నారు. వారి రక్షణకోసం సామాన్య ఆంధ్రులను, సీమ ప్రజలను వినియోగించుకుంటున్నారు. వారి ఇళ్ళు ఆఫీసులు ఆస్తులు అభివృద్ధి చెందితే నగరం అభివృద్ధి చెందినట్లవు తుందా? హైదరాబాద్ అభివృద్ధికోసం వారు చేసింది శూన్యం. ఉన్న పౌర సదుపాయాలను పాడుచేశారు. నగరాన్ని వికృతంగా విస్తరింపచేసి అసౌకర్యాల కూపంగా మార్చారు. హైదరాబాద్‌లో అమ్ముడు పోయినన్ని కార్లు ప్రపంచంలో ఏ నగరంలోనూ అమ్ముడుపోవట! హైదరబాద్‌లో ఉన్నంత అసహ్యకరమైన ట్రాఫిక్ ప్రపంచంలో మరేనగరంలో లేదు. ఆ కార్లను కొంటున్న వారిలో అత్యధికులు సీమాంధ్రులే.

‘పంచపాండవులు మంచం కోళ్ల వలె ముగ్గురు’ అని రెండు వేళ్లు చూపినట్లుగా వుంటుంది సమైక్యాంధ్రుల వ్యవహారం. చెప్పేది ఒకటి... ఒప్పుకునేది ఒకటి... చేసేది మరొకటి...

## క్యాపిటలిస్ట్ - క్యాస్టిస్ట్‌ల ఉద్యమం

విషయం ఇదీ అని వివరించి చెబితే సాధారణ ఆంధ్రుడు, సీమ వాసి ఎవరూ కూడా తెలంగాణ డిమాండ్ సహేతుకమే అని అంటాడు. ఎవరు ఏం చెప్పినా వినని వర్గం వీరిలో ఒకటుంది. ఎవరి దగ్గరైతే ఎంతోకొంత నల్లడబ్బు ఉందో, ఏదో ఒక అగ్రవర్గానికి చెందినవారో వారు ఏం చెప్పినా కన్విన్స్ కారు. వీరిలో కొందరు క్యాపిటలిస్ట్‌లుగా మారారు. వీరే తెలంగాణ ఏర్పాటును వద్దంటున్నారు. మతోన్మాది వలే మా దేహం ముక్కలైనా రాష్ట్రాన్ని ముక్కలు కానివ్వం అని మూర్ఖంగా పట్టు బడుతున్నారు.

సమైక్యత నిరసన కార్యక్రమాలన్ని ఈ క్యాపిటలిస్ట్‌లవే. ఆ రెండు మూడు 'క్యాస్ట్'ల వారివే. సమైక్యత పాటను ప్రకటనల రూపంలో టెలివిజన్ చానల్స్ ప్రసారం చేసినందుకు ఖర్చు కోట్లలో అయి ఉంటుంది. ఆ డబ్బులు సమకూర్చిన వారికే సమైక్యత మీద ప్రేమ ఉంది.

ఇన్‌కం టాక్స్, ఆంటి కరెప్షన్ డిపార్ట్‌మెంట్, రెవెన్యూ మరియు ఇంటిలిజెన్స్ శాఖల్లోని అలసత్వమే, వీరిని భారి పెట్టుబడి దారులుగా మార్చింది. ఈ శాఖల అధికారులు కూడా అనతి కాలంలోనే పెట్టుబడి దారులుగా మారడం ఇక్కడ వైచిత్రి. 'అందుకే దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్నట్లు' వీరు, వారు సమైఖ్యత రాగం కలిసే ఆలపిస్తారు. తెలంగాణకు ప్రతిగా వస్తున్న ఉద్యమాలు వీరు నడుపుతున్నవే.

## కోస్తాంధ్రులు, సీమ వారికి ఒకరంటే మరొకరికి భయం, అసహ్యం, అనుమానం

రాజశేఖర రెడ్డి అధికారంలోకి వచ్చే వరకు కోస్తాంధ్రులకు రాయలసీమ వారంటే పెద్దగా లెక్కించే వారు కాదు. రాజశేఖరరెడ్డి హయాం ఐదేళ్ళలో కోస్తాంధ్రులకు రాయలసీమ వారంటే దడుపు పట్టుకున్నది. మరో వైపు రాయలసీమ వారికి మొదటి నుండి ఆంధ్రుల పొడగిట్టదు. అందుకే 1954లో ఆంధ్ర ప్రాంతంలో రాజధానిని ససేమిరా వద్దని కర్నూల్‌లో పెట్టుకున్నారు. ఇలా రాజశేఖరరెడ్డి తర్వాత వారిలో వారికి ఒకరంటే ఒకరికి మరింత వ్యతిరేకత ఏర్పడింది. ఇందులో కమ్మ, రెడ్డి కుల వ్యతిరేకత అనే ఎలిమెంట్ కూడా ఉంది. మేం రెండున్నర దశాబ్దాల్లో సంపాదించినది కడప వారు ఏడేళ్ళలో సంపాదించేశారు అనే ఏడుపు కూడా ఉంది. వెరసి ఇద్దరూ కలిసి తెలంగాణ భూములను కొల్లగొట్టారు. అమ్ముకున్నారు. సొమ్ము చేసుకున్నారు.



## మాఫియా లాబీలన్ని ఆంధ్ర, సీమ ప్రాంతం వారివే

"ఆర్గనైజ్డ్ క్రైంను" మాఫియా అంటారు. అలాంటిది రాష్ట్రంలో ఇటీవల రాష్ట్రంలో ఒక వర్గం వారి మీడియా 'మైన్స్‌మాఫియా' అనే పదాన్ని బాగా ప్రచారం చేసింది. ఇంకో వర్గం 'ల్యాండ్ మాఫియా' అనే పదాన్ని పాపులర్ చేసింది. ఈ రెండే కాదు రాష్ట్రంలో లిక్కర్ మాఫియా, సాండ్ మాఫియా, కేబుల్ మాఫియా, మీడియా మాఫియా హెల్త్ మాఫియా, ఎడ్యుకేషన్ మాఫియా, వీరికి అందరికి మని మానియా ఉంటుంది. ఇలా పలు మాఫియాలు ఉన్నాయి అంటూ మరో వర్గం అంటున్నది. ఈ మాఫియాల దగ్గర అపరిమితమైన డబ్బు సమకూరుతున్నది. ఆ డబ్బు అంతా అటు ప్రభుత్వ ఖజానాకు వెళ్ళాల్సిన డబ్బు, ప్రజలందరికీ చెందాల్సిన డబ్బు అని కొందరు అంటుంటారు.

వీటినే ఆయా వర్గాల వారు గౌరవంగా మైన్స్ లాబి, రియల్ లాబి అని అంటున్నారు. 'అవి మాఫియాలు అయినా లాబీలు అయినా మొత్తం సీమ, ఆంధ్ర ప్రాంత వారికి చెందినవే ఎక్కువ. అవన్నీ అటు ఆంధ్ర, సీమ ఇటు తెలంగాణా ప్రజలకు నష్టాన్ని కలిగిస్తున్నవే. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ఈ లాబీల, మాఫియాల ప్రభావం కొంతయినా తగ్గుతుందని అనుకోడానికి ఆస్కారం ఉంది.

వీరి ద్వారానే 'క్రిమినలైజేషన్ ఆఫ్ పాలిటిక్స్' అనే అవాంఛనీయ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పోవాల్సిన నిధులను వీరు తినేస్తున్నారు, తెలంగాణ ద్వారా వీరికి చెక్ పెట్టాలి అని కేంద్రం అనుకుంటున్నది అని ప్రధాన రాజకీయ పార్టీల్లోని కొందరు విశ్రాంత రాజకీయ వాదులు విశ్లేషిస్తున్నారు.

ఏది ఏమయినా ప్రజలకు చెందాల్సిన ఎన్నో నిధులు ప్రయివేట్ వ్యక్తుల ఖాతాలలోకి వెళ్తఉ న్నాయి అన్నది నిజం. ఈ మొత్తాలు సాధారణ పౌరులకు అర్థం కానంత ఎక్కువగా ఉ ంటున్నాయి.

## సమైక్యవాద యాత్రలు - ఉత్తి బక్వాస్

కచ్చా పచ్చా, బచ్చా రాజకీయవాది చిరంజీవితో సహా పలువురు రాజకీయవాదులు, సినీ హీరోలు సమైక్య వాద యాత్రలు తిరుపతి నుంచి శ్రీకాకుళం వరకు నిర్వహిస్తున్నారు. అది "ఆంధ్ర యాత్ర" అవుతుంది కానీ సమైక్యాంధ్ర యాత్ర కానేరదు.

నిజానికి ఈ యాత్రలు ఆదిలాబాద్ నుంచి జరగాలి లేదా మరో తెలంగాణ ప్రాంతం

నుండి ప్రారంభం కావాలి. కానీ అలా జరపరు. ఎందుకంటే తెలంగాణ వారు కొట్టి, దాడిచేస్తారని భయం. దాడి చేసేటంత తప్పులు ఏమీ చేయకపోతే, వారిని కన్విన్స్ చేసేటంత వాదన వారి దగ్గర ఉంటే చిరంజీవి, మోహన్‌బాబు, నన్నపనేని, లగడపాటిలు వారి సమావేశాలను కరీంనగర్. సిద్ధిపేట లేదా వరంగల్‌లో నిర్వహించాలి కదా?

"మీతో పొత్తువద్దు, విడిపోతాం" అని తెలంగాణ వారు అంటుంటే కనీస ఇంగిత జ్ఞానం లేకుండా, కలిసి ఉందాం అంటారేం". ఇతర రాష్ట్రాల ప్రజలు, ఆంధ్ర నాయకుల పనులను ప్రకటనలను, చూసి నవ్వుకుంటున్నారు. కలిసి ఉంటాం అని అనడంలో యావత్ దేశ ప్రజలు ఆంధ్ర నాయకుల దుర్బుద్ధిని గ్రహిస్తున్నారు. చిరంజీవి మీ తొలి సంపాదన ఎంత? మోహన్‌బాబు, డ్రిల్ మాస్టర్‌గా నీ జీతం ఎంత ఉండేది. సినీ సంపాదన ఎప్పుడు మొదలయ్యింది. ఇప్పుడు మీ ఇద్దరి ఆస్తులు ఎన్ని.....? అన్నీ ధర్మబద్ధమైనవేనా? చట్టబద్ధమైనవా?అలాగే మీప్రాంత నాయకుల వేలాది మంది కూడబెట్టిన లక్షలాధి కోట్లు ఎక్కడ నుంచి వచ్చాయి.

## కేంద్రమే సుప్రీం

కేంద్ర ప్రభుత్వమైనా రాష్ట్రప్రభుత్వమైనా "రాజ్యం" ఎప్పుడైనా శక్తి వంతమైనది. రాజ్యాన్ని ఎదిరించిన ఏ వ్యక్తినైనా, శక్తినైనా, గుంపునైనా, పార్టీనైనా నిర్దాక్షిణ్యంగా కాలరాస్తుంది రాజ్యం. ఏదో సాకుతో వారిని లోపల వేసేస్తుంది. ముందుగా బుజ్జగిస్తుంది. కొన్నిసార్లు తాయిలాలిచ్చి ఆశపెట్టే ప్రయత్నం చేస్తుంది. మరికొన్ని సార్లు బెదిరిస్తుంది. వీటికి లొంగక పోతే పదవీ భ్రష్టుడిని, రాజకీయ భ్రష్టుడిని చేస్తుంది. అదీ సాధ్యం కాకపోతే శాల్తీనే గల్లంతు చేస్తుంది. రాజ్యం ఎప్పుడైనా ఎక్కడైనా చివరి అస్త్రంగా దీన్నే వాడుతుంది. ఇది అనాదిగా వస్తున్న ఆనవాయితి. చారిత్రక సత్యం.

లగడపాటిలాంటి వ్యాపారి కమ్ రాజకీయవాది, ఆయన కేంద్రంతో తలపడతాడా అంటే అనుమానమే.. ఒక సాధారణ జర్నలిస్టుకు ఉన్న ఈ ఎరుక లగడపాటి లాంటి వారికి ఉండదా అంటే, ఉంటుందనే చెప్పాల్సి వస్తుంది. ఇలాంటి వారికి ఎక్స్‌ట్రా నాలెడ్జి, ఇంటెలిజెన్స్ రెండూ ఉంటాయి. వారు రాజీనామా చేయరు. రాజీనామా ఆట ఆడతారు. దీనివెనుక ఉద్దేశ్యం వేరే ఉంటుంది. బహుశా కొత్తగా ఏర్పడబోయే రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలనే వ్యూహంతో ఆయన ఆ పని చేస్తుండి ఉండవచ్చు. ఈ పని వల్ల ఆయనకు, కాంగ్రెస్ పార్టీకి కూడా లాభమే కదా.



## హైదరాబాద్ వివాదమే లేదు

చారిత్రక పరిజ్ఞానం బొత్తిగా లేని మూఢశక్తులు గ్రేటర్ హైదరాబాద్ అంశాన్ని అనవసరంగా లేవదీస్తున్నారు. "హైదరాబాద్ లేని తెలంగాణా తలలేని మొండెం లాంటిది". దీనికోసం ఇక్కడ మొండాలు కూడా పోట్లాడతాయని తెలంగాణావాదు లంటున్నారు. ఈ విషయమై ఎలాంటి వాదాన్ని, అభ్యంతరాన్ని వినడానికి, ఉపేక్షించడానికి సిద్ధంగాలేమని తెలంగాణా వాదులంటున్నారు.

అత్రఫ్‌బల్దా అంటే సర్ఫేఖాస్ ........, దేశ్‌ముఖ్‌లు, వతన్ దారులు, అంటే కూడా తెలియని అజ్ఞానులు హైదరాబాద్ చరిత్ర, అభివృద్ధి తీరు తెలియని మూఢులు దీన్ని వివాదం చేయడానికి సిద్ధమవుతున్నారు. హైదరాబాద్ జనాభా రీత్యా పెరిగిందే కానీ సౌకర్యాల రీత్యా పెరగలేదు.

మూసీనది ఒడ్డున ఊడిపోయిన ఒక గ్రనేట్ రాయిని కూడా రిప్లేస్ చేయలేనివారు హైదరాబాద్‌ను మేమే అభివృద్ధి చేశాం అనడం అతిశయోక్తి తప్ప ఇంకేం కాదు. స్వతంత్ర్యం వచ్చేనాటికి, రాష్ట్రం ఏర్పడే నాటికే హైదరాబాద్ అభివృద్ధి చెందిన నగరం. అన్ని వసతులున్న నగరం. ఆనాటకే అది దేశంలో ఐదవ పెద్ద నగరం. ఇప్పటికీ దానిది అదే స్థానం. వీరి హయాంలో సాధించిన అభివృద్ధి చెప్పుకోదగినది ఏం కాదు. పైగా సుందర నగరాన్ని విస్తరించి మురికికూపంగా మార్చారు.

తెలంగాణాలో అన్యాక్రాంతమైన భూముల లెక్కలను తీస్తే తెలంగాణా వారికి వలసవాదులు లక్షల, కోట్ల రూపాయల నష్టపరిహారాన్ని ఇచ్చినా నష్టం పూడదు. ఎందుకంటే, వారు కోల్పోయినది వారి జీవితాలు. వారి సంస్కృతి. వలసవాదులతోపాటు స్థానిక దొరలు, కరణాలు చిన్నచిన్న తాయిలాలకు లొంగి భూములను వారికి అప్పగించారు. ఎంత రాసినా వివరించలేని అన్యాయం అది. ఇప్పుడు మనముందున్నది వేర్పాటు సమస్య. పంపకాలు సామరస్యంగా ఎలా జరగాలి అన్నది యోచించాలి.

విడిపోయేముందు ఇరువైపులా పలు సమస్యలు తలెత్తుతాయి. ఆస్తుల పంపకం, ప్రపంచ బ్యాంక్ అప్పులు, నష్టపరిహారం, ఉద్యోగుల పంపిణీ, పెన్షన్ల చెల్లింపులు, వనరుల పంపిణీ, నీటివనరుల వినియోగం, సహజ వనరుల వినియోగం, కొత్త రాజధాని నిర్మాణం, నిర్వాసితుల పునరావాసం, ఇక్కడే ఉండిపోవాలనుకున్నవారికి రక్షణ ఇత్యాది ఎన్నో సమస్యలుంటాయి. కొంచెం పెద్ద మనస్సుతో ఉంటే ఇరువర్గాల వారికి నష్టం, కష్టం కలగదు. ఇలాంటి సమయంలో స్వార్థపరులు అనేక భయాందోళనలను, వదంతులను

ప్రచారం చేస్తారు. వాటిని నమ్మకపోవడం మంచిది.

రియల్ ఎస్టేట్‌లో సంపాదించి రియల్ ఎస్టేట్‌లోనే పెట్టుబడిపెట్టి రానున్న లాభాలను కోల్పోయినందుకే కొందరు ఎంతో చింతిస్తున్నారు. మరి ఇక్కడ జీవితాలను కోల్పోయి నిలువ నీడలేకుండా అయినవారి గురించి ఎవరు ఆలోచించాలి. ఇరువైపులా పెద్దలు కూర్చుని తండ్రి మనస్సుతో నిర్ణయాలు తీసుకోవలసిన సందర్భం ఇది. అరవై యేళ్ళు దాటినవారు అయితే బాగుంటుంది. పిన్నవయస్సువారికి ఆవేశకావేశాలు ఎక్కువగా ఉంటాయి. అప్పనంగా సంపాదించుకున్నవారికే అది పోతుందేమో అన్న ఆందోళన ఎక్కువగా ఉంటుంది. ఈ విషయంలో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలి.

## సంపన్న దేశం నైజాం

ఆసియాలోనే పెద్దది, ప్రపంచంలోనే రెండవదైన నిజాం చక్కెర కర్మాగారాన్ని ఒక దగాకోరు ఆంధ్ర పాలకుడు తెగనమ్మగా, ఇంకో దళారీ ఆంధ్రుడు కొనేశాడు. ఇది ఎలా సాధ్యమైంది? నైజాం రాజ్యంలో ఓ మోస్తారు పెద్ద రైతులు బ్రాహ్మణులు, కరణాలు వెండి పళ్ళాలలోనే భోజనం చేసేవారు. వ్యక్తులకు ఎవరి వెండి పళ్ళాలు వారికే ఉండేవి. కొన్ని వెండి పళ్ళాల మధ్యలో బంగారు పూవు ఉండేది. బంగారుపూవు ఉన్న వెండి పళ్లెంలోనే అతిథులకు భోజనం పెట్టేవారు. రాత్రి భోజనాలు ముగిసిన తరువాత సాధారణంగా పళ్ళాలను ఆరుబయట బావి పళ్లెం మీద వేసేవారు. దొంగల బాధ కూడా అంతగా ఉండేది కాదు. సాధారణ వ్యవసాయ కూలీలకు కూడా ఒంటిపై ఒక కిలోకు తక్కువ కాకుండా వెండి కడియాలు, వడ్డాణాలు, దండకడియాలు, మట్టెలు తదితర ఆభరాలుండేవి. పురుషులకు విధిగా వెండి మొలతాడు, చెవికి బంగారు పోగు ఉండేవి. సాధారణంగా వృత్తి కులాల వారందిరి పిల్లలకు వెండి మొలతాడు ఉండేది.

స్త్రీలు ఒక్క చెవికే దాదాపు 17 నుంచి 20 రకాల ఆభరణలుండేవి. ప్రపంచంలో నాగరికత అభివృద్ధి చెందిన ఏ ప్రదేశంలో కూడా మహిళల చెవులకు ఇన్ని రకాల ఆభరణాలు ఉండవని ప్రతి చరిత్రకారుడికీ తెలిసిన విషయమే.

## నైజాం అంత చెడ్డవాడు కాదు

ఆసియాలోనే పెద్దది, ప్రపంచంలోనే రెండవదైన బోధన్ చక్కెర కర్మాగారం, ఆజాంజాహీ బట్టల మిల్లు, డిబిఆర్ నూలు మిల్లు, పరిటాల వజ్రాల గనులు, సింగరేణి బొగ్గు గనులు,



నిజాం సాగర్ ప్రాజెక్ట్ లాంటి ఎన్నో , ప్రజోపయోగ పనులు చేపట్టిన దేశం అది. కోట్లాది రూపాయలు విలువ చేసే వజ్రాన్ని పేపర్ వెయిట్‌గా వాడిన ఘనత నైజాం రాజుది. ఢిల్లీతో సహా పలు ప్రపంచ దేశాలలో రాయబార కార్యాలయాలను ఏర్పాటు చేసిన స్వతంత్ర దేశమది. ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్, ఆ నగరంలో రెండవ అతిపెద్ద భవనం. నైజాంకు సొంత రైల్వే, పోస్ట్, టెలిగ్రాఫ్, కరెన్సీ, సైన్యం ఉండేవి. ఇన్ని ఉన్న దేశం సంస్థానం ఎలా అయింది. హైదరాబాద్‌లో ఒక గల్లీ అంత జనాభా కూడా లేని పిఠాపురం తదితర సంస్థానాధీశులు “రాజావారు” ఎలా అయ్యారు. నైజాం పేరు రాసిన ప్రతిసారీ ఆయన పేరుముందు “నిరంకుశ” అనే పదాన్ని వాడడంలో ఉన్న కుట్ర ఏమిటి?

మీర్ ఆలం ట్యాంకు నిర్మించి జంటనగరాలకు పైపుల ద్వారా మొదటిసారి నీటిని సరఫరా చేసిన సందర్భంలో ఆయన కార్యదర్శి నీటి పన్ను పై పెట్టిన ఫైల్‌ను నిజాం విసిరికొట్టి “ పాగల్ హొగయా.. పానీ దేకే... పైసా పూఛ్‌తా ఖ్యా..”అని అన్న చివర నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఔదార్యాన్ని ఎవరైనా ఎందుకు మరవాలి. యావత్ భారత ఉప ఖండంలో మొదటిసారి గోవధ నిషేధ చట్టాన్ని తెచ్చిందెవరు బెనారస్ హిందూ యూనివర్సిటీ స్థాపనకై మదన్‌మోహన్ మాలవ్యకు  డూన్‌వ్యాలీ స్కూల్‌కు, శాంతినికేతన్‌కు భూరి విరాళాలిచ్చిన నైజాం దానగుణాన్ని ఎందుకు ఉటంకించకూడదు. నిజాం ముస్లీం పక్షపాతి కాదని చెప్పడం లేదు, ఆయన సద్గుణుడు అని పొగడటం లేదు కానీ ఆయన ఆంధ్ర కమ్యూనిస్టులు ప్రచారం చేసినంత దుర్మార్గుడు మాత్రం కాదు.

## వామపక్షీయుల దుర్మార్గం

వామపక్షవాదులు గత మూడున్నర దశాబ్దాలుగా తెలంగాణ యువతను అన్ని రకాలుగా తప్పుదోవ పట్టించారు. ఎందరినో కాటికి పంపించారు. అశాస్త్రీయ విద్యావిధానమంటూ వేలాధి మంది విద్యార్థులను కళాశాలు వదిలేలా చేశారు. చేతులకు తుపాకులిచ్చి, బలి అయ్యేలా చేశారు. ఈ పనులన్నీ యాధృచ్ఛికమైనవి కావు. విశ్వవిద్యాలయాలలోని వేలాది మంది తెలంగాణ విద్యార్థులను విప్లవ మార్గం పట్టించి వారు మాత్రం ప్రొఫెసర్లుగా, వ్యాపారులుగా, రచయితలుగా మేధావులుగా, సినీ వ్యాపారులుగా, అధికార్లుగా, ఎన్‌జివోలుగా, లొంగిపోయిన వారిగా సెటిలయి పోయారు. ఇదంతా తెలంగాణాకు, క్రింది కులాల వారికి వ్యతిరేకంగా కుట్రపూరితంగా చేశారని మాత్రం విశ్లేషించవచ్చు.వీర విప్లవ విప్లవ రైతాంగ పోరాటం అన్నారు. ఆ ఉద్యమాన్ని ఓవర్ గ్లోరిఫై చేశారు. వీర, వీర అంటూ వీరులందరూ బలి ఇచ్చి అమరులయ్యారని పాటలు పాడి పోస్టర్లు వేసి

ఇంకొంతమందిని బలి పశువులుగా మార్చేశారు. ఈ పోరాటంలో దాదాపు ఐదువేల మంది మరణించారు. పోలీస్ యాక్షన్ పేరుతో జరిగిన దురాక్రమణలో ఎంతమంది ముస్లిములు, హిందువులు, కమ్యునిస్టులు చనిపోయారన్న విషయం పై ఎవరికీ అంచనా లేదు. ఆ తరువాత వచ్చిన నక్సల్‌బరి ఉద్యమంలో దాదాపు 30-40వేలమంది మరణించారు. ఆ తరువాత వచ్చిన నక్సలైట్ ఉద్యమంలో ఆదిలాబాద్,వరంగల్, కరీంనగర్, తదితర జిల్లాల్లో ఇప్పటి వరకు 20వేల మంది చైతన్యవంతులైన యువకులు చనిపోయారు. ఉద్యమం జరుగుతున్నపుడు ఎవరు ఏం చెప్పినా నమ్ముతాం... ఆ సందర్భం పరిస్థితులు అలాంటివి. కానీ ఆ ఉద్యమం ముగిశాక ఉద్యమ ఫలితాలు ఎలా ఉన్నాయి? ఎవరి ఖాతాలో పడ్డాయి? ఉద్యమంలో ఎవరు, ఎప్పుడు, ఎలా చనిపోయారు? చివరిదాకా ఎవరు బ్రతికున్నారు? నాయకత్వం ఎవరి చేతుల్లో ఉంది? నిధుల సేకరణ ఖర్చు ఎలా సాగింది? ఉద్యమ పార్టీకి అనుబంధంగా ఏఏ శాఖలు ఉన్నాయి? ఎవరి చేతుల్లో ఉన్నాయి. ఇత్యాది విషయాలను విశ్లేషణా దృష్టితో చూస్తే ఆ ఉద్యమం ఎవరి కోసం జరిగింది? ఎవరు నిర్వహించారు? ఇత్యాది విషయాలు సులువుగానే అర్ధమవుతాయి.తెలంగాణాలో వచ్చిన అన్ని ఉద్యమాలను ఈ దృష్టితో చూస్తే ఏ ఉద్యమాన్ని ఎవరు ఎందుకు నిర్వహించారో సులువుగానే అర్ధమవుతుంది.

“రజాకార్లు ప్రత్యేకించి హిందువుల మీద పెద్ద ఎత్తున దాడి చేశారు. కొన్ని సందర్భాల్లో ముస్లీంల మీద కూడా దాడి చేశారు. వంగి సలాం చేయని ప్రతి ఒక్కరి మీద దాడి చేశారు. అరాచకాలు, సృష్టించి లూటీలు చేశారు. వారి చర్యలు నన్ను నిస్సహాయుడిని చేశాయి అని నిజాం స్వయంగా అన్న మాటల్లోని నిజాయితీని ఎంతశంకించినా అందులో కొంతయినా నిజం ఉందని నమ్మకూడదా?

## వామపక్ష పార్టీల్లో వారిదే నాయకత్వం

తీవ్రవాద వామపక్ష పార్టీల్లో ఉండే ఆదిరెడ్డి,సంతోష్ రెడ్డి, వీరన్న, ఆర్కే విజయక్క పద్మక్క బెల్లి లలిత తదితరులతో పాటు తెలంగాణ ప్రాంత హోంమంత్రులు కూడా మరణిస్తారు. కాదు చంపబడతారు. ఆదేమిటో ఆంధ్ర నక్సలైట్ నాయకులు, హోం మినిస్టర్‌లు సహజ మరణాలే చెందుతారు. పార్లమెంటు పంధాలో ఉండి ఎదిగిన తెలంగాణ నాయకులు వి.వి గురుమూర్తి, మాధవరెడ్డి, జనార్దన్ రెడ్డి, ఇంద్రారెడ్డి లాంటి వారు అర్ధాయుష్కులై తరలిపోతారు. నక్సలైట్‌లను మొదట నరికిపోగులు పెట్టడం ప్రారంభించిన జలగం వెంగళరావు చేసుకున్న పుణ్యం ఏమిటి? పండు ముదుసలి అయిన హయగ్రీవాచారి, కడెం



నారాయణ రెడ్డి వంటి వారు చేసిన పాపాలు ఏమిటి? వెంగళరావుకు సహజ మరణమే ఎలా సంప్రాప్తించింది. గద్దరు ఒంట్లో బుల్లెట్లు ఎలా దిగుతాయి. ఆంధ్ర ప్రాంత, అగ్రవర్ణ నక్సల్స్ నాయకుల ఒంటి పై ఒక లాఠీ దెబ్బకూడా ఎందుకు పడదు. అంతా అద్భుతమైన మ్యాచ్ ఫిక్సింగ్, తోడేళ్ళలో వారే కుందేళ్ళలో వారే. విచిత్రమేమిటంటే ప్రత్యేకరాష్ట్ర ఉద్యమంలో కూడా చివరి అంకంలో వీరే వేదికలెక్కి మైకులు చేజిక్కించుకున్నారు. టివి తెరల మీద కనిపించారు.

## నైజాం స్వతంత్ర దేశం

నైజాం ఒక దశలో స్వతంత్ర దేశంగా ఉండాలనుకొన్నాడు. ఇది నచ్చని నైజాం రాజ్యంలోని హిందువులు, ముఖ్యంగా ఆర్య సమాజీయులు దేశాన్ని భారతయూనియన్‌లో కలపాలన్నారు. హైదరాబాద్ కేంద్రంగా కొందరు హిందువులు కోరుకున్న కోరిక అది. ఈ సందర్భంలోనే నైజాం దేశాన్ని స్వతంత్ర ఇస్లామిక్ దేశంగా తీర్చిదిద్దాలని రజాకార్లు కోరుకున్నారు. నిజాం ఇష్టాఇష్టాలతో నిమిత్తం లేకుండా కొందరు ముస్లింలు రజాకార్లుగా అవతారమెత్తి హిందువుల పై అనేక అత్యాచారాలకు, హత్యలకు పాల్పడ్డారు. ఇది చారిత్రక సత్యం. ఐతే రజాకార్ల చేతిలో హతులయిన వారి సంఖ్య కన్నా బ్రహ్మానందరెడ్డి హయాంలో హతులైన వారిసంఖ్యే ఎక్కువ. ఈ హతులందరు సహజంగా తెలంగాణ వారే. అలాగే వెంగళరావు హయాంలో కూడా ఇంతేమంది తెలంగాణ వారు హతులయ్యారు. కాఫీర్ అన్నా, ముస్లీం అన్నా, తెలంగాణ వాది అన్నా, కమ్యూనిస్టు అన్నా, నక్సలైట్ అన్నా, పేర్లు ఏవైనా కానీ హతుల్లో అత్యధికులు తెలంగాణ వారే. వీరిలో అత్యధికులు బి.సి యస్సీ కులాలకు చెందిన వారే ఎక్కువగా ఉంటారు. మొత్తం మీద నైజాం దేశాన్ని భారతదేశం ఆక్రమించుకొని మూడు ముక్కలను చేసి ఒకముక్కను కర్ణాటకలో, ఒక ముక్కను మహారాష్ట్రలో, మరోముక్కను ఆంధ్రప్రదేశ్‌లో కలిపేశారు. ఈ కలుపు పనిలో కమ్యూనిస్టులు, కాంగ్రెస్ వారు కలిసే పనిచేశారు.

## సహాయం పేరుతో స్వాహ చేసిన ఆంధ్ర కమ్యూనిస్టులు

సహాయం పేరుతో ఆంధ్ర కమ్యూనిస్టులు నైజాం జిల్లాల్లో జొరబడి తెలంగాణ సాయుధ రైతాంగా పోరాటం పేరుతో ఒక ఉద్యమాన్ని నడిపి దాన్ని ఓవర్ గ్లోరిఫై చేసి, ఆ వెలుగులో తెలంగాణలోకి వెల్లువలా వలస వచ్చి స్థిరపడ్డారు. ఆ వలసలను కమ్యునిస్టు పార్టీ అధికారికంగానే ప్రోత్సహించింది, సహకరించింది. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం వాళ్లు చెబుతున్నంత గొప్పగా ఏమీ నడవలేదు. గొప్ప ఫలితాలనివ్వలేదు. పైగా ఉద్యమం

ఉధృతంగా నడిచింది కొన్ని మండలాల్లో మాత్రమే. ఈ సాయుధ రైతాంగ పోరాటమే తరువాత విశాలాంధ్ర ఉద్యమానికి భూమికగా పనిచేసింది. పోరాటంలో రిక్రూట్ చేసుకునే ముందు కార్యకర్తలతో చేయించుకున్న ప్రతిజ్ఞను సూక్ష్మదృష్టి తో చూస్తే పలు అనుమానాలు పొడసూపుతాయి. విశాలాంధ్ర నా మాతృభూమి విశాలాంధ్రకోసం నేను అవసరమైతే ప్రాణ త్యాగం చేస్తాను. విశాలాంధ్రకు వ్యతిరేకంగా నేను పనిచేస్తే నాకు సంఘం ఏ శిక్షనైనా విధించవచ్చు. ఈ ప్రతిజ్ఞ చేయించుకున్నాకే కార్యకర్తలను పార్టీలో చేర్చుకొని చేతికి ఆయుధాలు ఇచ్చారు. అలా ఆంధ్ర కమ్యూనిస్టు నాయకులు విశాలాంధ్రకు పూర్తి మద్దతునిచ్చి దాని నిర్మాణానికి కృషి చేశారు. దీని తర్వాతనే చాలా రోజులకు నక్సలైట్ ఉద్యమం తెలంగాణలో రాజుకుంది. దీని నాయకత్వం కూడా ఆంధ్రులదే. నక్సలైట్ ఉద్యమం ఏసత్ఫలితాలను ఇచ్చిందో కానీ పదివేల మంది చైతన్యవంతులైన తెలంగాణ యువకులను పొట్టనబెట్టుకుంది. రక్త తర్పణలు, త్యాగాలు, అరెస్టులు, ఎన్‌కౌంటర్‌లు దాడులు, ఇలా అనేక రూపాలలో సాగిన ఆ ఉద్యమం ఎందరినో కుటుంబాలు లేనివారిగా, చదువులేని వారిగా మిగిల్చింది. ఈ ఉద్యమంలో ఒరిగిన వీరులందరూ సహజంగా తెలంగాణ వారే. వీరిలో ఎస్సీ, బీసీలే అత్యధికులు.

స్వాతంత్రానంతరం దేశ విభజన కాలంలో ఎక్కువ కల్లోలానికి గురియైన దేశాలు, ప్రదేశాలు రెండున్నాయి. ఒకటి కాశ్మీరు కాగా రెండోది తెలంగాణ. కాశ్మీరు కొంత ప్రదేశాన్ని కోల్పోయి ప్రత్యేక ప్రతిపత్తితో అడపాదడపా కొంత డిస్టబెన్స్‌తో ఇండియాలో ఇమిడింది. తెలంగాణ నిత్య అశాంతితో, రక్తపుటేర్లతో, నిరంతర ఆక్రమణలతో నరమేధం సాగుతూనే ఉంది. సాయుధ రైతాంగం పేర వేలాది మందిని అటు నైజాం పోలీసులకు, కమ్యూనిస్టుల పేరా ఇటు యూనియన్ సైన్యాలకు ఎరగా వేశారు. తరువాత ముఖ్యమంత్రి అయిన బూర్గుల పోలీసుల బుల్లెట్లకు కొందరు బలయ్యారు. ఈ బలి కార్యక్రమం తెలంగాణలో నిత్యం సాగుతూనే ఉన్నది. ఈ బలి కార్యక్రమాల నాయకులెప్పుడూ ఆంధ్రప్రాంతం వారే... బలి అవుతున్నది తెలంగాణ వారే కావడం యాదృచ్ఛికం ఏమీ కాదు. బలి ఫలితం ఎప్పుడూ వాళ్ల ఖాతాలోనే పడ్డది, పడ్తున్నది. సుందరయ్య అనబడే పుచ్చలపల్లి సుందరరామిరెడ్డి నుంచి సీతారామయ్య అనబడే కొండపల్లి సీతారామిరెడ్డి వరకు నాయకత్వమంతా ఆ ప్రాంతం వారిదే... వారెప్పుడూ 'సేఫ్ గేం' సహజ మరణాలే చెందుతారు. బందగీ మొదలుకొని భూమయ్య, రాజయ్య, కిష్టాగౌడ్, పులిఅంజయ్య, మధుగౌడ్, రామనాథం పురుషోత్తం లాంటి వేలాధిమంది హతులంతా తెలంగాణవారే. ఉద్యమం ఏదైనా, సిద్ధాంతం ఏదైనా, పార్టీ ఏదైనా కష్టాలు, నష్టాలు తెలంగాణా వారికే. నాయత్వాలు, లాభాలు, సౌకర్యాలు, విలాసవంతమైన జీవితాలు ఆంధ్ర ప్రాంతం వారికే...



దాదాపు అన్ని రాజకీయ పార్టీలలో, వామపక్ష పార్టీలలో వాటి అనుబంధ సంఘాలలో, పౌరహక్కుల సంఘాలలో ఉద్యోగ కార్మిక సంఘాలలో చివరికి మహిళా, బాలల సంఘాలలో కూడా నాయకత్వమంతా వారిదే. విద్యార్థి, సాంస్కృతిక రంగాలలో కూడా వారే పెద్ద పీట వేసుకొని కూర్చున్నారు. లేదా వెనుక ఉండి నడిపిస్తారు. వీరందరూ ఆంధ్రా సీమవారి దళారీ ప్రయోజనాలు కాపాడుతూ తెలంగాణ వారి గొంతును నొక్కుతూ హక్కులను కాలరాస్తూ ఉంటారు.

## తెలంగాణా వారికి నష్ట పరిహారం ఇస్తారా?

తెలంగాణా విషయంలో రెండున్నర లక్షల ఎకరాల భూమి ఎవరెవరు ఎలా ఆక్రమించుకున్నారు అన్న విషయాన్ని పరిశీలించి నష్టపోయిన మూలవాసులకు పరిహారం ఇప్పించాలి. రెంట్ కంట్రోల్ యాక్టు ద్వారా నష్టపోయిన ఇంటి యజమానులకు పరిహారం ఇవ్వాలి. ఎపిపిఎస్‌ఎసి ద్వారా జరిగిన నియామకాల్లో అన్యాయం జరిగిన నిరుద్యోగులకు న్యాయం చేయాలి. ఆస్తుల పంపకం, ఉద్యోగుల పెన్షన్‌ల పంపకం విషయంలో ఆచితూచి అడుగువేయాలి. 1956 తర్వాత వచ్చిన భూమి చట్టాలు, ఉద్యోగుల చట్టాలను సమీక్ష చేయాలి. నియోజకవర్గాలను, రిజర్వేషన్లను సమీక్షించాలి. బాలికల విద్యను ప్రోత్సహించాలి. మానవ, సహజవనరుల అభివృద్ధికి ప్రత్యేక మంత్రిత్వశాఖలను ఏర్పర్చాలి. ప్రాథమిక విద్య, వైద్య సౌకర్యాలను యుద్ధప్రాతిపదికన మెరుగుపరచాలి. నీటివనరుల వినియోగం, కొత్త పథకాల రూపకల్పన జరగాలి. ప్రభుత్వం పంచిన హరిజన, గిరిజన భూములు ఏమయ్యాయో విచారించాలి. కనీసం ఐదు కొత్త జిల్లాలను ఏర్పాటు చేయాలి. హైదరాబాద్ పరిధిని కుదించాలి. కులాలవారీగా జనాభా లెక్కలను సేకరించి, వారి అభివృద్ధి – సంక్షేమ కార్యక్రమాలను రూపొందించాలి. బిసిలలో వృత్తి కులాలు, సేవక కులాలు, ఉపకులాలు, ఆశ్రిత కులాల వారీగా ఒక్కోకులానికి కనీసం వంద కోట్లనిధితో కార్పోరేషన్‌లను, రాజధానిలో హాస్టల్స్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. కోయ, గోండి, చెంచు, లంబాడి గూడెలలలో వారి పరిపాలననే ప్రోత్సహించాలి. వారి భూములను, సంస్కృతిని పరిరక్షించాలి. ముస్లిం, మైనారిటీల హక్కులను, ఆస్తులను ప్రత్యేక దృష్టితో చూడాలి.

లోతైన దృష్టితో ఇత్యాది ఎన్నో అంశాలను జాగ్రత్తగా పరిశీలించి ఏర్పడే కొత్త రాష్ట్రంలో ఎల్లరికి న్యాయం జరిగేలా జాగ్రత్త వహించాలి. ఏది ఏమైనా సోదరభావంతో విడిపోవడం ముఖ్యం. జరిగిన నష్టం ఎలాగో జరిగింది. 1969లో పోరాడిన ముందుతరం వారు తీరని నష్టానికి, కష్టాలకు గురై వెళ్ళిపోయారు. ఉన్నవారు మనశ్శాంతితో వుండడం ముఖ్యం.

## హైదరాబాద్ - ఒంటె గుడారం కథ

ఆంధ్రరాష్ట్రం ఏర్పడేటపుడు రాజధాని ఎక్కడ పెట్టాలనే విషయమై అనేక తర్జనభర్జనలు జరిగిన అనంతరం కర్నూలును ఖాయం చేసుకున్నారు. ఒక దశలో విజయవాడ రాజధాని కావాలని కొందరు చేసిన ప్రపోజల్‌ను ఖండిస్తూ పెద్దాయన ప్రకాశం పంతులు అన్న మాటలు "ఒరేయ్ ఫైల్స్ సచివాలయంలో ఉండవురా...కమ్మ వారిళ్లలో ఉంటాయి.".

కర్నూలులో గుడారాల్లో ఉన్న ఆంధ్రులు రెడీమేడ్ రాజధాని అయిన హైదరాబాద్‌పై కన్నేసి ఒంటె అరబ్బు వాడి కథను నిజం చేశారు. ఇప్పుడు వారే ఏమాత్రం జంకు గొంకు లేకుండా హైదరాబాద్‌ను మేం అభివృద్ధి చేశాం అంటున్నారు. "హైదరాబాద్ బాగుందని వారు వచ్చారా... లేక వారు వచ్చి హైదరాబాద్‌ను బాగుచేశారా? అని అడిక్‌మెట్‌లో పుట్టి పెరిగిన మంగలి నర్సయ్య అడుగుతున్నాడు.. ఏ ఆంధ్రుడైనా ఈ ప్రశ్నకు ఏమని సమాధానం చెబుతాడు. నర్సయ్య అడిగిన ప్రశ్నకు లౌక్యాన్ని జోడించకుండా సూటిగా చెప్పాల్సి వస్తే ఏమని చెప్తారన్నది ముఖ్యం. హైదరాబాద్‌కు వచ్చి మీరు అభివృద్ధి చెందారా హైదరాబాద్‌ను అభివృద్ధి చేశారా? అన్నది యోచించుకొండి?

## హైద్రాబాద్ ఎవరిది?

హైదరాబాద్ విశాల నైజాం రాజ్యపు రాజధాని నగరం. కాకతీయుల పాలన ముగిసేనాటికే గోల్కొండ దుర్గం ఏర్పడి అక్కడ పట్టణం నిర్మితమయినది. ఇరాన్‌లోని ఇస్పహాన్ తరహాలో నిర్మిచిన అందమైన నగరం ఇది. 1947-56 నాటికే వీధులు, కూడళ్లు రాజభవనాలు, హైకోర్టు, ఆసుపత్రి, విశ్వవిద్యాలయం,మ్యూజియం, పార్కులు, జలాశయాలు, వాటర్-డ్రైనేజి, విమానాశ్రయం, రైల్వేస్టేషన్లు ఇలా సమస్త సౌకర్యాలు సమకూర్చుకున్న సుందర నగరం ఇది. 1956నాటికే హైద్రాబాద్ ప్రపంచంలో లెక్కించదగిన నగరాల్లో ఒకటి. నైజాం దేశం ఒక పెద్ద దేశం. అటు చెన్నై, కేరళ పైన ఔరంగాబాద్ తూర్పున శ్రీకాకుళం మరోపక్క కర్ణాటకలో ఐదారు జిల్లామేర విస్తరించిన దేశమిది. బ్రిటీష్ వారి మిత్ర దేశం. స్వతంత్ర దేశం, సంపన్నదేశం.

నైజాం ప్రపంచంలోనే సంపన్నుడిగా ఘనతకెక్కాడు. ఏడవ నిజాం ప్రపంచంలోనే సంపన్నుడని 1937లో అమెరికా నుంచి వెలువడే టైమ్స్ పత్రిక పేర్కొంది. ఆ యేడు టైమ్స్ వార్షిక సంచిక ముఖచిత్రాన్ని నిజాం ఫోటోతోనే అలంకరిచారు. ఫోర్బ్స్ వారి వివరాల ప్రకారం ప్రపంచ సంపన్నుల్లో నైజాం వారసుడు నేటికీ ఐదవ స్థానంలో నిలుస్తున్నాడు. బిల్‌గేట్స్‌లాంటి



సంపన్నుడు 20వ స్థానంలో ఉన్నాడు. పోలీసు యాక్షన్ పేరుతో మిలటరీ ఆక్రమణ జరిగిన తరువాత నైజాం నెహ్రూకు దాదాపు ముప్పై పెద్ద పెట్టెలనిండా ట్రెజరీని ప్రత్యేక రైలులో ఢిల్లీకి పంపించాడు. ఆ ట్రెజరీ విలువలను, వాటి వివరాలు కేంద్ర ప్రభుత్వం నేటికీ వెల్లడించనే లేదు. నైజామే కాదు ఇక్కడ సామాన్యులు కూడా సిరిసంపదలతో తులతూగేవారు. మధ్యతరగతి వారి శవయాత్రలలో  కూడా పేలాలలో కలిపి ముత్యాలు బంగారు పూవులను శవం పై చల్లేవారు. ఈ సంపన్న నగరానికి వచ్చి ఎవరో ఏదో చేశామంటే ఎలా నమ్మేది. హైదరాబాద్ విషయంలో ఎవరైనా నోరు జారితే పరిస్థితి మరోరకంగా ఉంటుందనడంలో అనుమానం లేదు.

## రాజధాని హైదరాబాద్ అందరిది కాదా?

ఇష్టం ఉన్నా లేకపోయినా, తెలంగాణ వారు వ్యతిరేకించినా హైదరాబాద్ రాష్ట్ర రాజధాని అయ్యింది. రాష్ట్ర ప్రజలు ఉపాది, ఉద్యోగ అవకాశాల కోసం రాజధానికి రావడం సాధారణంగా జరుగుతుంది. ఇదేమీ అసాధారణం కాదు. అలాగే సీమ, ఆంధ్రులు రాజధానికి వచ్చారు. వచ్చి వచ్చి తెలంగాణా వారి 85 శాతం అవకాశాలను లాగేసుకున్నారు.

బూర్గుల రామకృష్ణారావు భవన్, సచివాలయం ఇలా రాష్ట్ర స్థాయి ప్రభుత్వ కార్యాలయంలో సీమ, ఆంధ్రులు 85 శాతం పైగా ఉంటున్నారు. రియల్ ఎస్టేట్‌లో 95 శాతం వారే. మైన్స్ లాబీలో  95 శాతం వారే. ఇలా ఏ ఒక్క రంగాన్ని వారు వదలలేదు. జుడిషయరీలో అయితే 98 శాతం వారే నిండి పోయారు. మీడియాలో నూటికి నూరు శాతం వారి మాటనే చెల్లుబాటు అవుతుంది.

సీమ, ఆంధ్రుల వలెనే గుజరాతీలు, మార్వాడీలు, బీహారి, ఒరిస్సా-బెంగాలీలు ఎందరో వలస వచ్చారు. వారు వ్యాపారాలకోసం, పొట్టకూటికోసం వచ్చారు. వీరు భూముల్ని, పొట్టలను కొట్టడానికి వచ్చారు. అందుకే వీరి పట్ల నిరసన.

## ముంబాయి, చెన్నైలు ఏమయ్యాయో హైదరాబాద్ అదే అవుతుంది

తమిళనాడు నుండి ఆంధ్ర రాష్ట్రం విడిపోయినప్పుడు మద్రాస్ ఏమైంది. మహారాష్ట్ర నుండి గుజరాత్ విడిపోయినప్పుడు బొంబాయి ఏమైంది. ఆ నగరాలను కేంద్ర పాలిత ప్రాంతాలను చేశారా? మరి ఇప్పుడు హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతం అని ఎందుకంటున్నారు?

బొంబాయిలో మార్వాడీ, గుజరాతీల కన్నా వలసాంధ్రులవి హైదరాబాద్‌లో ఎక్కువ పెట్టుబడులున్నాయా? ఉంటే ఉన్నాయి. తెలంగాణ నుండి హైదరాబాద్‌ను వేరు చేయడం అన్నది ప్రమాదరకమైన ఆలోచన. దీంతో అనేక ఉత్పాతాలు, చాలా గొడవలు జరిగి పోతాయి. ఈ విషయమై దానం నాగెందర్, ముఖేష్ లాంటి వారు ఎంత తక్కువగా మాట్లాడితే వారికే అంత మంచిది. వారు ఏమి మాట్లాడుతున్నారో వారికి తెలియడం లేదు.

"బొంబాయిలో గుజరాతీలు పెట్టుబడులు పెట్టినా వారు బతకడానికి వచ్చినవారే అవుతారు. బొంబాయి భౌగోళికంగా చారిత్రకంగా మహారాష్ట్రులదే అవుతుందే తప్ప వ్యాపారం కోసం వచ్చిన గుజరాతీయులది కాదు. బొంబాయి నగరం మనుగడకు వనరులు సమకూరుస్తున్నది మహారాష్ట్ర. మహారాష్ట్ర నుంచి సరఫరా అయ్యే వనరులు ఆపివేస్తే బొంబాయి నగరం ఒక్క రోజులో మృత నగరంగా మారిపోతుందని అంబేద్కర్ హెచ్చారించారు. మీరు బొంబాయి కోసం పట్టుబడితే బొంబాయికి మంచి నీళ్ళు, కూరగాయలు, పాలు లాంటి నిత్యవసరాలు రానేరావు. అన్ని ఆయన వారిని హెచ్చరిస్తారు. హైదరాబాద్‌ని "ఇట్ ఈస్ నాట్ ఎ సిటీ బట్ గ్రూప్ ఆఫ్ విలేజెస్" అని అంటారు. తెలంగాణ సంస్కృతియే హైదరాబాద్ సంస్కృతి. ఎన్ని గ్రామాలు ఇందులో ఉన్నాయో! అంబర్‌పేట, మారెడ్‌పల్లి, చిక్కడపల్లి, బాకారం, బోయిన్‌పల్లి, చిలకలగూడ, నాచారం, రామంతపూర్, చింతల్,నాంపల్లి, ముషీరాబాద్, చంచల్‌గూడ, అడిక్‌మెట్ ఇలా ఎన్నో గ్రామాలు. ఈ నగరం ఇతరులెవరిదీ కాదు. ఇది హైదరాబాదీలదే, ఇది తెలంగాణ వారిదే.

## వారికున్న దేంటి? తెచ్చిందేంటి? అంతా ఇక్కడి సంపదే..

అక్కడి పెట్టుబడులు తెచ్చి హైదరాబాద్‌లో పెట్టామంటున్నారు..ఏం తెచ్చారో లెక్కలు చెప్పండి.. తేవడానికి మీ దగ్గర ఏం ఉంది? ఆంధ్ర ప్రజలందరిని కలుపుకొని కాదు. ఒక్కొక్కరుగా మాట్లాడండి... ఎన్నికల నామినేషనప్పుడు, లేదా మీరు హైదరాబాద్‌లో మొదట కాలు పెట్టినపుడు మీ సంపద ఎంత... ఆ తరువాత పెరిగింది ఎంత.. నామినేషన్ వేసినపుడు మీరు డిక్లేర్‌చేసిన ఆస్తులెన్ని.. ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్తూ ఆ తరువాత హైదరాబాద్‌కు మీరు చేసిందేంటో చెప్పండి. హైదరాబాద్‌లో ఉండి మీరు సంపాదించింది ఎంతో చెప్పండి.

ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్, వెలగపూడి రామకృష్ణ లాంటి కొద్దిమంది పారిశ్రామికవేత్తలు మినహా వారు సృష్టించిన సంపద ఏముంది? శూన్యంలోంచి సంపద సృష్టించబడిందా.. హైదరాబాద్, రంగారెడ్డి భూములను అమ్మడం ద్వారా, తెలంగాణా ప్రజలను వంచించడం ద్వారా సమకూరిన డబ్బులను మా సంపద, మా కష్టం అని అనడంలో ఔచిత్యం ఏముంది...?



కావూరి, లగడపాటి, రామోజీరావు, రాయపాటి, సుబ్బిరామిరెడ్డి, గాలి జనార్ధన్‌రెడ్డి, తదితరులు ఎక్కడ జీవన ప్రస్థానం మెదలుపెట్టారు? ఇప్పుడు ఎక్కడిదాకా వచ్చారు? వీరి సంపాదన ధర్మబద్ధమైనదేనా? చట్టానికి దొరకకుండా చేసుకున్నంత మాత్రానే అవినీతి లెక్కలోకిరాదా? ఒక్క లగడపాటి ఆస్థి ఎంత? రామోజీరావు ఆస్తులెన్ని? రామానాయుడు సంపద ఎంత? సుబ్బిరామిరెడ్డి బంగళాలు ఎన్ని? చంద్రబాబు వార్షికాదాయం ఎంత? కమ్యునిస్టు పార్టీ శాసన సభ్యుల ఆస్తులెన్ని? పువ్వాడ నాగేశ్వర్‌రావుకు కార్పోరేట్ ఆసుపత్రులు, కళాశాలలెందుకు? సత్యం రామలింగరాజు ఎన్ని డబ్బులతో తెలంగాణకు వచ్చాడు? సత్యం స్పిన్నింగ్ మిల్లులో రామలింగరాజు మింగిన నిధులెన్ని? తరువాత ఆయనే సత్యం కంప్యూటర్‌ను స్థాపించి అనేక దొంగవేషాలు వేసి, సత్యంను తిరగేసి మైటాస్‌గా మార్చి ఏమార్చిన నిధులెన్ని? జయభేరి మురళీ మోహన్ చేతుల్లో ఎన్ని భూములున్నాయి? అక్కినేనివారి ఆక్రమణలో ఎన్ని ఎకరాల భూములున్నాయి. చిరంజీవి తొలిసంపాదన ఎంత? ఇప్పుడు ఆయనకున్న ఆస్తుల విలువెంత? అద్దాల బంగళాకు రాళ్ల దెబ్బలు తగలకుండా వలకప్పి రక్షించుకుంటున్న జివికె అనుసరించిన సంపాదనా మార్గం ఏది? ఆయనకు ఎన్ని హెూటల్స్ ఉన్నాయి? ఇలా ఎన్ని వేలమంది పేర్లను ఉటంకించమంటారు. వారి మొత్తం సంపదను కూడితే ఎంత అవుతుంది? వీరి సంపాదనంతా ధర్మబద్ధమైనదేనా? చట్ట బద్ధమైనదేనా?. ఆ చట్టాలను చేసిందెవరు? ఎవరెవరికి ఏ చట్టాన్ని ఎలా మినహాయించారో ఎలా తెలుస్తుంది? ఎన్ని కోర్టు తీర్పులను వీరు మెనేజ్ చేసుకోగలిగారు? వీరు సంపాదించుకోగా మిగిలితే కదా హైదరాబాద్‌కు ఏమైనా చేయడానికి. వీరి బాటలోనే వైయస్ హయాంలో కడప రెడ్లు తెలంగాణను కుమ్మి పారేశారు. లాండ్ లిటిగేషన్‌లను అడ్డగోలుగా పరిష్కరించుకొని కోట్లు కోట్లు మూటగట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా భూముల లిటిగేషన్‌లను వైయస్ పరపతిని అడ్డుపెట్టి వైఎస్ మనుష్యులు డబ్బుల మూటలుగా మార్చుకున్నారు.

## ఎంత సంపాదించుకున్నారు?

ఇలా ఆ ప్రాంతపు ఒక రాజకీయవాది సంపాదించిన డబ్బు మొత్తం ఒక్క ఏడాది బల్దియా బడ్జెట్ అంత ఉంటుంది. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడానికి ఇక డబ్బులెక్కడివి? అన్ని రకాల ప్రభుత్వాదాయాలను ఆంధ్ర, రాయలసీమ పాలక వర్గాలు తమ ప్రైవేటు ఖాతాలలోకి మళ్లించుకున్నారు. ఆ ప్రాంత ప్రజలు ఈ విషయాన్ని అర్థం చేసుకోకుండా నాయకుల కొమ్ము కాస్తే ఎవరికి నష్టమో యోచించుకోవాలి.

## రాష్ట్రం పేరు పెట్టడంలో మాయ

ఆనాడు 1956లో రెండు ప్రాంతాలు కలిసి కొత్తరాష్ట్రం ఏర్పడేటప్పుడు ఏ పేరు పెట్టాలనే విషయమై చర్చించుకొని ఇరుప్రాంతాల నాయకులు "తెలంగాణాంధ్రప్రదేశ్" అనే పేరును ఖాయం చేశారు. ఆమేరకు నిర్ణయం అయింది. పార్లమెంట్ సెలెక్ట్ కమిటికి పంపేవరకు ఆ పేరే ఉంది. ఆ తరువాత ఢిల్లీ స్థాయితో పార్లమెంటులో మాయ చేసి కేవలం ఆంధ్రప్రదేశ్ పేరునే ఉంచి రాష్ట్రపతి ఆమోదానికి పంపించారు. ఇది ఎంతటి అన్యాయం. ఇలాంటి అన్యాయాలు ఎన్నో చేసి కుతంత్రాలు పన్ని తెలంగాణ వారిని ఆర్థికంగా, రాజకీయంగానే కాదు, సాంస్కృతికంగా కూడా తీవ్ర అన్యాయానికి గురిచేశారు. తెలుగు సినిమాల్లో విలన్‌లకు, జోకర్‌లకు, పనిమనుషులకు తెలంగాణ యాసలో సంభాషణలు పెట్టి భాషను కించపరచారు, పరుస్తున్నారు.. స్వచ్ఛమైన తెలుగు పదాలు, తెలుగు సొంపు వినాలంటే నైజాం దేశంలోని తెలుగు ప్రాంతాలకు వెళ్లాల్సిందేనని ఆంధ్రపండితులు చెప్పిన సూచనలను కావాలని మరుగుపరచిన వారెవరు.? పాఠ్యపుస్తకాల్లో ఒక్క పదం గానీ ఒక్క వ్యక్తి చరిత్ర గానీ ఒక్క సంఘటన గానీ తెలంగాణకు సంబంధించినది లేకుండా నాటినుంచి కుట్ర చేస్తూనే ఉన్నారు. చివరకు పిల్లల పాటలను సామెతలను కూడా ఆంధ్ర ప్రాంతానికి చెందినవే ఇస్తున్నారు. ఇవి కుట్రలు కావా..? ఇది సాంస్కృతిక కుట్ర కాదా?

## అన్ని ఉల్లంఘనలే - అన్ని మోసాలే

పెద్ద మనుష్యుల ఒప్పందం దగ్గర నుండి ఏ ఒప్పందాన్నీ వారు ఒప్పుకుని అమలు పరచలేదు. ఆరు సుత్రాల పథకం దగ్గర నుండి ఏ సూత్రానికి మీరు కట్టుబడి ఉన్నారు? ఏ హామీని ఆంధ్ర పాలకాలు నిలబెట్టుకున్నారు? ఏ ఒప్పందాన్ని గౌరవించారు? ఏ పథకాలను ప్రత్యేకంగా రూపొందించారు, ఏ వివక్షను రూపు మాపారు?

నీరు, బొగ్గు, కొలవులు, భూములను, అడవులను, కొల్లగొట్టి తెలంగాణ వారిని బికారులుగా మార్చి ఆత్మహత్యల వైపు నెట్టారు.

తెలంగాణ అనగానే టిఆర్ఎస్‌తో సంబంధం లేకుండా, కేసిఆర్ నాయకత్వంతో సంబంధం లేకుండా మేధావులు, కవులు, రచయితలు, కళాకారులు, జర్నలిస్టులు సాధారణ గృహిణులు, ఆటో డ్రైవర్లు, చివరికి అన్ని రకాల కులసంఘాలు కదిలి వస్తున్నాయి. గత ఐదున్నర దశాబ్దాలుగా జరుగుతున్న అన్యాయానికి నిరసనగానే వీరు కదులుతున్నారు. వీరెవరు



రాజకీయాలతో సంబంధం లేనివారే.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడి 53 ఏళ్ళు అయ్యింది. ఈ 53 ఏళ్ళలో ముఖ్యమంత్రిగా తెలంగాణ ప్రాంతం వారు ముగ్గురు ఐదున్నర సంవత్సరాలే పరిపాలించారు. రాయలసీమ వారు 25 ఏళ్లకు పైగా పరిపాలించారు.అంటే తెలంగాణకు కేవలం 10 శాతం మాత్రమే వీరికి అవకాశం వచ్చింది. ఇలాగే మంత్రులుగా పనిచేసిన వారి పదవికాలం కూడా 10 శాతాన్ని మించలేదు. ఆదాయానికి, అధికారానికి అవకాశం ఉన్న మంత్రిత్వ శాఖలు తెలంగాణా వారికే దక్కవు. వై.ఎస్. వచ్చే వరకు ఆ రెండు కులాలలోని ఆ రెండు ప్రాంతాల వారికే అవకాశాలన్నీ రావడం యాధృచ్చికం కాదు. అలాగే ఐఏఎస్ పదవులు కూడా. 120 మంది ఐఏఎస్‌లుంటే అందులో 20 మంది మాత్రమే తెలంగాణ వారుంటున్నారు. జుడిషియల్ దుర్మార్గం ఇంకా ఎక్కువ ఉంది. ఇలా సమస్త రంగాల్లో అన్యాయం జరిగింది.మొత్తం రాష్ట్రంలో 15లక్షల మంది రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులున్నారు. ఇందులో 40శాతం ఉద్యోగులు తెలంగాణ వారుండాలి. ఐతే 12నుంచి 14శాతం మాత్రమే ఉన్నారు.దాదాపు నాలుగున్నర లక్షల ఉద్యోగాలను సీమాంధ్రులు కొల్లగొట్టారు. నెలకు తెలంగాణకు జరుగుతున్న నష్టం ఎంతో సులభంగా అంచనా వేయవచ్చు.

## ఆంధ్రుల దోపిడి - సాకులు

అసెంబ్లీ ఏడాదిలో వందరోజులు కూడా పనిచేయదు. ఆనూరు రోజులు వారుండటానికి క్వార్టర్స్ ఉండనే ఉంటాయి. మరి వారు హైదరాబాద్‌లో బంగళాలు కట్టుకుని శాశ్వత నివాసాలు ఎందుకు ఏర్పాటు చేసుకున్నట్టు? ఎంపీలెవరూ ఢిల్లీలో ఇలా స్థిరనివాసం ఏర్పాటు చేసుకోరెందుకు? శాసనసభ్యులు 264 రోజులు వారి నియోజక వర్గాలలో ఉండాలి. అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించాలి. కానివారు నియోజక వర్గాన్ని, ప్రజలను నిర్లక్ష్యం చేసి సంపాదనా పరులై హైదరాబాద్‌లోనే ఉంటారు. అందుకే ఈ తిప్పలన్నీ వచ్చి పడ్డాయి. హైదరాబాద్‌లో ఉండీ భూముల దందాలు పైరవీలు చేయడమే వీరి ముఖ్యమైన పనిగా ఉంటుంది. ఆంధ్ర ప్రాంత అభివృద్ధికి కేటాయించిన నిధులను వీరు అక్రమంగా సొంతం చేసుకుని వాటిని హైదరాబాద్‌లో పెట్టుబడులుగా మారుస్తారు. అలా వారు ఆంధ్రప్రాంతంలోని సంపన్న గ్రామాలను, అందమైన పట్టణాలను దివాళా తీయించి. మురికి కూపాలుగా మార్చారు. ఆ పాడుబడ్డ గ్రామాల నుంచి వలసలు ఎంతగా పెరిగిపోయాయంటే కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని కొన్ని గ్రామాలు నిర్మానుష్యంగా దీపం వెలగని బేచిరాగ్ అయ్యాయి. ఇలా

ఆంధ్ర ప్రాంత మానవ వనరులన్నీ తరలిపోయాయి. మెడకాయ మీద తలకాయలో కొంత మెదడున్న ఏ ఆంధ్రుడు అక్కడ ఉండటానికి ఇచ్చగించడు. హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు, ఢిల్లీ తదితర ప్రాంతాలకు తరలిపోతారు. అంతకు ముందే ఈ ప్రాంతాలకు వలస వచ్చిన వారు అమెరికా లాంటి దేశాలకు తరలి వెళుతున్నారు. దీంతో మూడునాలుగు దశాబ్దాల క్రితం కళకళలాడిన తెనాలి, బందరు, గుంటూరు, నెల్లూరు. కాకినాడ, ఏలూరులాంటి పట్టణాలు అభివృద్ధికి వెలియై మురికి కూపాలుగా మారిపోయాయి. ఈ ఆంధ్రపాలక వర్గాలు అటు ఆంధ్రప్రాంతాలకు, ప్రజలకు అన్యాయం చేస్తూ, ఇటు తెలంగాణ ప్రజలను దోచుకుంటూ వారికి వారు బాగుపడి కోట్లకు పడగలెత్తారు. కృష్ణాజిల్లా నిమ్మకూరుకు చెందిన యన్టీరామారావు ఆ వూరికి చేసింది శూన్యమే. మొగల్తూరుకు చిరంజీవి చేసిందేమీ లేదనే కదా చిరంజీవిని ఓడించింది. అలాగే శోభన్‌బాబు, లగడపాటి, సుబ్బిరామిరెడ్డి, పురంధరేశ్వరి, రేణుకాచౌదరి, కాసు బ్రహ్మానంద రెడ్డి తదితరులు వారి సొంత ఊళ్లకు జిల్లాలకు చేసింది చాలా తక్కువే కానీ వారికి వారు చేసుకుంది చాలా చాలా ఎక్కువ.

తెలంగాణ వారితో ఛీ కొట్టించుకొని హైదరాబాద్ చూరును పట్టుకొని వేలాడాల్సిన అవసరం అంధ్రులకు ఎందుకు? తమ సొంత రాష్ట్రాన్ని, సొంత రాజధానిని నిర్మించుకోడానికి వచ్చిన సదవకాశాన్ని ఎందుకని వద్దనుకుంటున్నారు. రాజకీయ వాదుల మాయలో ఎందుకు పడుతున్నారు. రాయలసీమ వారికి కూడా సొంతరాష్ట్రం ఏర్పాటు చేసుకోవడానికి ఇది సదవకాశమే కదా.. ముఖ్యంగా సగటు ఆంధ్రుడు, సగటు సీమ సోదరుడు ఆలోచించాల్సిన సందర్భమిది. స్వార్థపరులైన నాయకులు వారి అభివృద్ధి కోసం చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మకుండా విడిపోయి సుఖపడిపోవడం మేలన్న విషయాన్ని వారు గుర్తించాలి. చిన్న రాష్ట్రాలుంటే కేంద్రం అభివృద్ధిని పట్టించుకోదని, నిధులు రావనే ఒక అశాస్త్రీయ వాదనను కుహనా మేధావులు ముందుకు తెస్తున్నారు. ఇందులో ఎంతమాత్రం నిజంలేదు. మనం చిన్న రాష్ట్రాలుగా ఏర్పడుతున్నాం కానీ భారతదేశంలో నుంచి విడిపోవడంలేదు కదా. పరిపాలనా సౌలభ్యం కోసం చిన్న రాష్ట్రాలే మేలన్న విషయాన్ని ఎలా కాదన గలరు.

సీమ ఆంధ్రప్రాంత బడానాయకుడు ఏ ఒక్కరైనా తాము సంపాదించుకున్న దానిలో ఒక్కరూపాయికూడా ఆ ప్రాంత ప్రజల కోసం ప్రతిఫలాపేక్ష లేకుండా ఖర్చు పెట్టడన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలి. వ్యూహాత్మకంగా ఈతాకు వేసి తాటాకు తీయడానికి అన్నట్లు ఖర్చు చేస్తారే గానీ ప్రేమతో, అభిమానంతో ఖర్చు పెట్టరన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలి.



## ఉద్యమం లేచి చల్లారిన ప్రతిసారీ రెట్టించిన ఉత్సాహంతో వలసలు

ఉద్యమం లేచి ఆగిపోయిన ప్రతిసారీ, రెట్టించిన ఉత్సాహంతో ఆంధ్రులు తెలంగాణకు వలస వచ్చారు. స్థిరపడ్డారు. అలా వచ్చి వచ్చి ఇప్పుడు హైదరాబాద్ మాదే అనే స్థాయికి వచ్చారు. ముఖ్యంగా బ్రహ్మానందరెడ్డి కాలంలో పెరిగిన వలసలు ఎన్టీఆర్, చంద్రబాబు హయాంలలో గరిష్ట స్థాయికి చేరాయి. వైయస్ హయాంలో వలస ఆంధ్రులకు తోడు సీమ ఫ్యాక్షనిస్టులు కూడా భూముల దందాల్లోకి దిగారు. దుర్మార్గాలు, అన్యాయాలు పెరిగిపోయాయి. రంగారెడ్డి జిల్లా భూములను ఆక్రమించుకొని పుట్నాలు బఠాణీల్లా అమ్ముకున్నారు. ఒక్కోఎకరం పది నుంచి పన్నెండు కోట్లకు అమ్ముకున్నారు. ఈ డబ్బు తెలంగాణ వారిదే, భూములూ తెలంగాణ వారివే

గుంటూరు, కృష్ణా జిల్లాల కమ్యూనిస్టు పార్టీ విభాగాలు ఆ జిల్లాలలో ప్రత్యేక మీటింగులు పెట్టి తెలంగాణ భూములు మంచివి సారవంతమైనవి. చౌకగా ఉన్నాయి వెళ్లండి... వాటిని సొంతం చేసుకోండి... మీకు అక్కడ మన పార్టీ అండ ఉంటుంది. తెలంగాణ ప్రజలు అమాయకులు. వారితో పేచీలుండవని కుట్రపూరితంగా వలసలను ప్రోత్సహించాయి. నైజాం కాలంలో నిజాం సాగర్ ప్రాజెక్టుకింద నీటి పంటల సాగుకు వచ్చిన వారు ఎప్పుడూ వలసవాద ధోరణిలో లేరు. స్థానికులతో కలిసిపోవడానికే వారు ప్రయత్నించారు.

వలసలు ఇదీ, అది అని కాకుండా అన్ని రంగాల్లో వచ్చాయి. ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో సుబ్బారావు అని పిలిస్తే కనీసం ఇద్దరు పలుకుతారు. కాగజ్‌నగర్ అవతల విజయనగరం అనే సెటిలర్స్ క్యాంపు వుంటుంది. ఆ క్యాంపు నుంచి వచ్చి దినసరి కూలీగా సర్‌సిల్క్ ఫ్యాక్టరీలో పనిచేసిన కార్మిక నాయుకుడు ఎన్టీఆర్ హయాంలో మొత్తం జిల్లాను తన కనుసన్నల్లో నడిపించాడు. ఇలా నిజామాబాద్, నల్గొండ, ఖమ్మం పూర్తిగా వలస నాయకుల కనుసన్నల్లోనే నడిచాయి. వరంగల్, కరీంనగర్, పాలమూరు జిల్లాల్లో సగం అధికారం వారి గుప్పిట్లోనే వుండేది. ఇక జంటనగరాల్లో చెప్పనవసరమే లేదు. ప్రతి ముఖ్యమైన పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ హౌస్ ఆఫీసర్ వలస వచ్చినతనే వుంటాడు. రంగారెడ్డి జిల్లాలోని రెవెన్యూ శాఖలో ముఖ్యమైన స్థానాలన్నీ వారితోనే నిండి వుంటాయి. వీరందరు కలిసి వలసవాదుల ప్రయోజనాల కోసమే పనిచేసే వారు.

### సిగ్గుమాలిన సీమాంధ్ర నాయకులు

తెలంగాణ పై వేలాది వ్యాసాలు వందలాది సంకలనాలు వచ్చాయి. టన్నుల కొద్దీ పుస్తకాలు వచ్చాయి. స్వచ్ఛందంగా వందలాది సీడీలు, క్యాసెట్లు వచ్చాయి. దాదాపు 2500 పాటలు వచ్చాయి. వందలాది మంది గాయకులు పనులన్నీ వదిలి పాటలు పాడి ప్రచారం చేశారు. కవులు, రచయితలు, కళాకారులు, స్వచ్ఛందంగా కదిలారు. అయినా ఆంధ్రులు, సీమ వారు మేం సత్తెపూసలం, మావల్ల మీకు అన్యాయం జరగడం లేదు, మనం కలిసే ఉందాం అంటున్నారు. ఇదెక్కడి సిగ్గుమాలినతనం... ఇదెక్కడి న్యాయం...

## వద్దు మొర్రో అంటున్నా కలిసుందామంటారెందుకు?

వద్దు మొర్రో అంటున్నా కలిసుందామనడంలో అసలు మర్మం ఆంధ్రులకే తెలియాలి. యావత్‌భారతదేశం వీరు కలిసుందామని ధర్నా దృశ్యాలను టివిల్లో చూసి నవ్వుకుంటోంది. విడిపోవాల్సివస్తే మేము గ్రేటర్ రాయలసీమగా విడివడతాం. అంతే కానీ ఆంధ్రులతో కలిసి ఉండం అని సీమవాదులు, కళింగాంధ్రగా మేమూ విడిపోతామని కళింగాంధ్రులు డిమాండ్ చేయడాన్ని ఎవరైనా ఎలా అర్థం చేసుకోవాలి. అంటే ఆంధ్రులు గడసరులా... స్నేహశీలురా.. ఏమని అర్థం చేసుకోవాలి. "తెలంగాణ వద్దు సమైక్యతే ముద్దు" అంటే ఎవరికి ముద్దని అర్థం చేసుకోవాలి.

ఆనాడు ప్రధాని నెహ్రూ చెప్పిన మాటలను ఒకసారి గుర్తుకు తెచ్చుకుందాం " ఆంధ్ర తెలంగాణలను కలుపడం సామ్రాజ్యవాద భావన తప్ప ఇంకేమీ కాదు. అమాయకురాలైన తెలంగాణ అమ్మాయిని, గడసరి ఆంధ్ర అబ్బాయికిచ్చి పెళ్లి చేస్తున్నాము. వారికి పొసగక పోతే ఎప్పుడైనా విడిపోవచ్చని" తెలిపాడు. తెలంగాణా వారు విడాకుల కోసం దాదాపు ఐదున్నర దశాబ్దాలుగా ఎదురు చూశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రకాంక్ష వయసు, ఆంధ్రప్రదేశ్ వయసు కన్నా ఎక్కువే.. ఇన్నాళ్లకు శుభమా అని విడిపోతామంటే... కుదరదు బలవంతపు కాపురం చేయాల్సిందేనంటున్నారు. ఇదెక్కడి న్యాయం. కలిసి ఉందామని ఎంత యాగీ చేస్తున్నారు. మంత్రులు ఎంపీలు, ఎమ్మెల్యేలు, జడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, మున్సిపల్‌చైర్మన్‌లు, కౌన్సిలర్‌లు, కార్పోరేటర్‌లు రాజీనామాలు సమర్పించారు. అంటే వారి ప్రయోజనాలకు ఎంత విఘాతం కలిగితే, ఎన్ని లాభాలు దెబ్బతింటే ఇంత అతిగా ప్రతిస్పందిస్తారో తెలుసుకోవచ్చు. వీరిని చూశాకైనా తెలంగాణా నాయకులు కళ్లుతెరవాలి. బుద్ధితెచ్చుకోవాలి. "కలిసిఉంటే కలదు సుఖం" అంటున్నారు. ఎవరికి సుఖం అని ప్రశ్నించుకోవలసి వస్తుంది. సుఖం లేదనే కదా విడిపోదామనుకునేది. మళ్లీ సుఖం అంటారేమిటి? ఎవరికి సుఖం?

కలిసి వుందాము అంటున్న వారందరు, వుంటున్న వారందరూ రాజకీయాల్లో, వ్యాపారాల్లో లేదా ఇతర రంగాల్లో వుండి అక్రమంగా కోటానుకోట్ల రూపాయలు సంపాదించుకున్న వారే. సీమ ఆంధ్రల్లో పిల్లా పాపలతో వుంటున్న వారు లేదా తెలంగాణకు వచ్చి చిన్నా చితక ఉద్యోగాలు చేసుకుంటున్న వారెవరు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించడం లేదు. వీరిని రెచ్చగొట్టి అడ్డుపెట్టుకొని పెద్దలే ఉత్తుత్తి ఉద్యమాలు లేదా స్పాన్సర్డ్ ఉద్యమాలు, ఔట్ సోర్సింగ్ ఉద్యమాలు నడుపుతున్నారు.



## సెటిలర్స్ సోదరులే

గత 60-70 ఏళ్లలో తెలంగాణలోని ఎన్ని లక్షల ఎకరాలు భూమిని సెటిలర్లు సొంతం చేసుకున్నారో లెక్కేలేదు. ఈ పదిజిల్లాల్లో ఎన్ని గుంటూరు పల్లెలున్నాయో ఎవరైనా లెక్కించారా... గుంటూరు, కృష్ణా, ఉభయ గోదావరులు, ప్రకాశం జిల్లాలనుంచి ఏఏ దశాబ్దాలలో ఎందరెందరు వలసలు వచ్చారో అంచనా ఉందా... తెలంగాణ పది జిల్లాల్లో దాదాపు రెండువేల సెటిలర్ క్యాంపులు, పల్లెలు, ఫారాలు ఉన్నాయి. గుంటూరుపల్లె పేరుతోనే దాదాపు 60 ఆవాసాలున్నాయి. ఎన్టీరామారావు ముఖ్యమంత్రి కాకమునుపు వారిలో ఏ ఒక్క సెటిలర్‌నైనా తెలంగాణ వారు ఎప్పుడైనా ఇబ్బంది పెట్టారా? వేరుగా చూశారా...వారిని సోదరులుగా అక్కున చేర్చుకున్నారు. వారి అమ్మాయిలను ఇంటి కోడళ్లుగా స్వీకరించారు. సొంత గడ్డను వదిలి దేశంకాని దేశం వచ్చి పొలాల మధ్య పాములు తేళ్లతో సహవాసం చేస్తూ పంటలు పండించే ఆంధ్ర రైతులను చూసి ఆత్మబంధువులనుకున్నారు. బంధుత్వాలుకలుపుకున్నారు. సెటిలర్లయినా త్రిపురనేని మహారథి, హరిపురుషోత్తమరావు, వడ్డెర చండీదాస్ లాంటి విజ్ఞులు ఈ విషయాన్ని ఎప్పుడైనా కాదని చెప్పారా ?చెప్పగలరా?

యన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక సెటిలర్ల అతి పోకడ వల్ల అక్కడక్కడా కొన్ని గొడవలు జరిగిన ఉదంతాలున్నాయి. పొరపొచ్చాలు వచ్చిన సందర్భాలున్నాయి. అంతకు ముందు ఎంత కలుపుగోలుగా ఉండే వారో మంత్రిగా పనిచేసిన మండవ వెంకటేశ్వరరావును, పత్రికాధిపతి రాధాకృష్ణను అడగండి చెబుతారు.

**"ఎనఫ్ ఈజ్ ఎనఫ్".....** ఇక కలిసి ఉండవద్దు అని తెలంగాణా వారంటున్నారు. హాయిగా అన్నదమ్ముల్లా విడిపోతే నష్టం ఏముంది., తెలుగు వారికి రెండు లేదా మూడు రాష్ట్రాలుంటే అసౌకర్యమేముంది. కోట్లాది రూపాయల అక్రమసంపాదనను రక్షించుకోడానికి సామాన్యులను అడ్డుపెట్టి సమిధలు చేయడానికి వ్యూహం పన్నుతున్న స్వార్థ దుర్మార్గ రాజకీయ వాదుల వ్యూహంలో చిక్కుకోవద్దు. చిన్న రాష్ట్రాలు సామాన్యులకు మేలు కలిగిస్తాయి.

వారి కుదుళ్లను అక్కడే ఉంచుకొని కేవలం సంపాదించుకోవడానికి ఇక్కడకు వచ్చి అక్రమాలు పాల్పడుతూ భూములు దందాలు చేస్తున్న వారెవరినీ తెలంగాణ వారు ఉపేక్షించడానికి సిద్ధంగా లేరు. పొట్టకూటి కోసం వచ్చిన వారినెవరినీ ముట్టుకోడానికి వీరు ఇష్టపడటలేదు. ఈ విషయాన్ని సెటిలర్స్ జాగ్రత్తగా గమనించాలి. చిన్నా చితకా ఉద్యోగాలు చేసుకునే వారు ఎవరు కంగారు పడాల్సిన పనే లేదు.

## దోపిడీ రీతులు

ఆంధ్రప్రదేశ్ ఏర్పడే నాటికి.. హైదరాబాద్ స్టేట్ బడ్జెట్ వందకోట్ల మిగులుతో ఉంది. ఆంధ్రరాష్ట్ర బడ్జెట్ భారీ లోటుతో ఉంది. విలీనమప్పుడు హైదరాబాద్ నిధులను తెలంగాణ ప్రాంత అభివృద్ధికే ఖర్చు చేస్తామని ప్రమాణపూర్వకంగా రాసిమరీ చెప్పారు. కానీ ఆ రాత తడికూడా ఆరకముందే ఆ నిధులు పులుసులో కలిసిపోయాయి. వీటి విషయమై అసెంబ్లీలో మా నూరుకోట్ల నిధులు ఏమయ్యాని కెవి రంగారెడ్డి అడిగితే అప్పటి మంత్రి ఆర్థిక మంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి ఏ కోట్లు పాత కోట్లా అని గేలిచేసి అవమానించాడు. ఈ గేలిని దోపిడిని ఐదున్నర దశాబ్దాల పైగా తెలంగాణా వారు సహిస్తున్నారు. ఇప్పుడు విడిపోతామంటే అబ్బే కుదరదు కలిసి ఉండాలిసిందే నని ఆంధ్రులు అనడంలో ఏమైనా అర్థం ఉందా. కలిసి ఉండాలి అంటున్నారంటే అందులో వారికీ ప్రయోజనం ఉందనే విషయం అర్థం అవుతూనే ఉంది.

పెద్ద మనుషుల ఒప్పందం. ఆరు సూత్రాల పథకం, ముల్కి రూల్స్, రాష్ట్రపతి ఉత్తర్వులు, 610జీవో, ఫ్రీజోన్, ఏపిపియస్సీ ఉద్యోగాల వడ్డింపు, హౌజింగ్ బోర్డు ఇళ్ల కేటాయింపులు, రెంట్ కంట్రోల్ యాక్ట్, రంగారెడ్డి జిల్లా ఏర్పాటు, హుడా, హైమాల ఏర్పాటు, ఉద్యోగ నిబంధనలు భూవివాదాలలో హై కోర్టు ఇచ్చిన తీర్పులు ఇలా ఎన్ని అన్యాయాలు, ఎన్ని దోపిడీలు? నిలువెల్ల గాయాలైన తెలంగాణ విడివడతానంటే కుదరదంటారేం. మీకు కొంచెమైన కరుణ, దయ, ఇంగిత జ్ఞానం లేవా? తెలంగాణ వారిని నిమ్మళంగా ఉండనీయరా? అని తెలంగాణా వారు అడుగుతున్నారు.

## ఉద్యోగాలను దొంగలించిన తీరు

రాష్ట్రంలో 15 లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులున్నారు. రక రకాల పరిస్థితుల్లో జరిగిన అనేక ఒప్పందాల ప్రకారం మొత్తం ఉద్యోగుల్లో తెలంగాణ వారు 40 శాతం ఉండాలి. అంటే 6 లక్షల మంది తెలంగాణ వారుండాలి. కానీ రాష్ట్రంలో రెండు లక్షల మంది కూడా తెలంగాణ వారు లేరు. వీరిలో అత్యధికులు క్రింది స్థాయి ఉద్యోగాలలోనే ఉన్నారు. ఎన్.టి. రామారావు తొలిసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత జరిగిన ఎపిపిఎస్‌సి ఇంటర్వ్యూల్లో తప్ప మరెప్పుడు అవి నిజాయితీగా జరగనే లేదు.

వైఎస్ ముఖ్యమంత్రి అయిన తర్వాత కడప జిల్లా రెడ్డి గారయిన వెంకట్రామరెడ్డిని ఎపిపిఎస్‌సి చైర్మన్‌గా నియమించుకున్నారు. వీరి హయాంలో గ్రూప్ వన్ నియామకాల కోసం పోటీ



పరీక్షలు ఇంటర్వ్యూలు జరిగాయి. చైర్మన్ సంబంధీకులు కొందరు బాహాటంగా ఇలా మాట్లాడుకున్నారు. "మన జిల్లా పిల్లలుంటే చూడండి, లేని పక్షంలో మన కులం వారుంటే చూడండి మంచి పోస్టుల్లో వేసేద్దాం. వారు ఒకసారి చేరితే 30-35 సంవత్సరాలు మన ప్రాంతానికి మన కులానికి ఉపయోగపడతారు" ప్రతి ఎపిపిఎస్‌సి పరీక్షలోనూ ప్రతిసారీ వారు ఇలాగే చేశారు. నేరుగా రిక్రూట్ అయ్యే పోస్టుల్లో కూడా ఇలాగే జరిగింది. అందుకే ఏ శాఖలో చూసినా తెలంగాణ ఉద్యోగులు అతి తక్కువగా కనిపిస్తారు. ఇది నిజంగా అంతులేని అన్యాయం. ఇలా అన్ని రంగాల్లో అవకాశాలను వారికే వడ్డించుకున్నారు.

1948-52 మధ్య హైదరాబాద్ స్టేట్ సివిల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారుల పాలనలో ఉంది. ఈ మధ్య కాలంలో అనేక మంది ఆంధ్రులు. వచ్చి చేరారు. వీరు వీలయినన్ని వంకర పనులు చేశారు.

నైజాం ప్రభుత్వంలో అధికార భాష ఉర్దూ. అంతకు ముందుకు ఇక్కడ పర్షియన్ రాజభాష. 1948లో నైజాం దేశంను ఇండియా తనలో కలుపుకున్న తర్వాత ఉర్దూ స్థానంలో ఇంగ్లీష్ వచ్చి చేరింది. దీంతో ఇంగ్లీష్ తెలిసిన క్లర్కులు, అధికారుల అవసరం ఏర్పడింది. కొద్దిగా ఇంగ్లీష్ వచ్చిన వారు ఆంధ్ర ప్రాంతంలోనే ఉన్నారు. దీనికి తోడు నైజాం వ్యవహారాలను చూడడానికి మద్రాస్ అధికారులనే డిప్యూట్ చేశారు.

1948లో రజాకార్ల అరాచకాలను తట్టుకోలేని కొందరు ప్రజలు, తలదాచుకోవడానికి పొరుగు ప్రాంతాలకు వలస వెళ్ళారు. అలాగే కమ్యూనిస్టుల భయానికి కొందరు, పోలీసుల భయానికి మరి కొందరు విజయవాడ, కర్నూలు పట్టణాల్లో తల దాచుకున్నారు. నాగపూర్‌లోని మరాఠీలు వారిని ఆదరిస్తే, తోటి తెలుగు వారైన విజయవాడ, కర్నూలు ప్రజల నుంచి మాత్రం తెలంగాణ వారికి చేదు అనుభవాలు ఎదురయ్యాయి. కిరాణ షాపులో సరుకులకు ఎక్కువ ధరలు తీసుకోవడంతో పాటు ఇంటి అద్దెలు, హొటల్ రేట్లు, నిత్యావసరాల ధరలను, అధికంగా వసూలు చేసేవారు. దీనికి తోడు తెలంగాణ వారి భాషను మాండలికాన్ని హేళన చేయడం కూడా చేసే వారు.

మద్రాస్ అధికారులు కొద్దిగా ఇంగ్లీష్ వచ్చిన వారిని నేరుగా పిలిపించుకొని నిబంధనలను సడలించి ఉద్యోగాలిచ్చి ఉద్యమంగా తమ వారిని హైదరాబాద్ బాట పట్టించారు. 1956లో విశాలాంధ్రతో వీరికి తలుపులన్నీ బార్లా తెరుచుకున్నాయి. ఉద్యోగుల వెంట వ్యాపారులు, న్యాయవాదులు వచ్చి పడ్డారు. కమ్యూనిస్టు పార్టీ చిటికెన వ్రేలు పట్టుకొని రైతులు తండోప తండాలుగా వచ్చి పడ్డారు. వీరంతా తెలంగాణ ప్రజల అమాయకత్వాన్ని, చట్టాల్లో

లొసుగులను అడ్డు పెట్టుకొని విపరీతంగా సంపాదించుకున్నారు. భూములు, జాగాలు ఆక్రమించుకున్నారు. వీరే అటు ఆంధ్ర అభివృద్ధికి నిరోధకులయ్యారు. ఇటు తెలంగాణను దోచుకున్నారు. ఇప్పుడు వారే తెలంగాణకు అడ్డు పడుతున్నారు.

వీళ్ళ పిల్లలు ఇక్కడి డబ్బులతో చదువుకొని అమెరికా వెళ్ళింది డాలర్లు సంపాదించుకొని అక్కడే సెటిల్ అయి సుఖపడడానికే. వారు ఇక్కడికి డాలర్లను పెద్దగా పంపనేలేదు. వీరు పంపిన డాలర్ల కన్నా హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల నుండి మస్కట్ దుబాయ్‌లకు వెళ్ళిన సాధారణ ఉద్యోగులు పంపిన డబ్బులే ఎక్కువ. మరి హైదరాబాద్‌కు ఏం తెచ్చినట్లు, ఎక్కడి నుండి తెచ్చినట్లు.., వారికి పెట్టుబడులు ఎక్కడి నుండి వచ్చాయో...? వారే వివరించాలి. రాత్రి పడుకున్నాక గుండెమీద చెయ్యి వేసుకుని యోచిస్తే వారికే తెలుస్తుంది. హైదరాబాద్ వారికి ఏమైనా చేసిందా వారు హైదరాబాద్‌కు ఏమైనా చేశారా అని...!

## టాటా బిర్లాలకన్నా వేగంగా సంపాదించే నిపుణులు

గాలి జనార్ధనరెడ్డి ఒక సాధారణ పోలీసు కానిస్టేబుల్ కొడుకు. రాష్ట్రప్రభుత్వం అండదండలతో కోట్లకు పడగలెత్తి రెండు రాష్ట్రాల రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగాడు. 2003-04లో ఇంటర్నేషనల్ టెలీఫోన్ కాల్స్‌ను డైవర్ట్ చేసే నేరానికి పాల్పడి పట్టుబడ్డ ఒక బడానేత కొడుకు ఒకరు కొన్ని సంవత్సరాలలోనే ఎదిగి ఒక చానల్‌ను, దినపత్రికను పెట్టి, రాజకీయాల్లో చేరి కేంద్రాన్ని సైతం ధిక్కరించే స్థాయికి ఎదిగారు. ఇలాంటి అవినీతి తిమింగిలాలు తయారు కావడానికి పెద్దరాష్ట్రాలే కారణమని కేంద్ర నాయకులు బలంగా నమ్ముతున్నారు కాబోలు. అందుకే పెద్ద రాష్ట్రాలను విభజించి పాలించాలనే వ్యూహరచన కూడా ఒక కారణం కావచ్చు. దీనికి తోడు రాష్ట్రాల్లో నాయకులే వ్యాపారులై ప్రభుత్వ ఖజానాకు చేరవలసిన డబ్బులను కాజేస్తున్నారు. లక్షకోట్ల జలయజ్ఞం, రోజుకు 3-4 కోట్ల రూపాయల ఓబుళాపురం ఆదాయం ఎటుపోయిందో ప్రజలందరికీ తెలుసు. ప్రపంచంలో ఏ దేశంలో కూడా ఇంత వేగంగా డబ్బు సంపాదించడం సాధ్యం కానేకాదు.

కాంగ్రెస్ పార్టీకి చిన్న రాష్ట్రాలవల్ల ఎంత సౌలభ్యం ఉన్నదో అదే సౌకర్యం మరో జాతీయ పార్టీకి కూడా ఉంటుంది. అందుకే భారతీయ జనతా పార్టీ ఇలాంటి చర్యలకు వ్యతిరేకం కాదు. మాయావతి స్వయంగా తను పాలిస్తున్న యుపిని మూడు ముక్కలు చేయమని కోరుతున్నది.



పై సూత్రీకరణను దృష్టిలో పెట్టుకొని చూస్తే కేంద్రం ఒక్క తెలంగాణనే కాదు మరికొన్ని పెద్ద రాష్ట్రాలను విడగొట్టి చిన్నరాష్ట్రాలను సృష్టించే అవకాశం ఉందని చెప్పవచ్చు. రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవా అనే సామెతలాగా కేంద్రమే ఆయా రాష్ట్రాలలో ప్రత్యేక రాష్ట్రాల ఉద్యమాలను ప్రోత్సహించి చిన్న రాష్ట్రాలను ఏర్పాటుచేస్తుంది.

## బతుకులో చావులో ముస్లిం రాజులు ఈ గడ్డను స్వంతం చేసుకున్నారు కానీ ఆంధ్రులు భూమిని ఆక్రమించుకున్నారు.

కుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీలు హైదరాబాద్‌ను స్వంతం చేసుకున్నారు. వారి తాతముత్తాతల సమాధులు ఇక్కడే ఉన్నాయి. పోవడానికి వారికి వేరే మాతృభూమి లేదు. వారు ఈ భూమిని స్వంతం చేసుకున్నారు. ప్రేమించారు. "కానీ మీరు పోవడానికి మీ ఊర్లు ఒకరాత్రి దూరంలో ఉన్నాయి. ఈసిఐఎల్ బిహెచ్ఈఎల్, సంజీవరెడ్డినగర్, లక్డికాపూల్ నుండి రోజూ వేలాది బస్సులు ఎక్కడికి వెళ్తాయి అని తెలంగాణ వారు అడుగుతున్నారు? "సంక్రాంతి నాటి హైదరాబాద్ మాది అని తెలంగాణా వారు అంటున్నారు".

## చావులోనూ దురాక్రమణే ఆంధ్రుల ధోరణి

ఆంధ్రులకు శవాలను బొందపెట్టి సమాధి కట్టే సంస్కృతి లేదు కాబట్టి హైదరాబాద్ శ్మశానాల్లో కొంతైనా జాగా మిగిలింది, వారు శవాలను దహనం చేసే పద్ధతిలో లేకపోతే శ్మశానాలన్నీ వారి సమాధులతో నిండిపోయేవి.

రాయలసీమ వారిలో ఖననంచేసి సమాధులు కట్టే పద్ధతి ఉంది, కానీ వారు అంత్యక్రియలను స్వస్థలాల్లోనే జరుపుకోడానికి మొగ్గు చూపుతారు. పలువురు తెలంగాణ జిల్లాల వారు హైదరాబాద్‌లో చనిపోతే వారిని వారి స్వస్థలాలకు తీసుకు పోతారు. కానీ ఆంధ్రులు ఖర్చులు తప్పించుకోవడానికి, సౌలభ్యం కోసం హైదరాబాద్‌లోనే అంత్యక్రియలు నిర్వహిస్తారన్న విషయాన్ని గమనించాలి. పైగా ఏ వ్యక్తి పోయినా ఆయన సంబంధీకులు అత్యధికులు ఇక్కడే ఉంటారు. అందుకే ఇక్కడే అంత్యక్రియలు జరుగుతాయి. ఎన్.టి.ఆర్. అంత్యక్రియలు హైదరాబాద్‌లో జరిగాయి. ఊరి మధ్యలో హుస్సేన్ సాగర్ ఒడ్డున జరిగాయి. ఊరి మధ్యలో అంత్యక్రియలు చేసి, ఆ వంకతో హుస్సేన్‌సాగర్ ఒడ్డున ఆయన సమాధికి అంత స్థలాన్ని ఆక్రమించుకోవడంలో ఔచిత్యం ఏమిటో వారికే తెలియాలి. ఆయన సమాధి స్వస్థలం నిమ్మకూరులో కదా ఉండాల్సింది. అంత్యక్రియలు వూరి మధ్యలో చేయడం తెలుగు

వారి సంస్కృతి కానేకాదు. సాధారణంగా శైవులు చనిపోయిన వ్యక్తిని బొందపెట్టి సమాధి కడుతారు. సమాధికై ఒక రాతి లింగాన్ని, నందిని పెడతారు. శైవం సమానత్వాన్ని ప్రబోధిస్తుంది. కులాన్ని దోపడిని నిరసిస్తుంది. శైవం భక్తుల నుండి పత్రి, పుష్పాలను మాత్రమే ఆశిస్తుంది. శివాలయాలు నిరాడంబరంగా ఉంటాయి. తెలంగాణలో, సీమలో అత్యధికులు.

వైష్ణవులు శవాన్ని కాలుస్తారు. చితిలో నేతిని గంధపు చెక్కలను వేస్తారు. వైష్ణవం భక్తుల నుండి పంచభక్ష పరమాన్నలను స్వర్ణ, రజిత, కట్న కానుకలను కోరుకుంటుంది. ఇవ్వు... ఇవ్వు - తే అంటుంది. విలాసాన్ని, ఆడంబరాన్ని, శృంగారాన్ని ప్రబోధిస్తుంది. స్వర్ణమయ ఆలయాలను నిర్మిస్తుంది. దోపిడీని నిరసించదు. రాజ్యాన్ని రాజును దైవసమానుడిగా చేసి చూపుతుంది. సామాన్య భక్తులను, ప్రజలను వైష్ణవం పట్టించుకోదు. ఆంధ్రుల్లో ముఖ్యంగా వలసవాదుల్లో వీరే ఎక్కువగా వుండడం గమనార్హం.

హైదరాబాద్‌లో దాదాపు 125 చెరువులుండేవి. నల్లకుంట, నాగమయ్య కుంట, బ్రతకమ్మ కుంట, మక్త, చింతల్, రాంమాంతపూర్ తదితర ప్రాంతాలలో 115 చెరువులను పూడ్చేశారు. హుస్సేన్ సాగర్(ట్యాంక్ బండ్) చెరువు గతంలో 11 చదరపు కిలోమీటర్లు వ్యాపించి ఉండేది. ఐమాక్స్, పీపుల్స్ ప్లాజా, యన్టీఆర్ ఘాట్, వాటర్ ఫ్రంట్ లాంటి సంస్థలు ఆక్రమించుకోగా ఇప్పుడు 5 చదరపు కిలోమీటర్లు మాత్రమే మిగిలింది. ప్రభుత్వమే భూ ఆక్రమణకు పాల్పడితే, ప్రభుత్వమే భూములను తెగనమ్మితే ఎలా? భూములు రాజ్యానికి చెందినవి. రాజ్యపు భూములను అమ్మడానికి ప్రభుత్వానికి ఎలాంటి హక్కు ఉండదు. ఇది చట్ట విరుద్ధం. దేశద్రోహ చర్య కూడా. రాజ్యానికి, ప్రభుత్వానికి ఉన్న తేడా కూడా తెలియని మూర్ఖులు కూడా ఎమ్మెల్యేలు, యంపీలు అవుతున్న కాలమిది. మరి కోర్టులు, రాజ్యాంగ నిపుణులు ఈ విషయంలో ఎందుకు కిమ్మనడం లేదో తెలియదు. తోటమాలే పూలను కొమ్మలను అమ్ముకోవడంలాంటిది ఇది. ఇది దుర్మార్గపు చర్య. ఈ పనిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గత 50 ఏళ్లుగా యథేచ్ఛగా చేస్తున్నది. ముఖ్యంగా హైదరాబాద్ భూములను చిత్తం వచ్చినట్టు అమ్మేసింది.

హైదరాబాద్‌లో 110 పైగా గ్రామాలుండేవి. ఒక్కో గ్రామానికి ఒక శ్మశాన వాటిక వుండేది. అలాగే రూలింగ్ క్లాస్ అయిన ముస్లిమ్ కుటుంబాలకు ఒక్కొక్క శ్మశాన వాటిక వుండేది. మొత్తం మీద జంటనగరాల్లో దాదాపు వెయ్యి శ్మశాన వాటికలుంటాయి. భూత, ప్రేత, పిశాచాలకన్నా గడసరులైన ఆక్రమణదారులు ఈ శ్మశానాలు కూడా కొన్నిచోట్ల ఆక్రమించుకోవడం విశేషం.



## తెలంగాణ భూముల పందేరం

హౌసింగ్‌బోర్డు ఏర్పాటువల్ల ఎవ్వరికి ఇండ్లు సమకూరాయి? వక్ఫ్‌బోర్డుకు చెందిన వివాదాస్పద భూమిలో ల్యాంకో హిల్స్ ఎలా వెలుస్తుంది? సత్యం రామలింగ రాజుకు పదివేల ఎకరాల భూమి ఎలా సొంతం అయింది? కూకట్‌పల్లి, వనస్థలిపురం కాలనీల్లో ఏ ప్రాతిపదికన ఇండ్లు కేటాయించారు? జిల్లాలవారీగా, ప్రాంతాలవారీగా రిజర్వేషను ఏమైనా ఇచ్చారా? జూబ్లీహిల్స్ కాలనీకి కేవలం పది రూపాయలకు గజం చొప్పున రెండున్నర వేల ఎకరాల భూమిని ఎవరు ఎవ్వరికి కట్టబెట్టారు? ఆ కాలనీ అభివృద్ధికి ప్రభుత్వం చేసిన ఖర్చు ఎంత? చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, దోమలగూడా మొదలకొని హైదరాబాద్‌లో ఏర్పడిన వందలాది కాలనీల్లో వేలాది ఇండ్లను, స్థలాలను వలసవాదులకు అప్పనంగా వడ్డించుకున్నారు. సినీ పరిశ్రమాభివృద్ధికని వేలాది ఎకరాల భూమిని కోస్తాంధ్రావారికే కట్టబెట్టారు.

బి.హెచ్.ఇ.ఎల్., ఇక్రిసాట్‌లకు దాదాపు పదివేల ఎకరాల భూమిని ఇచ్చారు. ఒక్క బి.హెచ్.ఇ.ఎల్. ఏర్పాటు సమయంలో ఆరు గ్రామాలు రూపుమాసిపోయాయి. ఆ గ్రామస్థులు పలువురు భిక్షగాళ్ళుగా, అనాథ శవాలుగా మారిపోయారు. వారి పిల్లలు బి.హెచ్.ఇ.ఎల్.లో అటెండర్లు కూడా కాలేక బి.హెచ్.ఇ.ఎల్. కాలనీలో ఆకుకూరలు అమ్ముకుంటున్నారు. ఇలాగే మిథాని, ఎన్.ఎఫ్.సి., ఇ.సి.ఐ.ఎల్., హెచ్.సి.ఎల్, ఐడిపియల్, హెచ్.ఎ.ఎల్, హెచ్ఎంటీ అటామిక్ ఎనర్జీ, డి.ఆర్.డి.ఎల్., డి.ఎమ్.ఆర్.ఎల్. లాంటి ఎన్నో సంస్థలకి రైతుల దగ్గర భూమిని అతి తక్కువ ధరకు లాక్కున్నారు. ఇటీవల శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఇచ్చిన ఐదువేల ఎకరాల భూమిలో మూడు గ్రామాలు మాయమయ్యాయి. ఈ భూములు కోల్పోయిన రైతులకు ఏమి ఇస్తే నష్టపరిహారం సరి అవుతుంది? ఆ భూములను మా స్వంతం అంటున్న వారిని ఏమనాలి?

## భూముల పరాధీనత

బహుశా యావత్ ప్రపంచంలో ఏ దేశం కూడా తెలంగాణ వలె భూములను పరాధీనం చేసుకొని ఉండదు. పాలస్తీనా వంటి ఆక్రమిత దేశాలలో కూడా స్థానికులు ఇంత అన్యాయంగా భూములను కోల్పోలేదు. ప్రత్యేక ప్రతిపత్తి ద్వారా కాశ్మీరులో భూములు రక్షింపబడ్డాయి. కానీ తెలంగాణలో భూములకు ఎలాంటి రక్షణలేకుండా పోయింది. పెద్ద మనుషుల ఒప్పందంలోని తెలంగాణ భూముల కొనుగోలు అంశాన్ని ఇసుమంతైనా పట్టించుకోకుండా తుంగలో తొక్కేశారు. ఈ భూముల పరాధీనతకు ఇప్పుడు వ్యక్తమవుతున్న తెలంగాణ

వ్యతిరేకతకు సంబంధం ఉంది. తెలంగాణ కావాలి అంటున్న వారిలో భూములు కోల్పోయిన వారు అధికులుగా ఉంటారు. తెలంగాణలో ఆస్తులు సంపాదించుకొన్నవారే... పెద్ద ఉద్యోగాల్లో ఉన్న ఆంధ్రులే తెలంగాణను గట్టిగా వ్యతిరేకిస్తున్నారు.

## భూముల ఆక్రమణ క్రమం

నిజాం స్వంత భూములయిన సర్ఫెఖాస్ భూములను దొరలు, వలస వాదులు అడ్డగోలుగా ఆక్రమించుకున్నారు. రాచబంధువులయిన పైగా భూములు అలాగే ఆక్రమించారు. నిజాములూ వారి బంధువులో ఆక్రమించక మునుపు ఆ భూములన్నీ ఇక్కడి సామాన్యులవి, ఊరుమ్మడి భూములూ, వీటిలో బంచరాయి భూములు ఉండేవి. వీటిన్నింటిని అటు తెలంగాణ దొరలు, ఇటు వలస వాదులు ఇష్టం వచ్చినట్లు ఆక్రమించుకున్నారు.

ఒక వ్యక్తి జీవిత కాలంలో గరిష్టంగా కష్టపడితే ఎంత భూమికి యజమాని కాగలడు ఎలా కాగలడు అనే విషయాన్ని ధర్మాన్ని, చట్టాలను దృష్టిలో ఉంచుకొని యోచిస్తే, భూస్వాములు చేసిన అన్యాయం ఏమిటో అర్థం అవుతుంది. వేల ఎకరాలు వ్యక్తులకు ఎక్కడి నుండి వస్తాయి?

వ్యక్తులకు ఉన్నట్టే భూమికి బయోడేటాను, భూమి కాల వృక్షాన్ని తయారు చేసి ఏయే కాలాల్లో ఏ భూమి ఎవరి సాగు బడిలో ఉందో చూస్తే విషయం సులభంగా అవగతమౌతుంది. చట్టం దృష్టి సంకుచితమైనది, మొరటైనది. దానికంటికి ఈ లోపాలు కనిపించవు.

### విలువైన భూముల పరాధీనం

ఒక్క కోకాపేట భూముల అమ్మకం ద్వారా ప్రభుత్వానికి 703 కోట్లు వచ్చాయి. హుడా ద్వారా అమ్మిన 98 ఎకరాలలోని 312 ప్లాట్ల ద్వారా 1500 కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. అందరికి తెలిసి అమ్మిన భూములు అవి. రహస్య జీవోల ద్వారా, మంత్రులు, ముఖ్యమంత్రి ప్రమేయంతో ప్రయివేటు పరం అయిన భూములు ఇంకా ఎన్నో ఉన్నాయి. ఆలియా కళాశాల, నెహ్రూ జూలాజికల్ పార్క్, పాత గాంధీ మెడికల్ కళాశాల, మహబూబ్ కళాశాల, వార్నర్ హిందూస్థాన్, పార్క్ డెవిస్, ఐడిపిఎల్, రిపబ్లిక్ ఫోర్జ్, ఆర్టీసి, తదితర ఎన్నో స్థలాలను అన్యాక్రాంతం చేసింది. చంద్రబాబు హయాంలో కోస్తాంధ్ర కమ్మ, రాజు సామాజిక వర్గం వారు వై.ఎస్. హయాంలో కడప ఫ్యాక్షనిస్టులు, వీరిద్దరి హయాంలో కొందరు తెలంగాణ దళారులు తోడై లక్షలాది ఎకరాల భూములను దక్కనర్చుకున్నారు.



## రెంటు కంట్రోల్ యాక్ట్

కర్నూలు గుడారాలలో ఆఫీసు, వసతులు ఏర్పాటు చేసుకొని అక్కడ ఉండలేక రెడీమేడ్ రాజధాని అని విశాలాంధ్ర నినాదమిచ్చి మాయోపాయాలతో హైద్రాబాద్ తరలి వచ్చారు. భారత సైన్యాల ఊచకోతకు భయపడి పారిపోయిన ముస్లిం నవాబులు, నైజాం సైనికాధికారులు, పోలీసులు, ఉన్నతాధికారుల భవనాలు, భూములను తరలివచ్చిన ఆంధ్ర, సీమ పాలక వర్గాలు ఎవరి తెలివి మేరకు వారు అప్పనంగా ఆక్రమించుకున్నారు. రెవిన్యూ అధికారులను, పట్వారీలను పట్టుకొని దొంగ సంతకాలు చేసి, దొంగ కాగితాలు సృష్టించి, లంచాలు ఇచ్చి తార్చి ఇలా అనేక కుయుక్తులతో హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాల్లో పదివేల ఆవాసాలను, రెండున్నర లక్షల ఎకరాల భూమిని ఆక్రమించుకొన్నారు. ఈ ఆక్రమణలో స్థానిక అగ్రకులాల వారు కొందరున్నారు. కొండొకచో కొందరు బీసీలు, ఎస్సీలు కూడా ఇందులో ఉన్నారు.

ఇది చాలదని వారికి పూర్తి అనుకూలంగా ఉండే రెంటు కంట్రోల్ యాక్టును రూపొందించి, లక్ష పైగా వ్యాజాలు నడిపి హైదరాబాదీల ఇళ్లను ఆక్రమించుకున్నారు. యాక్ట్ ప్రకారం పదిరూపాయల అద్దె ఇచ్చి ఐదు పైసల కిరాయి నామా రాసుకొని ఒక ఇంట్లో ఒక వ్యక్తి అద్దెకు దిగితే చాలు. నామమాత్రపు ఖర్చుతో ఆ ఇల్లు అద్దెకు దిగిన వాడిదైపోతుంది. ఆ ఇంటిని ఖాళీ చేయించే హక్కు యజమానికి ఉండదు. అద్దె పెంచమని యజమాని అడగలేడు. వాకిలి ఊడవమని చెప్పలేడు. గేటుకు అర్ధరాత్రి అయినా మెయిన్‌గేటుకు తాళం వేసుకోలేడు. అద్దెకన్నా కరెంటు బిల్లు ఎక్కువ వచ్చినా అదేమని అడుగకూడదు. ఖాళీ చేయమనకూడదు. అడిగితే వివాదాన్ని సృష్టించి కోర్టులో కేసువేసి అద్దెను బ్యాంకులోనో పోస్టాఫీసు ఖాతాలోనే ఇంటియజమాని పేర కడితే సరిపోతుంది. ఇలా హైదరాబాదీలనే కాదు అన్ని తెలంగాణ పట్టణాలలో స్థానికేతరులు వలసవాదులు ఈ చట్టాన్ని అడ్డుపెట్టుకొని లబ్ధిపొందారు. ఇంటియజమాని తండ్రికి పుట్టిన పాలోని కంటే ఎక్కువగా వీరు ఆస్థులను అనుభవించారు. ఇంత దుర్మార్గమైన రెంటుకంట్రోలు చట్టాన్ని కాంగ్రెసులోని వలస వాదులు ప్రతిపాదించగా కమ్యునిస్టు పార్టీ బలపరిచింది.

ఈ చట్టం వల్ల దాదాపు 82 వేల మంది ఇంటి యజమానులు అద్దెకున్న వారితో కేసులను ఎదుర్కొన్నారు. కేసులు వేసినవారిలో గుజరాతీ, మార్వాడీలతో పాటు సీమాంధ్రులు పెద్ద సంఖ్యలో వున్నారు. ఆ నాలుగు జిల్లాల వారే అత్యధికులుగా వున్నట్లు హైకోర్టులో, సిటీ సివిల్ కోర్టులో దాఖలైన కేసుల సంఖ్య ద్వారా తెలుస్తున్నది.

## విలీనమా-ఆక్రమణయా?

యావత్ భారత దేశం ఆగష్టు 15న స్వతంత్ర్యం పొందిన సందర్భంలో ఇటు నైజాం రాజ్యం స్వతంత్రంగానే ఉంది. లేదా నైజాం ఏలుబడిలో ఉంది. 1948 ఆగస్టు 13న భారత యూనియన్ సైన్యాలు నైజాం దేశంపై పోలీసు యాక్షన్ పేరుతో మిలట్రిదాడిని ప్రారంభించాయి. నైజాం సేనలు ఐదు రోజులు ప్రతిఘటించి సెప్టెంబర్ 17న లొంగిపోయాయి. ఇదే సందర్భంలో నైజాం సెప్టెంబర్ 16న తన దేశంపై భారత దేశం దాడి చేసిందని ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు నేటికి ఐక్యరాజ్య సమితిలో పెండింగ్‌లో ఉంది. రష్యా, చైనాలు మినహా భద్రత మండలిలోని సభ్య దేశాలన్నీ ఆనాడు భారత దాడిని ఖండిచాయి. నైజాం దీన్ని ఆక్రమణ అన్నారు. భారత దేశం దీన్ని విలీనం అన్నది.

1951 అక్టోబర్‌లో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చేసిన కమ్యూనిస్టు పార్టీ బేషరతుగా ఉద్యమాన్ని విరమించుకుంది. ఆయుధాలను ప్రభుత్వానికి అప్పగించింది. అప్పటి వరకు ఉద్యమ కారులు, రైతులు స్వాధీనం చేసుకున్న లేదా పంచిన భూములను రైతులకు దాఖలు చేయాలన్న కనీస డిమాండ్ కూడా పెట్టకుండా పోరాటాన్ని ఏక పక్షంగా విరమించుకున్నారు. మరి ఆ పోరాటం సాధించినది ఏమిటో, గొప్ప ఏమిటో వారికే తెలియాలి.

### అల్పసంతోషులు తెలంగాణ వారు

సంపన్న కుటుంబంలో గతి తప్పిన పిల్లవాడు ఇంట్లోని విలువైన వెండి, రాగి, ఇత్తడి విగ్రహాలు గిన్నెలు, చెంబులు దొంగచాటుగా ఎత్తుకు పోయి చిల్లర డబ్బులకోసం అమ్ముకుంటున్న రీతిలో తెలంగాణ పాలక వర్గాలు తెలంగాణా ప్రయోజనాలను చిల్లర డబ్బుల కొరకు తాకట్టు పెట్టారు. తెలంగాణ అని నినదించిన ప్రతి ఉద్యమవాదీ నాయకుడు కాగానే గతి తప్పిన పిల్లవాడి లాగా ప్రవర్తించాడు.

మొదట బూర్గుల ఆ తరువాత చెన్నారెడ్డి, ఆయన అడుగు జాడల్లో చిన్నారెడ్డి లాంటి ఎందరో నాయకులను దీనికి ఉదాహరణగా చూపవచ్చు. కేంద్ర, రాష్ట్ర మంత్రి వర్గాలలో చేరిన టీఆరెస్ నాయకత్వం ఇలానే ప్రవర్తించింది. అందరూ కలిసి తెలంగాణా తల్లిని వంచించారు. “అన్నీ బాగుంటే అమ్మనవుదునురా” అని కంటతడి పెట్టిన వెలయాలి సామెత వలె మారింది తెలంగాణ పరిస్థితి.



## తమిళుల నుండి ఆంధ్రులెందుకు విడిపోయారో, ఆంధ్రుల నుండి తెలంగాణ వారు అందుకే విడిపోతున్నారు.

రాజమండ్రి కోర్టులో తమిళ జడ్జిని నియమించి నందుకే అనాడు ఆంధ్రులు మద్రాస్ నుండి విడి వడతాం అని ఉద్యమించారు. మద్రాస్ స్టేట్‌లో తమిళులు అన్ని రంగాల్లో ఆధిక్యత ప్రదర్శిస్తున్నారని ఆంధ్రులు ప్రత్యేక రాష్ట్రానికి ఉద్యమించారు. అదే అసంతృప్తితో తెలంగాణా వారు ప్రత్యేక రాష్ట్రం కావాలంటేవారి డిమాండ్ సావధానంగా సానుభూతితో ఎందుకు చూడడం లేదు? ఆనాడు ఆ తమిళులు చేసిన దానికన్నా అనేక రెట్లు అన్యాయం చేస్తున్నారు ఆంధ్ర, సీమ ప్రాంతం వారు. ఈ అన్యాయాన్ని భరించలేక తెలంగాణా వారు విడివడతాం అంటున్నారు. కాని ఆంధ్రులు ఇంకా కలిసి ఉందామని అంటున్నారు.

నైజాం రాజ్యాన్ని ఆక్రమించుకోవడంలో యూనియన్ సైన్యాలు పరమ పాశవికంగా ప్రవర్తించాయి. అలాగే వనరుల స్వాధీనంలో, సరిహద్దుల ఏర్పాటులో తెలంగాణకు ఎంతో అన్యాయం చేశారు. నైజాం స్వాధీనం చేసిన అతి విలువైన ఆభరణాలు, నగలు, అమూల్యమైన వజ్ర వైఢూర్యాలకైతే అంతే లేదు. అవన్నీ భారత దేశపు రాజ్య సంపదలో భాగమై పోయాయి.

## పొట్టి శ్రీరాములుకు ఆంధ్రప్రదేశ్‌కు సంబంధమే లేదు

మద్రాసు రాజధానిగా ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం 1952 అక్టోబర్ 19న పొట్టి శ్రీరాములు దీక్ష ప్రారంభించారు. 58 రోజుల దీక్ష తరువాత డిసెంబర్ 15న పొట్టి శ్రీరాములు ప్రాణాలొదిలారు. నిజానికి ఆయన ప్రాణత్యాగం చేద్దామని అనుకోలేదట. ఒక దశలో దీక్ష విరమిద్దామని అనుకున్నారట. ఆయన చుట్టూ చేరిన రాజకీయ వాదులు వత్తిడి చేసి బలవంతంగా దీక్ష కొనసాగించేలా చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసే శ్రీరాములు దీక్షను మొదట ఆనాటి మద్రాసు ఆంధ్రులు అంత సీరియస్‌గా తీసుకోనేలేదు. ఆయన మరణించిన తరువాతనే ఉద్యమం కొంత ఊపందుకుంది. విజయవాడ కేంద్రంగా అల్లర్లు జరిగాయి. అల్లర్ల అనంతరం జస్టిస్ వాంచా కమీషన్ సిఫారసుల మేరకు 1953 అక్టోబర్ 1న కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. కమ్యూనిస్టుల కుట్రపూరిత విశాలాంధ్ర నినాదంతో 1956 నవంబర్ 1న నైజాం దేశంలోని తెలుగు మాట్లాడే ప్రాంతాలను కలుపుకొని ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. 1956లో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌కు ఆయనకు సంబంధమే లేదు. అన్నీ తెలిసే కాంగ్రెస్ వారు పొట్టి శ్రీరాములుకు ఆంధ్రప్రదేశ్‌కు సంబంధం కుదిర్చారు. ఈ కుట్రలో ఆనాటి రాజకీయ పార్టీలతో పాటు కమ్యూనిస్టులు భాగస్వామ్యం వహించారు. అగ్రకులాల వారు తెలిసే ఈ కుట్రను బలపరిచారు.

ఇప్పుడు సావధానంగా ఆలోచించండి. 1952లో చనిపోయిన పొట్టి శ్రీరాములుకు 1956లో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌కు సంబంధం ఏమైనా ఉందా...? తెలంగాణకు ఆయనకు బాదరాయణ సంబంధమైనా ఉందంటారా..

## తెలంగాణ చిన్న రాష్ట్రం కాదు - 18 రాష్ట్రాలకన్నా పెద్దది

తెలంగాణ విస్తీర్ణం దాదాపు 11,500 చదరపు కిలోమీటర్లు. జనాభా మూడు కోట్ల పైనే ఉంటుంది. ఇంతకన్నా చిన్న రాష్ట్రాలు దేశంలో దాదాపు 18 ఉన్నాయి. తెలంగాణ ఏర్పడితే ఈ పద్దెనిమిది రాష్ట్రాల కన్నా పెద్దదే అవుతుంది. వాటికి లేని ఇబ్బంది తెలంగాణకు ఎందుకు ఉంటుంది.

ఒక భాష మాట్లాడే వారికందరికి ఒకే రాష్ట్రం ఉండాలి అనుకుంటే హిందీ మాట్లాడే వారికి ఆరు ఏడు రాష్ట్రాలెందుకు? హిందీ తర్వాత అత్యధిక జనాలు మాట్లాడే తెలుగు వారికి రెండు మూడు రాష్ట్రాలుంటే నష్టం ఏమిటి? మరి ఉర్దూ మాట్లాడేవారికి కూడా ప్రత్యేక రాష్ట్రాన్ని ఇవ్వాలి కదా.

ఒక్కో భాష వారికి ఒక రాష్ట్రం ఇవ్వాలి అంటే దేశంలో వందలాది భాషలున్నాయి. భాషా ప్రయుక్త రాష్ట్రాలు అనే మాట వలసవాదులు వారి వీలు కోసం సృష్టించినది మాత్రమే. ఇందులో మేలు ఏదయినా ఉంటే గింటే అది కాలం చెల్లిపోయింది. ఇది 2009 నాటికి పనికి వచ్చే భావన కానేరాదు.

మధ్య ప్రాచ్యంలో మన రాష్ట్రంలోని ఒక మండలం అంత విస్తీర్ణమున్న దేశాలే సర్వస్వతంత్రంగా వుండి అభివృద్ధిని సాధిస్తున్నాయి. మన జిల్లా కంటే చిన్న దేశాలు యూరప్‌లో అత్యద్భుత అభివృద్ధి పథాన పయనిస్తున్నాయి. అనంతపురం జిల్లా కంటే చిన్న రాష్ట్రాలు మన దేశంలోనే వున్నాయి. స్మాల్ ఈజ్ బ్యూటిఫుల్, చిన్న కుటుంబం చింతల్లేని కుటుంబం అని నమ్మే ఆంధ్ర నాయకులు ఇంత పెద్దరాష్ట్రాన్ని ఎందుకు కోరుకుంటున్నారు. ఇందులో కొంచెం తరచి చూస్తే వారి దుర్బుద్ధి సులభంగా అర్థమవుతుంది. సమైక్యాంధ్రను సీమాంధ్ర ప్రజలు కోరుకోవడం లేదు. ఆ ప్రాంత నాయకులే కోరుకుంటున్నారు. ఎందుకంటే వారి ఆస్తి పాస్తులు, విలాసాలు, వ్యాపార లావాదేవీలు అన్ని హైదరాబాద్‌తో ముడిపడి వున్నాయి కాబట్టి.



## తెలంగాణ ద్రోహులు

**"నిధులను మళ్లించిన నారా, కాసు, వై.ఎస్.**
**నీళ్ళను మళ్ళించిన కె.ఎల్. రావు**
**తీగలను మళ్లించిన తాతారావు**
**ఆలోచనలను మళ్లిస్తున్న రామోజిరావు"**

వీరందరు తెలంగాణ ద్రోహులేనని తెలంగాణ వాదుల గట్టి నమ్మకం. ఈ మాటలను నానుడిగా చెప్పుకుంటారు, పాటగా పాడుకుంటారు. ఆ తెలంగాణా వ్యతిరేకి రామోజిరావుతో కేసిఆర్ స్నేహం చేయడం ఒక వైచిత్రి. బయటి ప్రాంతాల వారు తెలంగాణ పట్ల నిర్దయగా ఉండి దోపిడి చేస్తున్నారు. లోపలి కారణాలు ఏమైతేనేం "నాటి చెన్నా రెడ్డి నుండి నేటి చిన్నా రెడ్డి వరకు" పలువురు తెలంగాణను ట్రంప్ కార్డుగా వాడుకున్న మాట వాస్తవం. చెన్నారెడ్డి, మల్లికార్జునగౌడ్, వెంకటస్వామితో పాటు ఎంపికైన పదకొండు మంది తెలంగాణ ప్రజాసమితి, ఎంపీలు, ఆమోస్, శ్రీధరరెడ్డి తదితరులు తెలంగాణను ఆనాడు నీరు గార్చారు. 2004లో కేసిఆర్ అటు కేంద్రం ఇటు రాష్ట్ర మంత్రివర్గాల్లో చేరి కాంగ్రెస్ పార్టీతో స్నేహ పూర్వకంగా అధికారాన్ని పంచుకొని ఉండకపోయినా పరిస్థితి మరో రకంగా ఉండేది. ప్రభుత్వంలో చేరి లాబియింగ్ ద్వారా తెలంగాణ సాధిస్తాం, అని ఆయన వివరణ ఇచ్చుకుంటూ వచ్చారు. తెలంగాణ అన్న పదాన్ని వినడానికే ఇష్టంలేని కఠోర సమైక్యవాది చంద్రబాబు నాయుడుతో 2009 ఎన్నికల్లో జతకట్టినా కేసిఆర్‌ను తెలంగాణ అంతగా ఆదరించలేదు. అందుకే చివరి యత్నంగా కేసిఆర్ ఆమరణ దీక్షను చేపట్టారు. వ్యూహాలు, ఒప్పందాలు ఏమున్నాయో ఎవరికి తెలియదు, కానీ తెలంగాణ సమస్య పరిష్కార తీరానికి చేరుతున్న సూచనలు కనిపిస్తున్నాయి.

అతి సరసమైన ధరకు అమ్ముడు పోయే కొందరు తెలంగాణ నాయకుల స్వార్థ బుద్ధి వల్ల కూడా తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతున్నది. సెకండ్ హ్యాండ్, థర్డ్ గ్రేడ్ నాయకులు ఉద్యమాల్లోకి చొరబడి అందిన కాడికి సొమ్ము చేసుకుంటూ ప్రతిసారీ ఉద్యమాన్ని నీరు కారుస్తున్నారు. వీరంతా తెలంగాణ ద్రోహులు. కులాల వారీగా కూడా సమీకరణలు చూసుకొని ఒక పెద్ద పాలక కులం అయిన రెడ్డి సామాజిక వర్గం రాజశేఖరరెడ్డి వున్నంత వరకు ప్రత్యేక రాష్ట్ర కాంక్షను వాయిదా వేశారు. అలాగే డి.శ్రీనివాస్, పొన్నాల లక్ష్మయ్య, దానం నాగేందర్, ముఖేష్ గౌడ్, సురేష్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మీరెడ్డి, జీవన్‌రెడ్డి ఇలా ఎందరో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు తెలంగాణ కాంక్షను వ్యక్తం చేయలేకపోయారు.

## నాటి నుండి అగ్రకులాలు క్రింది వారిని కలుపుకోలేదు

నైజాం రాజ్యం భారత్‌లో విలీన మైన సందర్భంలో కానీ, 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పుడు కాని నైజాం రాజ్యంలో రూలింగ్ క్లాస్‌గా మారిన బ్రాహ్మణ, రెడ్డి, వెలమలు, బీసి, ఎస్సీలను ఎంత మాత్రం కలుపుకు పోలేదు. రిజర్వేషన్ల వల్ల ఎస్సీ, ఎస్టీలు తమ ప్రతినిధులను చట్ట సభలకు పంపించగలిగారు. కానీ నిజమైన అధికారాన్ని నెరిపారా లేదా అన్నది వేరే విషయం. కాని వారు చట్ట సభలకు ఎన్నికవుతూ వచ్చారు. ఎటు కాకుండా పోయింది బీసి, ముస్లీం వర్గాలే. ఎంఐఎం అండన హైదరాబాద్‌లో ఒకరిద్దరు ముస్లీం నాయకులు ఎప్పుడూ ప్రతి సభలో ఉంటున్నారు. కానీ బీసిలో అధికారం పొందడంలో గానీ ఇతరత్ర గాని పూర్తిగా నష్టపోయారు. అటు తెలుగుదేశం కాని ఇటు కాంగ్రెస్ కానీ బీసిలకు ఉత్తుత్తి అధికారమే ఇచ్చారు. ఇక్కడ అగ్రకుల రూలింగ్ క్లాస్ వారు అనుభవించిన అధికారాలన్నీ బీసిలకు చెందాల్సినవే. భవిష్యత్‌లో తెలంగాణలో ఈ పరిస్థితి మారాలి. అధికారాన్ని అన్ని వర్గాల కులాల వారు సమంగా పంచుకోవాలి. లేని పక్షంలో అన్‌రెస్ట్, ఇలాగే ఉంటుంది.

## కులాల గొడవ

నాడు కొండా వెంకట రంగారెడ్డి, చెన్నారెడ్డి తదితర రెడ్డి సామాజిక వర్గ నాయకులకు భయపడి బూర్గుల రామకృష్ణారావు విశాలాంధ్ర ప్రతిపాదనను ఒప్పుకున్నాడు. నెహ్రూ ఎంత చెప్పినా వినకుండా తన మరణ శాసనంపై ఆయనే సంతకం చేసుకున్నాడు. అలా ఆనాడు ఒక నియోగి బ్రాహ్మణుడు తెలంగాణ ఏర్పాటు కాకుండా అడ్డుపడ్డాడు. 1969–70లలో చెన్నారెడ్డి, తదితరులు చేసిన ద్రోహం వల్ల తెలంగాణ రాకుండా పోయింది.

ఒక వెలమ నాయకుడి ఆధ్వర్యంలో తెలంగాణ రావడం ఇష్టంలేని రెడ్డి సామాజిక వర్గం ఉదాశీనత వల్ల తెలంగాణ ఏర్పాటు వేగవంతం కాలేదు. ఆ నాయకుడు కూడా తెలంగాణ ఖ్యాతి నా ఒక్కడికే, నా కుటుంబానికే, నా కులానికే దక్కాలి అనే ధోరణి వల్లనే తెలంగాణ ఉద్యమం నెమ్మదించింది. బీసీ కులాల పట్ల ఉన్న చిన్న చూపువల్ల పలువురు బీసీ నాయకులను దూరం చేసుకున్నందువల్ల కూడా తెలంగాణ రాష్ట్ర సమితి కొంత పలుచనైంది. సామర్థ్యం వున్న రెడ్డి సామాజిక వర్గ యువ నాయకత్వాన్ని టి.ఆర్.ఎస్. అగ్రనాయకత్వం పనిగట్టుకొని నిరుత్సాహ పరిచినందువల్ల కూడా తెలంగాణ ఉద్యమం వెనకబడ్డది. వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఆ సామాజికవర్గంతో పాటు బీసీ కులాల్లో చురుకైన రాజకీయ పాత్ర పోషిస్తున్న మున్నూరు కాపు, గౌడ కుల నాయకులు మిన్నకుండడం వల్ల కూడా తెలంగాణ ఉద్యమం నెమ్మదించింది.



## తెలంగాణా వైభవం

కృష్ణా, గోదావరి నదుల మధ్యన విస్తరించిన విశాల భూభాగం నైజాం దేశంలోనిదే. ఇదే తెలంగాణ. గోదావరి, కృష్ణానదుల అవతల కూడా రాజ్యం విస్తరించి ఉండేది. ఇది విశాల దెక్కన్ పీఠ భూమి. ఈ ప్రాంతపు మట్టిలో జర్మినేషన్ కెపాసిటి ఎక్కువ. పలు రకాల వృక్షాలు–చెట్లు–గుల్మాలు పెరగడానికి వీలయిన నేల ఇది. ఇక్కడి అడవుల్లో అనేక రకాల ఔషధ, మూలికలు లభ్యమయ్యేవి. 1930 వాటికి దేశ జనాభా దాదాపు 75–80 లక్షలుండేది.

ఇక్కడ వరితో సహా ఎన్నో రకాల పంటలు పండేవి. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు లాంటివి ప్రధాన పంటలుగా ఇతరత్ర అనేక రకాల పంటలు పండేవి. ఈత, తాటి కల్లు పుష్కలంగా లభ్యమయ్యేది. ఇప్పసారా కాయడం వీరికి బాగా తెలుసు.

మేకలు, గొర్రెల పెంపకం విస్తారంగా ఉండేది. ఏడాదికి ఒకసారి జరిగే బీరప్ప జాతరల్లో వేలాది గొర్రెలు తెగేవి. ప్రతి ఇంట్లో దాదాపుగా కోళ్ళ పెంపకం ఉండేది. దొండ, కాకర, దోస, సొర, గుమ్మడి, తోటకూర, పొన్నగంటి, పుంటికూర, తెల్ల గల్జేరు, ఎర్రగల్జేరు, పిండి ఆకు, చేమ తదితర ఆకు కూరలు సహజంగా పెరిగేవి. ఎవరు ప్రత్యేకంగా పండించే వారు కారు. పిందెలు తెంపడం నిషేధం. ప్రపంచంలోనే మేలు రకానికి చెందిన టేకు, జిట్రేగి (రోజ్‌వుడ్) మద్ది కలప ఇక్కడి అడవుల్లో విస్తారంగా లభిస్తుంది. వెదురు వనాలు కూడా ఉండేవి. 'కోల్డ్ ప్రాసెస్ ఐరన్ ఎక్స్‌ట్రాక్షన్ ఇక్కడి కమ్మరులకు తెలుసు.

ఇలా సర్వ సంపదలతో ధనధాన్యాలతో అన్ని జానపద కళలతో, పుష్కలమైన సహజ వనరులతో శాంతియుత మండలంగా ఉండేది కాబట్టే ఔరంగజేబు కన్ను ఈ ప్రాంతంపై పడ్డది. కాకతీయులకు ముందు ఆ తర్వాత కుతుబ్‌షాహిలు, అసఫ్ జాహిల కాలంలో దెక్కన్ తెలంగాణ భూమి విశేషాలివి. ఇది అద్భుతమైన దేశం, ప్రదేశం. అందుకే బాలాంత్రపు రజనీకాంతరావు "దెక్కన్ దివ్యభూమి" అనే కవితరాసి అద్భుతంగా పాడారు.

వాగులు వంకలు పుష్కలంగా ఉండేవి. వీటిలో దాదాపు ఆరునెలలు నీరు ప్రవహిస్తుండేది. బావుల క్రింద మోట, రాటుల ద్వారా వ్యవసాయాలు కూడా ఉండేవి. యాతాలు, గూడ తదితర నీటి పారుదల రీతులు ఉండేవి. అక్కడక్కడ తమల పాకులను, పండించే వారు. గ్రామాల్లో అన్ని రకాల చేతివృత్తుల వారుండే వారు.

వీటికితోడు చక్కటి వాతావరణ పరిస్థితులుండేవి. మొత్తం భూమండలం మీదనే మానవ ఆవాసానికి అత్యంత అనుకూలమైన వాతావరణం ఇక్కడ నెలకొని ఉంది కాబట్టే ఆంధ్రులదే కాదు అందరి దృష్టి ఇటు మళ్ళింది.

## సంపన్న చరిత్ర

బౌద్ధులకు ముందు అస్సక మహాజానపదం విస్తరించిన భూమండలం ఇది. శాతవాహనులు, ఇక్ష్వాకులు, శాలంకాయనులు, విష్ణుకుండినులు, కాకతీయులు కుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీలు పాలించిన నేల ఇది. జైనం బౌద్ధం పరిఢవిల్లిన పుణ్యభూమి ఇది. పూర్వం జైన, బౌద్ధ మతాలు ఇక్కడ బాగా వ్యాప్తిలో ఉండేవి. వీటికి తోడు జానపదులు గ్రామీణులు పోశవ్వ, మైశవ్వ, ఎల్లమ్మ, ఊరడమ్మ, ఉప్పలమ్మ, ముత్యాలమ్మ, లాంటి మాతృదేవతలను పూజించే వారు.శైవం కూడా ఎక్కువగా ఉండేది. అందుకే ఇక్కడ జనాలు శాంతి కాముకులు. వీరికి మోసాలు, కుట్రలు తెలియవు. వీరు నిష్కపటులు. అతిదులను ఆదరిస్తారు. పొరుగువారిని ప్రేమిస్తారు. ఈ గుణాలే తెలంగాణ వారి కొంప ముంచాయి. తర్వాత వైష్ణవం వచ్చింది.

ఆది మానవుడి దగ్గర నుండి మానవ నాగరికతలోని అన్ని దశలను విరామం లేకుండా చవి చూసిన నేల ఇది. ఆదిలాబాద్, కరీంనగర్ అడవుల్లో దొరికిన రాక్షసబల్లి పూర్తి అస్తిపంజర అవశేషం ఈ నేల పురాతత్వ శాస్త్ర విశేషాలను వెల్లడి చేస్తున్నది.

గద్వాల కోటలో ఒక భవనం బయట చూరుకు అలంకారంగా కొట్టిన చెక్కలపై దూలాలపై ఉన్న పనితనాన్ని చూస్తే కళ్లు చెదిరిపోతాయి. మెదక్ జిల్లా 'పాపన్న పేటలో' నూరేళ్ళ క్రితం కట్టిన కోమట్ల ఇంట్లో వేసిన సిల్వర్ కోటింగ్ , మొగురాల పనితనం, ఆ గోడకున్న తంజావూర్ పెయింటింగ్‌లు, సింహద్వారానికి చెక్కిన గుర్రపు బొమ్మలు, చూరుకు చెక్కిన చిలకలు, వెండిగ్లాసుల్లో చాయ్ త్రాగడం, ఆ ఇంటి నిర్మాణం బుర్ర తిరిగేలా చేస్తాయి. ఇది తెలంగాణ సాంస్కృతిక వైభవం.

జానపద కళారూపాలు లెక్క లేనన్ని ఉండేవి. ప్రతి ప్రధాన కులాన్ని ఆశ్రయించి ఒక ఆశ్రిత కులం ఉండేది. ఆ కులం వారు ఒక కళా రూపాన్ని సాధన చేసేవారు. సంపన్న మౌఖిక సాహిత్యం ఉండేది. పోతన, మల్లినాథసూరి తదితరుల వారసులుగా వచ్చిన పండితులు ఎందరో సాహిత్య సృజనలో మునిగి తేలేవారు. గ్రామాల్లో పరస్పరం సహరించుకునే కుల వ్యవస్థ ఉండేది. పంచతాయిలు, కురుమ, శాలి, కుమ్మరి, మేదరి తదితర వృత్తి కులాల వారు అద్భుత పనిని ప్రదర్శించేవారు. గ్రామాల్లో అన్ని కులాల వారు పేర్లతో కాకుండా వరుసలతో పిలుచుకునే వారు. భూములు అచ్చు కట్టడానికి, బావులు త్రవ్వడానికే ఒక కులం ఉంది. ఇండ్లు నిర్మించే కులం వేరుగా ఉంది.దేవాలయాలు కట్టేవారు వేరుగా ఉ ండరు. అయితే శ్రమకు తగిన వేతనం ఉండేది కాదు. ఈ వృత్తి కులాల వారికి కనీసం అవసరాలు తీరుస్తూ, కొద్ది సంపదను మాత్రమే కళ్ల చూడనిచ్చేవారు. ఇలా పని, శ్రమ



విభజన చక్కగా ఉండేది.

## సంస్కృతి-కళాసంపద

కాకతీయుల కోట శిలా తోరణాలు ధ్వంసం కాగా మిగిలిన శిల్ప శకలాలు చూపరుల మతి పోగొడుతాయి. రామప్ప, వేయి స్తంభాల గుడి మానవ జాతి గర్వించ దగినవి. పచ్చల చాయ సోమేశ్వరాలయం అలంపురం శిల్పసపందను ఎంత వర్ణించినా తక్కువే. ఆదిలాబాద్ జైనద్ గుడి. కొలనుపాక జైన క్షేత్రం. నిజామాబాద్‌లోని జానకం పేట గుట్ట, తిలక్ గార్డెన్‌లో చెట్టుక్రింద నిలిపిన జైన విగ్రహం. అల్లా దుర్గం ఊరు ఊరంత ఒక జైన మ్యూజియంగా ఉంటుంది. కొలిచెలమలో బయటపడిన జైన విగ్రహం. దుద్దే గుడి బయటపడి ఉన్న జైన శిల్పాలు ఈ నేలలో జైన మత ఉచ్ఛ స్థితిని చాటి చెబుతున్నాయి.

## దశబంధ చెరువులు

తెలంగాణ అంతటా చాలా చెరువులుండేవి. దశబంధ గొలుసుకట్టు చెరువులుండేవి. ప్రతి ఊరికి ఒక పెద్ద చెరువు, ఒక చిన్న చెరువు మరో కుంట ఉండేది. వీటి క్రింద అన్ని రకాల పంటలు పండేవి. పశుసంపద ఉండేది. సీతాఫలం, జీడి, తునికి, చింత, రేగు, ఇరికి, చెన్న మామిడి, ఎలిక లాంటి సహజ ఫలవృక్షాలు పుష్కలంగా ఉండేవి. అటవీ ప్రాంతంలో మాంసం కోసం ఎన్నోరకాల జంతువులుండేవి. దుప్పి, జింక, కుందేలు, ఏదు, ఉడుము తదితరమైని చెప్పుకోదగినవి.

తెలంగాణ వారికి పంటలు పండించడం మేమే నేర్పించాము అని నోరారా అంటుంటారు కొందరు. ఎంతధైర్యమో వారికి. లక్నవరం, పాకల, రామప్ప, పొలాస, శనిగరం, సిర్నపల్లి, పాన్‌గల్ చెరువులు ఎంత పెద్దవో ఊహకు కూడా అందవు. ఇవి సాగరాలంతటి చెరువులు. ఒక్కో చెరువు క్రింద ఏడాదికి దాదాపు లక్ష ఎకరాలు వరి సాగు అవుతుంది. రామప్ప చెరువును ఎప్పుడు ఎవరు నిర్మించారో ఆంధ్రులకు తెలుసా? కనీసం ఎన్ని శతాబ్దాలు అయ్యిందో తెలుసా? ఏడాదికి లక్ష ఎకరాల్లో ఇన్ని శతాబ్దాలుగా ఎన్ని కోట్ల పుట్ల వడ్లను వీరు పండించి ఉంటారు. ఇలా మొత్తం తెలంగాణలో ఎన్ని వడ్లు పండి ఉంటాయో యోచించిండి. ఇక్కడి బియ్యం అటు సూరత్ ఇటు తంజావూరు చెన్నైల వరకు వెళ్ళేవి. నిజామాబాద్, ఆదిలాబాద్‌తో సహా అన్ని జిల్లాల్లో ఒక్క ఉప్పు తప్ప సమస్త పంటలు పండుతాయి. ఉల్లి, వెల్లుల్లి, పసుపు, అల్లం, మిరప, ధనియాలు, మెంతులు, ఆవాలు, కుసుమలు, నువ్వులు, ఆముదాలు, తైదలు, సజ్జలు, బావంచాలు, సోంపు, జీలకర్రలతో

పాటు అన్ని రకాల పప్పులు పండేవి. పత్తిసాగు విస్తారంగా ఉండేది. వీటి విత్తనాలను వీరేమీ బయట నుండికొనే వారు కాదు వీరే సిద్ధం చేసుకునేవారు. ఏ పంటను ఎప్పుడు ఎలా పండించాలో వీరికి బాగా తెలుసు. ఎవరి దగ్గర నేర్చుకోవాల్సిన అవసరమే లేదు.

ఇప్పుడు వలస పాలకుల పాపిష్టి పాలనలో కరువుపడ్డ పాలమూరులో ఒకప్పుడు వందలాది రకాల వడ్లుండేవి. కేవలం వడ్ల పేర్లతోనే పద్యాన్ని చెప్పే విషయమై పందెం వేసుకున్న సందర్భంలో ఒక కవి రాసిన పద్యమాలిక ఉంది.కేవలం పాలమూరులో పండే వడ్ల పేర్లతో రాసిన పద్యం అది.

తెలంగాణ వ్యతిరేకి శ్రీశ్రీ

తెలియక అమాయకులైన తెలంగాణ వారు ముఖ్యంగా వామపక్షాల వారు, విరసం మాయలో పడి శ్రీశ్రీని ఆరాధిస్తుంటారు. కానీ శ్రీశ్రీ పచ్చి తెలంగాణ వ్యతిరేకి. ఆరుద్ర తన పుస్తకానికి తెలంగాణ అని పేరు పెడితే దానిని "త్వమేవాహం" గా మార్పించిన పెద్దమనిషి శ్రీశ్రీ. గాడిద బొమ్మ గీసి గాడిద అనే పేరు రాయడం దేనికి.. తెలంగాణ పై రాసిన కావ్యానికి తెలంగాణ అని పేరు పెట్టడం దేనికని ఆరుద్రను తప్పుదోవ పట్టించిన గడసరి శ్రీశ్రీ. తెలంగాణ పోరాట సమయంలో నిజాం రేడియోలో పనిచేస్తూ రాజరికానికి వత్తాసు పలికిన వీర కమ్యునిస్టు శ్రీశ్రీ. ఒకవైపు విప్లవకవిగా ఎనలేని గౌరవం, ప్రచారంపొందుతూ మరోవైపు ఎమర్జెన్సీని సమర్ధిస్తూ, ఇందిరాగాంధీని పొగడుతూ శ్రీశ్రీ విరసం బహిష్కరణకు గురైనారు. పలుసందర్భాలలో ముఖ్యంగా 1969 ఉద్యమప్పుడు తెలంగాణా వాదాన్ని బాహాటంగా వ్యతిరేకించారు. తెలంగాణ సాహితీవేత్తలను చులకన చేసి మాట్లాడారు. ఆ సందర్భంగానే చిత్రకారుడు చంద్ర శ్రీశ్రీని వ్యతిరేకించిన విషయం ఆనాటి విరసం వారందరికీ తెలుసు. అయన తెలంగాణా వాదాన్ని నిరసించినా సిగ్గులేని తెలంగాణా విప్లవవాదులు ఆయనను నెత్తిన బెట్టుకుని ఊరేగుతూనే ఉన్నారు. శ్రీశ్రీకి కవిగా యోగ్యతా పత్రం ఇచ్చిన గుడిపాటి వెంకటాచలం "ఈ కోస్తాంధ్రులు తెలంగాణ వారిని సుఖంగా ఉండనివ్వరని" గట్టిగా చెప్పాడు. ఈ విషయాన్ని మనం మరువకూడదు.

రాజకీయ ఆర్థికరంగాలలోనే కాదు సాహిత్యం, చరిత్ర, సినిమాలు, నాటకాలు తదితర సమస్త సాంస్కృతిక రంగాలలో తెలంగాణ వారు చిన్నచూపు చూడబడ్డారు. తెలంగాణ బ్రాహ్మణ,రెడ్డి కులాల వారు కొంత ఆదరింపబడినప్పటికీ ఇతర కులాల వారు మరింత నిరాదరణకు అన్యాయానికి గురయ్యారు.



## 1969-72 ఉద్యమాలు

దాదాపు 400 మందిని బలిగొన్న 1969 తెలంగాణ ఉద్యమం ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి రాజీనామాతో చల్లారింది. నాడు తెలంగాణను వ్యతిరేకించిన, సమర్థించిన రెండు వర్గాలూ కాంగ్రెస్ వారివే. ఇరు వర్గాల నాయకులు ఇందిరాగాంధీ నాయకత్వాన్ని సమర్థించినవారే. ఆ తర్వాత 1972లో పి.వి. నరసింహారావు తప్పుకోవడానికి కూడా జై ఆంధ్రా ఉద్యమం కారణమైంది. అప్పుడు ఈ ఉద్యమాల వెనుక కొన్ని శక్తులు ఉన్నాయి. భారీ ఎత్తున డబ్బు విచ్చలవిడిగా ప్రవహించింది. తెలంగాణ వాది అయిన పివి నరసింహారావు తెచ్చిన భూ సంస్కరణలు సహించలేక ఆయనను గద్దెదించడానికి భూస్వాములు ఆనాడు కుట్రపన్నారు.

తెలంగాణ ఉద్యమం ఎగిసి చల్లారిన ప్రతిసారి ఆంధ్రపాలక వర్గం మరింత గట్టిపడటం, వలసలు ఉధృతం అయ్యేవి. ఆ ఉద్యమాల వల్ల తెలంగాణకు ఏమీ ఒరగలేదు. మరికొన్ని సార్లు ఉద్యమం ముఖ్యమంత్రిని మార్చడానికి, లేక దించడానికి కాంగ్రెస్ వారికి పనికొచ్చింది. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న కాలంలో వైఎస్ రాజశేఖరరెడ్డి సోనియా గాంధీకి తెలంగాణ ఎమ్మెల్యేల ద్వారా తెలంగాణ కావాలంటూ వినతి పత్రం ఇప్పించారు. ఆయన రాజేసిన కుంపటిని ఆయనే చల్లార్చారు. ఆబూడిద కూడా రేగకుండా అపర చాణక్యుడిలా ప్రవర్తించారు. అప్పుడు పుట్టిన ప్రత్యేక రాష్ట్రకాంక్ష నివురు కప్పిన నిప్పులా ఆరకుండా ఉంది.

కేసిఆర్ తెలుగుదేశం నుంచి బయటికి రావడానికి, టిఆర్ఎస్ ఆవిర్భావానికి ఇలాంటి సంఘటనలు కారణమయ్యాయి. ఒక రకంగా తెలుగుదేశం పార్టీ ఓడిపోయి చంద్రబాబు నాయుడు ముఖ్య మంత్రి పదవి కోల్పోవడానికి వైఎస్ ముఖ్యమంత్రి కావడానికి ఆ వ్యూహం ఉపకరించింది. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించి వైఎస్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి దించడానికి చంద్రబాబు కెసిఆర్‌తో చేతులు కలిపారు. కానీ ఆయన లక్ష్యం నెరవేరలేదు.

ఏ సందర్భం వచ్చినా, ఏ అవకాశం చిక్కినా ప్రతి తెలంగాణ పౌరుడు మనసావాచా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర కాంక్షను రకరకాలుగా వ్యక్తం చేస్తున్నారు. ఈ సారి మీరు తెలంగాణ ఇవ్వక పోతే మాకు బ్రతుకే లేదని పలువురు బ్రతుకులను చాలించారు. అయినా కేంద్ర ప్రభుత్వం, గుంటూరు జిల్లాకు చెందిన కోణిజేటి రోశయ్య ఉలక లేదు, పలక లేదు. లౌక్యంతో మాటల గారడీతో సమస్యను దాటవేసే ప్రయత్నం చేశారు. కాని కేంద్రమే చొరవ తీసుకుని తెలంగాణ ప్రకటన చేసింది. రోశయ్య తన మాటలు, చేతల ద్వారా సమైక్యవాద ధోరణిని వ్యక్తం చేస్తూనే ఉన్నారు.

## విగ్రహాల గోల

హైదరాబాద్‌లో మాజీ ప్రధాని పి.వి నరసింహారావుది గానీ కాళోజీది గానీ ఒక్క విగ్రహం లేదు. కానీ వీధివీధినా వందలాది మంది ఆంధ్రనాయకుల విగ్రహాలున్నాయి. విగ్రహాలున్నందుకు అభ్యంతరంలేదు కానీ మరి ఆంధ్రనగరాలు, పట్టణాలలో ఒక్క తెలంగాణ నాయకుని విగ్రహమైనా ఉందా.. బూర్గుల, కాళోజి, పివి నరసింహారావు, అంజయ్య, సురవరం, వానమమలై, కొమరం భీం, రామానంద తీర్థ, దాశరథి, రావినారాయణ రెడ్డి, కేవీ రంగారెడ్డి, చెన్నారెడ్డి, మల్లికార్జున గౌడ్, భాగ్యరెడ్డి వర్మ , షోహెబుల్లా ఖాన్, తుర్రేబాజ్ ఖాన్, మగ్దూం, సంగెం లక్ష్మీభాయి, ఈశ్వరీబాయి, అయిలమ్మ తదితరుల విగ్రహం ఒక్కటైనా ఆంధ్ర, సీమ ఊళ్లల్లో కనిపిస్తాయా..

ట్యాంకుబండు మీద ప్రముఖ తెలుగువారి విగ్రహాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి యన్టీరామారావు సంకల్పించారు. ఎవరెవరి విగ్రహాలు పెట్టాలో అధికారులు ఒక లిస్టును తయారు చేశారు. ప్రాంతం కులం వంకతో ఆ లిస్టులో ఎన్నో పేర్లు తొలగించ బడ్డాయి. ఈ విషయాన్ని ఎన్టీఆర్ వద్ద ప్రత్యేకఅధికారిగా పనిచేసిన గోటేటి రామచంద్రరావు మనకు వివరించగలరు (ఆయన లౌక్యాన్ని పక్కన పెట్టగలిగితే). ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి యన్జీరంగా పేరును జోడించడం దేనికి ?అలాగే తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును ఎందుకు అతికించారు. బ్రహ్మానందరెడ్డి పార్కుకు ఆ పేరు ఎందుకు పెట్టారు. ఇలా ఎన్నోరకాల అన్యాయాలు... సాంస్కృతిక దాడులు ఎన్నని వివరించగలం? రాజధాని నగరంలో ఉన్న వీధుల పేర్లుకు గానీ విగ్రహాలు నిలిపిన ప్రదేశాలకు, ఆ వ్యక్తులకు ఏమైనా సంబంధం ఉందా ? కాసు బ్రహ్మానంద రెడ్డికి జూబ్లీహిల్స్ పార్క్‌కు ఏమైనా సంబంధం ఉందా? ఇసిఐల్‌ను అభివృద్ధి పరచిన శాస్త్రవేత్త ఎయస్ రావు పేరుతో కుషాయిగూడ దగ్గర ఎయస్ రావు నగర్ నిర్మితమైంది. ఇందులో సహేతుకతను కొంత అర్థం చేసుకోవచ్చు. వీరుకూడా అంధ్రుల పక్షపాతియే.వీరు ఆంధ్రులకు ఉద్యోగాలిచ్చారు. ఏ సంబంధం లేని ఏందరివో విగ్రహాలు హైదరాబాద్‌లో, తెలంగాణ లోని ఇతర ప్రాంతాలలో నిలిపారు. ఇది సాంస్కృతిక సామ్రాజ్య వాదం కాదా?

ఈ విగ్రహాల గోల ఒక్క హైదరాబాద్‌లోనే కాకుండా తెలంగాణ అన్ని పట్టణాల్లో, గ్రామాల్లో వుంది. తెలంగాణ ప్రజల బోలాతనం వల్ల ఎవరెవరి విగ్రహాలో ఊరు మధ్యలో నిలిచాయి. తెలంగాణ వారి విగ్రహాలు మట్టుకు ఏర్పడలేకపోయాయి.



## తెలంగాణా వచ్చాక

తెలంగాణ కావాలి అని అంటున్నారు, తెలంగాణా ఆవిష్కృతమైతే ఏం చేయబోతున్నారు? ఏ పార్టీ స్పష్టంగా చెప్పడం లేదు. వలస వాదులు ఇక్కడ దోచుకోగా మిగిలిన వనరులు ఎన్ని? ఆక్రమించుకోగా మిగిలిన ఆస్తులు ఎన్ని? ఈ ప్రాంత అభివృద్ధికి చేపట్టే కార్యక్రమాలు ఏమిటి? అధికారాన్ని, వనరులను ఎలా పంపిణీ చేయబోతున్నారు? రెంట్ కంట్రోల్ చట్టం వల్ల కలిగిన నష్టాన్ని పూడుస్తారా? జంటనగరాల్లో స్థిరపడి సెటిలయిన కోస్తాంధ్ర కోటీశ్వరులను ఏం చేయబోతున్నారు? భూ సంస్కరణల చట్టాన్ని తిరిగిరాస్తారా? పరాధీనం అయిన ప్రభుత్వం పంచిన మాల మాదిగలతో సహా ఇతర ఎస్సీల భూములను స్వాధీనం చేసుకొంటారా? రామోజి ఫిల్మ్‌సిటి లాంటి విశాల ఆస్తులను జాతీయం చేస్తారా? హౌసింగ్ బోర్డ్‌ల పేరుతో సంతర్పణ చేసిన ఇండ్లను వెనక్కి తీసుకుంటారా? ఫ్రీజోన్‌ను ఫ్రీజ్ చేస్తారా?

1956 నుండి ఆంధ్ర, సీమ, ఇతర రాష్ట్రాల వారు ఇక్కడ సంపాదించుకున్న అక్రమ ఆస్తులను సర్వే చేయిస్తారా? ఉద్యోగార్థులై బ్రతకడానికి వచ్చిన వారితో స్థానికులకు ఎలాంటి పేచి లేదు. తంటాలన్నీ అక్రమార్జన పరులతోనే. సామాన్య ఉద్యోగులను, వ్యాపారులను ఎందరినైనా తెలంగాణ భరిస్తుంది. వందలు, వేల ఎకరాలు అక్రమంగా సంపాదించుకున్న వారి నుండి ఆస్తులను వెనక్కి తీసుకుంటారా? 1956 తర్వాత బదలాయింపు జరిగిన రికార్డులను తిరగ రాస్తారా? దోచుకు పోతున్న జలవనరులను ఆపుతారా? ఇక్కడ ప్రభుత్వంలో తిష్ట వేసుకుని కూర్చున్న పెద్ద అధికారులను ఏం చేస్తారు?

610 జి.ఓ. క్రింద ఒక్కరంటే ఒక్క అధికారిని వెనక్కి పంపలేకపోయిన మాయ వారిది. 610 క్రింద హైదరాబాద్‌లో ఉన్న తెలంగాణ జిల్లాల అధికారులకు పంపి తెలంగాణ వారి చెప్పుతో తెలంగాణ వారినే కొట్టిన గడసరితనం ఆంధ్ర, సీమ ప్రాంత నాయకులది, అధికారులది. అలాంటి చట్టాలను ఉల్లంఘించిన వారిని ఏం చేయబోతున్నారు?

### విడిపోయే ముందు మనస్పర్థలొద్దు

బొచ్చె, మంచం, వండుకోవడానికి కుండలు మాత్రమే ఉన్న చిన్న ఇంట్లోనే ఆస్తుల పంపకాలంటే ఎంతో కొంత ఘర్షణ జరుగుతుంది. అలాంటిది ఏడాదికి దాదాపు లక్షకోట్ల పైగా బడ్జెట్‌తో నడుస్తున్న రాష్ట్రం విడిపోయే ముందు అనేక సమస్యలు తలెత్తుతాయి. గడసరులు సహజంగానే ఎక్కువ లబ్ధిపొందుదాం అనుకుంటారు. సోదరుల్లా విడిపోదాం అనే ఆకాంక్షను అందరూ పాటిస్తే గొడవే ఉండదు.